www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 26-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 132

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి రా. 2.20 తదుపరి నవమి; నక్షత్రం: కృత్తిక మ. 3.55 తదుపరి రోహిణి; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: మ.12.41-1.31, మ.3.10-4.00; అమృతఘడియలు: మ.1.36-3.08; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.03; సూర్యాస్తమయం: 6.29

హైదరాబాద్ సిటీ

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మహిళలపై నేరాలు.. క్షమించరాని పాపాలు

దోషులను వదిలే ప్రసక్తే లేదు.. ఈ సందేశం పై నుంచి కింది వరకు వెళ్లాలి

ప్రభుత్వాలు వస్తాయి పోతాయి.. కానీ మహిళల రక్షణ అందరి బాధ్యత

స్వయం సహాయక బృందాలకు రూ.9 లక్షల కోట్లు సాయం చేశాం

రాజకీయ నేపథ్యం లేని యువత రాజకీయాల్లోకి రావాలి

'మన్ కీ బాత్', 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాల్లో ప్రధాని

2



తెలుగు భాష అద్భుతం.. తెలుగు భాషా దినోత్సవ శుభాకాంక్షలు: మోదీ

ఆక్రమణల కూల్చివేతలు..

శ్రీకృష్ణుడు బోధించిన యుద్ధనీతిని పాటిస్తున్నాం

భగవద్గీత స్ఫూర్తితోనే..

చెరువుల్లో శ్రీమంతుల ఫాంహౌస్‌లు

తాగునీటి జలాశయాల్లోకి వాటి మురుగుకాల్వలు

అలా వదిలేస్తే ముఖ్యమంత్రిగా విఫలమైనట్టే కదా!

కబ్జాల నుంచి చెరువులకు విముక్తే లక్ష్యం

హైదరాబాద్‌ను విపత్తుల నుంచి కాపాడేందుకే..

ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే వ్యక్తులైనా వదలం

కక్షసాధింపుల్లేవు.. రాజకీయాలకు సంబంధం లేదు

ధర్మయుద్ధంలో ప్రజలు అండగా నిలవాలి: సీఎం

హరేకృష్ణ టవర్స్ అనంత శేష స్థాపనలో రేవంత్

ప్రభుత్వ మార్గంలోనే బ్రహ్మకుమారీస్ ఎజెండా

డ్రగ్స్ నిర్మూలనకు కార్యాచరణ సంతోషకరం

శాంతి సరోవర్ భూమి లీజు గడువును పొడిగిస్తాం

12 శాంతి సరోవర్ ద్విదశాబ్ది వేడుకల్లో సీఎం

అవకాశం ఇస్తే తెలంగాణలో 2036 ఒలింపిక్స్

12 అంతర్జాతీయ స్థాయి వసతుల కల్పనకు రెడీ

మారథాన్ 10కె రన్ కార్యక్రమంలో సీఎం రేవంత్



బ్రహ్మకుమారీస్ శాంతి సరోవర్ ద్విదశాబ్ది వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్రమ కట్టడాల కూల్చివేతకు స్ఫూర్తి 'భగవద్గీత' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. ధర్మాన్ని రక్షించేందుకు 'గీత'లో శ్రీకృష్ణుడు బోధించిన యుద్ధనీతి స్ఫూర్తితోనే ప్రజల జీవన విధానంలో, సంస్కృతిలో భాగమైన చెరువులను సంరక్షించే మహాయజ్ఞానికి తమ ప్రభుత్వం నాంది పలికిందన్నారు. "ప్రజా ప్రతినిధులు విధి నిర్వహణలో భాగంగా తెలియకుండా కొన్ని తప్పులు చేస్తుంటారు. వాటిని సవరించుకోడానికి తెలిసి కొన్ని

మిగతా 13వ పేజీలో...

కాంగ్రెస్ కండువా కప్పుకోకుంటే కేసులా?

రేవంత్ సర్కార్ మా ఎమ్మెల్యేలను వేధిస్తోంది

హైడ్రాతో రాజకీయం: హరీశ్

నా మెడికల్ కాలేజీని కూల్చేందుకు కుట్ర: పల్లా

13

చెరువుల చెర.. వారి పనే!

బఫర్ జోన్లలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నిర్మాణాలు

వ్యాపారులు, సినీ ప్రముఖులవీ.. హిమాయత్‌సాగర్‌లో భవనాలు

గండిపేటలో పల్లం రాజు, కావేరి సీడ్స్, ప్రొ కబడ్డీ ఓనర్ల ఆక్రమణలు

నందగిరిహిల్స్ పార్కు కబ్జాకు దానం నాగేందర్ సహకారం

బుమ్‌రుఖ్‌దౌలా చెరువులో కట్టడాల వెనుక మజ్లిస్ నేతలు

ఇప్పటివరకు 18 ప్రాంతాలు.. 44 ఎకరాల్లో కూల్చివేతలు

'ఎన్' కన్వెన్షన్‌లో 4.9 ఎకరాలలో నిర్మాణాలు నేలమట్టం: హైడ్రా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి క్రమంలో భూముల ధరలు అనూహ్యంగా పెరగడంతో కబ్జా చేసి కొందరు..! తక్కువ ధరకు కొని ఇంకొందరు..! హైదరాబాద్ మహా నగరంలో చెరువులు, పార్కులు, నాలాల పక్కన ప్రభుత్వ స్థలాలను చెరపట్టింది ప్రజాప్రతినిధులు, రాజకీయ, అధికార అండదండలున్న వ్యాపార, సినీ ప్రముఖులే. ఆక్రమణలకు పాల్పడిన నాయకుల్లో అధికార, ప్రతిపక్షం అన్న తేడా లేదు..! అన్ని పార్టీల వారిదీ ఇదే తీరు..! హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్ ప్రొటెక్షన్ అండ్ మానిటరింగ్ ఏజెన్సీ (హైడ్రా) కూల్చివేతల నేపథ్యంలో

మిగతా 13వ పేజీలో...

ఒక్క సెంటు కూడా ఆక్రమించలేదు..

ఎన్ కన్వెన్షన్ అంశంలో ఊహాగానాలు ఎక్కువయ్యాయి: నాగార్జున

13

హైడ్రా పరిధిని విస్తరించండి

జిల్లాల్లోనూ అక్రమ నిర్మాణాల్ని తొలగించండి

హుస్సేన్‌సాగర్‌లో కబ్జాలపై చర్యలు చేపట్టండి

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అద్దూరి వినతి

13



సామాన్యుల జోలికొస్తే ఊరుకోం

పెద్దల అక్రమ కట్టడాలను కూల్చివేస్తే ఓకే

పేదల ఇళ్లను పడగొడితే చూస్తూ కూర్చోం

సమస్యలపై పక్కదారికే హైడ్రా: ఈటల

13

నాగార్జునకు అంత కక్కుర్తి ఎందుకు?

ఎన్-కన్వెన్షన్‌పై రోజుకు లక్షల సంపాదన

ఆ సొమ్మును రాబట్టి, పేదలకు ఇళ్లు కట్టాలి

సీఎం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: నారాయణ

హైడ్రా పేరుతో జనాన్ని భయపెడుతున్నారు!

మంత్రుల్లో సమన్వయ లోపం: కూనంనేని

మబ్బుల్ని ఛేదించే నాయకత్వం ఉండాలి

రాష్ట్ర టీడీపీ నేతలకు చంద్రబాబు పిలుపు

పార్టీలో చేరికలకు ప్రోత్సాహం

యువ నాయకత్వానికి ప్రాధాన్యం

కమిటీల రద్దు.. త్వరలో అడ్‌హక్ కమిటీలు

చంద్రబాబుతో బాబూమోహన్ భేటీ



ఎన్టీఆర్ భవన్‌లో ఏపీ సీఎం చంద్రబాబు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): "మబ్బులు వస్తూ ఉంటాయి. కానీ వాటిని ఛేదించుకుని ముందుకు వెళ్లే నాయకత్వం ఉండాలి. పార్టీపై స్థానిక నాయకత్వం ప్రజల్లో నమ్మకం కలిగించాలి. విశ్వాసాన్ని పెంచుకోవాలి" అని టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తెలంగాణలో టీడీపీ నేతలతో అన్నారు. ఆదివారం, ఎన్టీఆర్‌భవన్‌లో ఆయన రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలతో దాదాపు రెండు గంటల పాటు చర్చించారు. రాష్ట్రంలో టీడీపీ బలోపేతం, సభ్యత్వ నమోదుపై దిశానిర్దేశం చేశారు. పార్టీనుంచి వెళ్లిపోయిన వారిని తిరిగి ఆహ్వానించాలని, వారితో పాటు కొత్తవారిని కూడా చేర్చుకోవాలని సూచించారు. పార్టీకి గుర్తింపు తీసుకువచ్చే నాయకత్వం అవశ్యకత ఉందని.. నాయకుల సీనియారిటీని, పార్టీపట్ల అంకిత భావాన్ని గౌరవిస్తూనే.. పార్టీలోకి కొత్తగా వచ్చే నాయకులను ప్రోత్సహిస్తామని, యువతకు ప్రాధాన్యమిస్తామని వెల్లడించారు. ప్రతి 15 రోజులకూ

మిగతా 14వ పేజీలో...

కన్న కొడుకులే కాలయములు

నల్లగొండ జిల్లా నిడమనూరులో మద్యం మత్తులో తల్లి గొంతు కోసిన కసాయి

అదే కత్తితో గొంతుకోసుకొని ఆత్మహత్య

పాలమూరు జిల్లా సల్కర్‌పేటలో తల్లి తలపై మోది, గొంతు కోసిన ఉన్మాది

ఖర్చులకు డబ్బులడిగితే ఇవ్వలేదని..

3

ఇజ్రాయెల్ X హెజ్బొల్లా





తమవైపు దూసుకొస్తున్న హెజ్బొల్లా రాకెట్‌ను ఇజ్రాయెల్ వైమానిక దళం పేల్చివేస్తున్న దృశ్యం; ఉత్తర ఇజ్రాయెల్‌లోని ఎకర్‌లో ధ్వంసమైన ఇల్లు

320కి పైగా కత్యూష రాకెట్లు, డ్రోన్లతో దాడికి సిద్ధమైన హెజ్బొల్లా

ముందే పసిగట్టి 100 ఫైటర్ జెట్లతో విరుచుకుపడిన ఇజ్రాయెల్ సైన్యం

దాడుల్లో లెబనాన్‌లో ముగ్గురి మృతి

ఐరన్ డోమ్ ప్లాట్‌ఫారాలే లక్ష్యంగా రాకెట్ల వర్షం కురిపించిన హెజ్బొల్లా

జెరూసలెం, ఆగస్టు 25: దాదాపు పది నెలలుగా ఉద్రిక్తంగా ఉన్న పశ్చిమాసియా.. ఆదివారం మరోసారి బాంబుల మోతతో దద్దరిల్లింది! హెజ్బొల్లా నేత ఫవాద్ షుకూర్ హత్యకు ప్రతీకారంగా ఇజ్రాయెల్‌పై కత్యూష రాకెట్లతో, డ్రోన్లతో దాడి చేయడానికి ఆ సంస్థ సిద్ధమైంది. అయితే, ఈ విషయాన్ని నిఘా వర్గాల ద్వారా ముందుగానే పసిగట్టిన ఇజ్రాయెల్.. ముందస్తు దాడికి దిగింది. 100 యుద్ధవిమానాలతో తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. దక్షిణ లెబనాన్ సరిహద్దుల్లో 5 కిలోమీటర్ల మేర తమ దేశం దిశగా హెజ్బొల్లా మోహరించిన రాకెట్ లాంచర్లే లక్ష్యంగా దాడులు జరిపింది. ఆదివారం

మిగతా 2వ పేజీలో...

రుణమాఫీలో స్వీయ ధ్రువీకరణ

కుటుంబ సభ్యుల వివరాల నమోదు బాధ్యత రైతులకే..

తప్పుడు సమాచారం ఇస్తే మాఫీ మొత్తం రికవరీ

12

ఏవోలకు అందుబాటులోకి 'సీఎల్‌డబ్ల్యూ' యాప్

8 దశల్లో రైతుల వివరాలు.. చివరి దశలో ధ్రువపత్రం అప్‌లోడ్

రూ.2 లక్షలలోపు రుణమాఫీ కానివి 5,49,418 ఖాతాలు



పాత-కొత్త కలయికే ఏకీకృత పింఛన్

సీపీఎస్ కంటే ప్రయోజనాలు ఎక్కువే

రాష్ట్రాల్లో అమలు చేస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లబ్ధి

యూపీఎస్, ఎన్‌పీఎస్, ఓపీఎస్‌లో తేడాలెన్నో!

2

పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలంటూ ఉద్యోగ సంఘాలు చేసిన పోరాట ఫలితంగా కేంద్రం మరో పెన్షన్ పథకాన్ని అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చింది. కొత్త(జాతీయ) పెన్షన్ విధానం(ఎన్‌పీఎస్) స్థానంలో పాత పథకాన్ని పునరుద్ధరించకుండా.. ఏకీకృత పింఛన్ పథకాన్ని(యూపీఎస్) తీసుకువచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ శనివారం పచ్చజెండా ఊపిన విషయం తెలిసిందే..! ఈ పింఛన్ పథకాల మధ్య తేడాలేమిటి? ఏది మంచిది? యూపీఎస్ నిజంగానే ఉద్యోగుల భవిష్యత్‌కు భద్రత కల్పిస్తుందా?

కేంద్రం కులగణన నిర్వహించాల్సిందే

కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ డిమాండ్

నాడు కాంగ్రెస్ ఎందుకు చేపట్టలేదు?

2

బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి ప్రశ్న





74 ట్రామా కేర్ కేంద్రాలు

రాష్ట్ర వ్యాప్తంగా హైవేలపై ఏర్పాటు

వీటికి తల్లి లేదా టెల్‌మీ పేరు?

తొలి విడతలో 24 కేంద్రాలు

ఒక్కో కేంద్రంలో 73 మంది సిబ్బంది

అంచనా వ్యయం 1,116 కోట్లు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాప్తంగా జాతీయ రహదారుల వెంట 74 ట్రామా కేర్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మూడు దశల్లో వీటిని అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్న సర్కారు.. వచ్చే నెల నుంచే మొదటి దశ కేంద్రాల ఏర్పాటుకు సన్నద్ధమైంది. వీటికి తెలంగాణ హైవే యాక్సిడెంట్ లైఫ్ లైన్ ఇనీషియేటివ్(తల్లి),

మిగతా 14వ పేజీలో...

కేంద్రం కులగణన నిర్వహించాల్సిందే

» కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ డిమాండ్

న్యూఢిల్లీ, ఆగస్టు 25: కేంద్ర ప్రభుత్వం కులగుణన నిర్వహించాల్సిందే నని కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ పట్టుబడుతుంటే.. ఇదే అంశంపై విపక్షంలో ఉండి కూడా కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పిస్తూ బీజేపీకి అనుకూలంగా మాట్లాడుతున్నారు మాయావతి! బీజేపీ మిత్రపక్షమైన లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడిగా ఆదివారం మళ్లీ ఎన్నికైన సందర్భంగా చిరాగ్ మాట్లాడుతూ కులగణనపై తమ వైఖరిని పునరుద్ఘాటించారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలన్నదే ఎప్పటి నుంచో తమ డిమాండ్ అని పేర్కొన్నారు. అప్పుడే ప్రభుత్వం వద్ద సరైన గణాంకాలు ఉంటాయన్నారు. అయితే కులగణన వివరాలను బహిర్గతం చేయాలని తాము కోరుకోవడం లేదని, వెల్లడిస్తే సమాజంలో చీలిక రావచ్చని పేర్కొన్నారు. ఈ విషయంలో బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి మాత్రం బీజేపీని వదిలి.. కాంగ్రెస్‌పై విమర్శలు చేస్తున్నారు. బీజేపీకి ముందు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కులగణన ఎందుకు నిర్వహించలేదని, ఇప్పుడు ఎందుకు మాట్లాడుతోందని ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలను రిజర్వేషన్లను వ్యతిరేకించే పార్టీలుగా విమర్శించిన ఆమె వాటితో ఎట్టి పరిస్థితుల్లో పొత్తు ఉండదన్నారు.

టెలిగ్రామ్ సీఈవో పావెల్ దురోవ్ అరెస్టు



పారిస్, ఆగస్టు 25: టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు, సీఈవో పావెల్ దురోవ్‌ను పారిస్‌లో పోలీసులు అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం పారిస్‌లోని లీ బోర్గెట్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. మోసం, మాదకద్రవ్యాల అక్రమరవాణా, సైబర్ నేరాల ప్రోత్సాహం, టెలిగ్రామ్‌లో కంటెంట్‌పై నియంత్రణ లేకపోవడం వంటి ఆరోపణల నేపథ్యంలో ఆయనపై గతంలో అరెస్టు వారెంట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో శనివారం అజర్‌బైజాన్ నుంచి పారిస్ బయలుదేరిన పావెల్‌ను లీ బోర్గెట్ విమానాశ్రయంలో కస్టడీలోకి తీసుకున్నారు. టెలిగ్రామ్ సీఈవో అరెస్టుపై రష్యా స్పందిస్తూ.. భావప్రకటన స్వేచ్ఛపై పశ్చిమ దేశాలు రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నాయని ఆరోపించింది.

దెయ్యం పోవాలని దెబ్బలు..యువకుని మృతి

చండీగఢ్, ఆగస్టు 25: దెయ్యాన్ని వదిలిస్తానంటూ పంజాబ్‌లో ఓ పాస్టరు చేసిన చికిత్స 'వికటించింది.' దెయ్యాన్ని పారదోలడం పేరుతో అతడు కొట్టిన దెబ్బలకు 30 ఏళ్ల యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. గురుదాస్‌పూర్ జిల్లాలోని సంఘపురాకు చెందిన శామ్యూల్ మాసిహ్ అనే దినసరి కూలీ నిత్యం అనారోగ్యానికి గురయి కేకలు వేస్తుండేవాడు. దాంతో కుటుంబ సభ్యులు స్థానిక పాస్టర్ జాకోబ్ మాసిహ్‌ను సంప్రదించగా బుధవారం వారి ఇంటికి వచ్చి ప్రార్థనలు చేశాడు. అతనికి దెయ్యం పట్టిందని, దాన్ని వదిలించడానికి అతణ్ని కొడుతామని చెప్పాడు. కొట్టినా ఏమీ కాదని భరోసా ఇచ్చాడు. అనంతరం ఆయనతో పాటు మరో ఎనిమిది మంది శామ్యూల్‌ను గట్టిగా కొట్టడంతో అక్కడికక్కడే చనిపోయాడు. మరుసటి రోజున శవానికి సమాధి చేశారు. కానీ రెండు రోజుల తరువాత శామ్యూల్ తల్లి, భార్య పాస్టరుపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం సమాధి నుంచి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం చేశారు. పాస్టర్‌తో పాటు మరో ఎనిమిది మందిపై పోలీసులు కేసు పెట్టారు.

బ్రెజిల్ ఎయిర్‌పోర్టులో చిక్కుకున్న భారతీయులు

బ్రసీలియా, ఆగస్టు 25: భారత్, నేపాల్, వియత్నాం దేశాలకు చెందిన వందలాది మంది వలసదారులు బ్రెజిల్‌లో సావోపాలోలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నారు. వీరు బ్రెజిల్‌లోకి ప్రవేశించేందుకు గ్వారుల్హోస్ విమానాశ్రయంలో వారాలుగా ఎదురు చూస్తున్నారు. అయితే వీరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, వారు నేలపైనే నిద్రించాల్సి వస్తోందని రాయిటర్స్ కథనం పేర్కొంది. కనీసం 666 మంది వలసదారులు వీసాలు లేకుండా బ్రెజిల్‌లోకి ప్రవేశించేందుకు వేచి చూస్తున్నట్టు పబ్లిక్ డిఫెండర్స్ ఆఫీస్ అధికారి ఒకరు తెలిపారు. సోమవారం నుంచి అమల్లోకి వచ్చే కొత్త రూల్స్ ప్రకారం.. బ్రెజిల్ వీసా లేకుండా వేరే దేశానికి వెళ్లే విదేశీ ప్రయాణికులు నేరుగా వారి గమ్యస్థానానికి వెళ్లాలి లేదా తిరిగి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది.

మహిళలపై నేరాలు క్షమించరాని పాపాలు

దోషులను వదిలే ప్రసక్తే లేదు.. ఈ సందేశం పై నుంచి కింది వరకు వెళ్లాలి

» ప్రభుత్వాలు వస్తాయి.. పోతాయి కానీ మహిళల రక్షణ అందరి బాధ్యత

» 'మన్ కీ బాత్', 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాల్లో ప్రధాని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న నేరాలు క్షమించరాని పాపాలని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. దోషులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో యువ వైద్యురాలిపై హత్యాచారం, ముంబై సమీపాన బద్లాపూర్‌లో నాలుగేళ్ల చిన్నారులపై లైంగిక వేధింపుల ఉదంతాల నేపథ్యంలో ఆదివారం మహారాష్ట్రలోని జల్గావ్‌లో జరిగిన 'లఖ్‌పతి దీదీ సమ్మేళన్'లో ఆయన మాట్లాడారు. అలాగే ఆకాశవాణిలో 'మన్ కీ బాత్' 113వ సంచికలోనూ ప్రసంగించారు. 'దేశంలో తల్లులు, అక్కచెల్లెళ్ల రక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలి. నా ఎర్రకోట ప్రసంగంలో కూడా ఇదే అంశాన్ని ప్రస్తావించాను. మహిళలపై నేరాలు క్షమించరాని పాపాలని ప్రతి రాజకీయ పార్టీకి, ప్రతి రాష్ట్ర ప్రభుత్వానికి చెబుతున్నాను. దోషులెవరైనా వదిలిపెట్టవద్దు. ఈ నేరాలను ప్రోత్సహించే వారిని కూడా విడిచిపెట్టకూడదు. ఈ సందేశం పై నుంచి కిందిస్థాయి వరకు వెళ్లాలి. ప్రభుత్వాలు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ మహిళల జీవితాలు, గౌరవాన్ని కాపాడడం సమాజం, ప్రభుత్వం సహా మనందరిపై ఉన్న అతి పెద్ద బాధ్యత' అని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పడిన ప్రభుత్వాల కంటే గత పదేళ్లలో తన ప్రభుత్వం మహిళల కోసం ఎంతో చేసిందన్నారు. 2014 వరకు స్వయం సహాయక సంఘాలకు కేవలం రూ.25 వేల కోట్ల రుణాలు మాత్రమే ఇచ్చారని, గత దశాబ్ద కాలంలో తన ప్రభుత్వం రూ.9 లక్షల కోట్లు ఇచ్చిందని తెలిపారు. జల్గావ్‌లో లక్షాధికారి సోదరీమణుల(లఖ్‌పతి దీదీ)తో ఆయన సంభాషించారు. 4.3 లక్షల సంఘాలకు చెందిన 48 లక్షల మంది సభ్యులకు రూ.2,500 కోట్ల రివాల్వింగ్ ఫండ్‌ను విడుదల చేశారు. 'లఖ్‌పతి దీదీ స్కీం కేవలం మహిళల ఆర్థికాభివృద్ధికి మాత్రమే సంబంధించింది కాదు. ఇది భావితరాల సాధికారతకు సంబంధించింది. గత పదేళ్లలో కోటి మంది లక్షాధికారిణులను తయారుచేశాం. గత రెండు నెలల్లోనే 11 లక్షల మంది లక్షాధికారిణులు ఆవిర్భవించారు. త్వరలో మన దేశం మూడో అతిపెద్ద ఎకానమీగా అవతరించనుందని మీరు వినే ఉంటారు. ఇందులో మహిళలదే అతిపెద్ద పాత్ర. అందుకే మీ కొడుకుగా, సోదరుడిగా మీ జీవితాలను సుఖమయం చేయాలని సంకల్పించాను. ఏటికేడాదీ మీ ప్రయోజనాల కోసం నిర్ణయాలు తీసుకుంటున్నాం. కేంద్రం 3 కోట్ల కొత్త ఇళ్లు నిర్మించనుంది. అవన్నీ మహిళలకే కేటాయిస్తాం' అని మోదీ వివరించారు.



జల్గావ్‌లో నిర్వహించిన లఖ్‌పతి దీదీ సమ్మేళన్‌లో ప్రధాని మోదీ

తెలుగు భాష అద్భుతం

తెలుగు అద్భుతమైన భాష అని మోదీ 'మన్ కీ బాత్'లో కొనియాడారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచంలోని తెలుగు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెల 19న రక్షాబంధన్‌తో పాటు 'ప్రపంచ సంస్కృత దినోత్సవం' కూడా జరుపుకున్నామని మోదీ గుర్తు చేశారు. విదేశాల్లోనూ సంస్కృతంపై అధ్యయనాలు జరుగుతున్నాయని చెప్పారు.

సమష్టి కృషితో రాజకీయంగా ఎదగాలి

రాజకీయ నేపథ్యం లేని యువత సమష్టి కృషితో రాజకీయాల్లో ఎదగాలని మోదీ ఆకాంక్షించారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఇలాంటి వారే ఎదిగారని.. వారి స్ఫూర్తితో 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు ఉపక్రమించాలని 'మన్ కీ బాత్'లో పిలుపిచ్చారు. 'కుటుంబ రాజకీయాలు కొత్త టాలెంట్‌ను అణగదొక్కుతున్నాయని కొందరు యువత నాకు తెలియజేశారు. చాలా మంది రాజకీయాల్లోకి రావడానికి ఆసక్తిగా ఉన్నారు. సరైన అవకాశం, మార్గనిర్దేశం కోసం వారు ఎదురుచూస్తున్నారు. తమకు ఆసక్తి ఉన్నప్పటికీ.. తాత తండ్రుల నుంచి రాజకీయ వారసత్వం లేనందున రాలేకపోతున్నామని పలువురు లేఖల్లో తెలిపారు. వీరంతా సమష్టి కృషితో కచ్చితంగా రాజకీయాల్లో రాణించగలరు' అని ఆశాభావం వ్యక్తంచేశారు. ఐఐటీ-మద్రాస్‌లో చదివి.. 'గెలాక్స్‌ఐ' అంతరిక్ష స్టార్టప్ ఏర్పాటు చేసిన యువ పారిశ్రామికవేత్తలతో ఆయన సంభాషించారు. హులాక్ గిబ్బన్స్ (వానర జాతి)తో అసోంలోని బరేకురి గ్రామానికి చెందిన మోరన్ తెగవారికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. 'గిబ్బన్స్‌కు అరటిపండ్లు అంటే ఇష్టమని వారు తమ చేలో అరటి సాగు చేస్తున్నారు. తమ కుటుంబ సభ్యులు పుట్టినా, చనిపోయినా నిర్వహించే కార్యక్రమాలను ఈ వానరాల విషయంలోనూ చేస్తున్నారు. వాటికి పేర్లు కూడా పెడుతున్నారు. ఇటీవల... కనిపించని విద్యుత్ తీగల కారణంగా ఈ కోతులు ఇబ్బంది పడ్డాయి. ఈ విషయాన్ని గ్రామస్థులు ప్రభుత్వానికి తెలియజేయడంతో సత్వరమే ఆ సమస్యను పరిష్కరించాం" అని మోదీ చెప్పారు.

కోల్‌కతా ఘటనపై 'బార్' తీర్మానం పేలవం

కోల్‌కతాలోని ఆర్జీ కర్ వైద్య కళాశాలలో ట్రైనీ డాక్టరుపై జరిగిన అత్యాచారం, హత్య సంఘటనను తక్కువగా చూపించే ప్రయత్నం చేశారంటూ సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్ సిబల్‌పై మాజీ అధ్యక్షుడు ఆదిశ్ అగర్వాలా విమర్శలు చేశారు. ఆ సంఘటనను ఖండిస్తూ సిబల్ పేరున విడుదలైన బార్ తీర్మానాన్ని వెంటనే ఉపసంహరించుకొని 72 గంటల్లోగా క్షమాపణలు చెప్పాలని, లేకుంటే అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ మేరకు ఆయనకు లేఖ రాశారు. అసలు ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదం తీసుకోకుండానే తీర్మానాన్ని ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. ఆ తీర్మానం చెల్లదని తెలిపారు.

ఆర్జీ కర్ మాజీ ప్రిన్సిపాల్ ఇంట్లో సీబీఐ సోదాలు

న్యూఢిల్లీ, కోల్‌కతా, ఆగస్టు 25: మహిళా జూనియర్ డాక్టర్ హత్యాచారానికి గురైన కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్ నివాసంతోపాటు కాలేజీలోని ఆయన ఆఫీసులో సీబీఐ ఆదివారం సోదాలు జరిపింది. ఇదే కేసుకు సంబంధించి మాజీ ప్రిన్సిపాల్ సంజయ్ వశిష్ఠ్‌తోపాటు మరో 13 మంది ఇళ్లలోనూ సీబీఐ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ప్రశ్నించారు. ఆస్పత్రికి సరఫరా అయ్యే పలు రకాల ఉత్పత్తులకు సంబంధించిన లావాదేవీలపైనా ఆరా తీశారు. సీబీఐ అవినీతి నిరోధక విభాగం ఈ సోదాల్లో పాలుపంచుకుంది. కాగా, సందీప్ ఘోష్ ఇంటికి ఉదయం 6 గంటలకు చేరుకున్న సీబీఐ బృందం.. గంటన్నరపాటు బయటే వేచి చూసింది. ఆ తర్వాతే ఘోష్ తన ఇంటి తలుపు తెరిచారు. మరోవైపు, ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న సంజయ్ రాయ్‌పై ఫోరెన్సిక్ నిపుణులు ఆదివారం లై డిటెక్టర్ పరీక్ష జరిపారు.

లోకం తీరు



ఉక్రెయిన్ శాంతి సదస్సు భారత్‌లో!

మోదీకి జెలెన్‌స్కీ ప్రతిపాదన



కీవ్, ఆగస్టు 25: ఉక్రెయిన్‌లో శాంతి స్థాపన లక్ష్యంగా రెండో విడత అంతర్జాతీయ శాంతి సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వాలని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రతిపాదించారు. ఇటీవల తనని కలిసిన ప్రధాని మోదీ వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించానని జెలెన్‌స్కీ విలేకరులకు వెల్లడించారు. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ ఈ సదస్సు నిర్వహణకు తగిన ప్రాంతమని అభిప్రాయపడ్డారు. అలాగే, భారత్‌తోపాటు సౌదీ అరేబియా, ఖతార్, తుర్కియే, స్విట్జర్లాండ్ దేశాలను కూడా సదస్సు నిర్వహణకు పరిగణనలోకి తీసుకుంటున్నామని చెప్పారు. కాగా, తొలి విడత ఉక్రెయిన్ శాంతి సదస్సు జూన్‌లో స్విట్జర్లాండ్‌లో జరిగింది. 60 దేశాల అధినేతలు హాజరయ్యారు. భారత్ నుంచి విదేశీ వ్యవహారాల శాఖ ప్రతినిధి మాత్రమే ఈ సదస్సులో పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి పాక్ ఆహ్వానం

ఇస్లామాబాద్, ఆగస్టు 25: భారత ప్రధాని నరేంద్రమోదీని ఇస్లామాబాద్‌కు రావాల్సిందిగా పాకిస్థాన్ ఆహ్వానించింది. అక్టోబరు 15, 16 తేదీల్లో ఇస్లామాబాద్‌లో జరగనున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) ప్రభుత్వాధినేతల మండలి (సీహెచ్‌జీ) సదస్సుకు హాజరు కావాల్సిందిగా మోదీతోపాటు ఇతర దేశాధినేతలను కోరింది. అయితే భారత్, పాకిస్తాన్ మధ్య సంబంధాలు ప్రస్తుతం సరిగా లేని నేపథ్యంలో ఈ సదస్సుకు మోదీ వెళ్లడంపై సందేహాలు నెలకొన్నాయి. గతేడాది కజకిస్థాన్‌లో జరిగిన సీహెచ్‌జీ సదస్సుకు కూడా ప్రధాని మోదీ హాజరు కాలేదు. కాగా, సీహెచ్‌జీకి రష్యా, చైనా నేతృత్వం వహిస్తుండగా.. భారత్, పాకిస్థాన్ సభ్యులుగా ఉన్నాయి. రొటేషన్‌లో భాగంగా సీహెచ్‌జీ సదస్సు ఈసారి పాక్ అధ్యక్షతన ఇస్లామాబాద్‌లో జరగనుంది.

ఇజ్రాయెల్ X హెజ్బొల్లా

(మొదటి పేజీ తరువాయి)



లెబనాన్‌లోని ఓ ప్రాంతంలో ఇజ్రాయెల్ దాడి; హెజ్బొల్లా చీఫ్ హసన్ నస్రల్లాహ్(ఇన్‌సెట్)

తెల్లవారుజామున 5 గంటలకు హెజ్బొల్లా తమ దేశంపై దాడులు చేయడానికి సిద్ధమైన విషయం తెలియడంతో.. ఆ సమయానికి అరగంట ముందే ఇజ్రాయెల్ తన దాడులు మొదలుపెట్టడం గమనార్హం. అటు నుంచి హెజ్బొల్లా కూడా.. పెద్ద సంఖ్యలో డ్రోన్లు, 320కి పైగా కత్యూష రాకెట్లతో 11 ఇజ్రాయెల్ సైనిక స్థావరాలు, బ్యారక్‌లు, ఐరన్ డోమ్ ప్లాట్‌ఫామ్స్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసినట్టు ప్రకటించింది. అయితే, ఈ దాడుల్లో లెబనాన్‌వైపు ముగ్గురు చనిపోగా.. ఇజ్రాయెల్ వైపు ఎలాంటి ప్రాణ నష్టమూ జరగలేదని సమాచారం. ప్రాణనష్టం జరగకపోయినప్పటికీ.. ఇటీవలికాలంలో ఇజ్రాయెల్‌పై ఈ స్థాయి దాడి జరగడం ఇదే. కాగా.. తమ దేశ పౌరుల ప్రాణాలకు ఏర్పడ్డ ముప్పును తప్పించేందుకే తాము లెబనాన్‌లో దాడులు జరిపామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి గాలంట్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇక, ఉత్తర ఇజ్రాయెల్ దిశగా హెజ్బొల్లా గురిపెట్టిన వేలాది రాకెట్లను తమ సైన్యం నిర్వీర్యం చేసిందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు క్యాబినెట్ మీటింగ్‌లో చెప్పారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. హెజ్బొల్లా దాడిపై సమాచారం నేపథ్యంలో ఆదివారం ఉదయాన్నే ఉత్తర ఇజ్రాయెల్‌లో ప్రజలను అప్రమత్తం చేసేందుకు యుద్ధ సైరన్లు మోగించారు. ప్రజలంతా బాంబు షెల్టర్లకు దగ్గర్లో ఉండాలని ఇజ్రాయెల్ 'హోం ఫ్రంట్ కమాండ్' సూచించింది. ఆదివారం నాటి దాడులు కేవలం దక్షిణ లెబనాన్‌లో సరిహద్దులకు 5 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే చేశామని.. తమకు ముప్పు ఉందనుకుంటే లెబనాన్‌లో ఎక్కడైనా దాడులు చేస్తామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించగా.. ఇజ్రాయెల్‌కు అన్ని విధాలా అండగా నిలుస్తామని అమెరికా అధికారులు వెల్లడించారు. కాగా.. తమ ప్రతీకారచర్యలకు ఇది ఆరంభం మాత్రమేనని హెజ్బొల్లా వర్గాలు పేర్కొన్నట్టు సమాచారం. ఈ పరిణామాలతో.. పశ్చిమాసియాలో పూర్తిస్థాయి యుద్ధం జరుగుతుందేమోనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. అయితే.. "ఇజ్రాయెల్ పూర్తిస్థాయి యుద్ధాన్ని కోరుకోదు. కానీ, క్షేత్రస్థాయిలో జరిగే పరిణామాలకు అనుగుణంగా వ్యవహరిస్తుంది" అని ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి కాట్జ్ పేర్కొన్నట్టు రాయిటర్స్ వార్తాసంస్థ ఒక కథనంలో తెలిపింది. ఇదిలా ఉండగా, ఇజ్రాయెల్ హమాస్ మధ్య సంధి చేసి.. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిర్చేందుకు ఈజిప్టులో ఉన్నతస్థాయి చర్చలు జరుగుతున్న సమయంలో ఈ దాడులు జరగడం గమనార్హం. ఈ చర్చల్లో అమెరికా గూఢచార సంస్థ సీఐఏ డైరెక్టర్ విలియమ్ బర్న్స్, ఖతార్ ప్రధాని మొహమ్మద్ బిన్ అబ్దుల్ రహమాన్ అల్ తాహ్నీ, ఈజిప్ట్ ప్రధాన నిఘా అధికారి అబ్బాస్ కమెల్ తదితరులు పాల్గొంటున్నారు. హమాస్ కూడా ప్రతినిధిని పంపింది.

రాకెట్లు పాత మోడల్‌వేగానీ..

ఇజ్రాయెల్‌పై ఆదివారంనాటి దాడికి హెజ్బొల్లా ప్రధానంగా ఉపయోగించింది.. కత్యూష రాకెట్లు! ఎప్పుడో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో రష్యా అభివృద్ధి చేసిన అన్ గైడెడ్ రాకెట్లివి. ఆ తర్వాత రష్యా మరింత అధునాతన రాకెట్లను అభివృద్ధి చేసుకుందిగానీ.. హెజ్బొల్లా లాంటి సంస్థలు ఇప్పటికీ వాటిని వాడుతున్నాయి. ఇంకా చెప్పాలంటే హెజ్బొల్లా అమ్ములపొదిలో ప్రస్తుతానికి ఇవే ప్రధాన ఆయుధాలు!! వారు వాడే రాకెట్లు 20 నుంచి 40 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగలవు. అన్ గైడెడ్ కావడం ఒక లోపమే అయినప్పటికీ.. పెద్ద ఎత్తున విధ్వంసం సృష్టించగల సామర్థ్యం వీటి సొంతం. 2006లో జరిగిన లెబనాన్ వార్ సమయంలో కూడా ఉత్తర ఇజ్రాయెల్‌పై హెజ్బొల్లా వేలాది కత్యూష రాకెట్లను ప్రయోగించింది. వీటితోపాటు.. షార్ట్ రేంజ్ రాకెట్లయిన ఫజ్ర్-1, ఫజ్ర్ 3, మీడియం రేంజ్ రాకెట్లయిన ఫజ్ర్ 5, ఎం-600, ఇరానియన్ జెల్‌జల్, ఫతే-110 వంటి మిస్సైళ్లు, యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైళ్లు, స్థానికంగా తయారుచేసిన అయూబ్, మిర్సాద్ డ్రోన్ల వంటివి హెజ్బొల్లా వద్ద ఉన్నాయి.

అమెరికాను వణికిస్తున్న 'ట్రిపుల్ ఈ'

5 పట్టణాల్లో రాత్రిపూట లాక్‌డౌన్

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): లాక్‌డౌన్ అంటే ఠక్కున కరోనా వైరస్సే గుర్తుకొస్తుంది. ఇప్పుడు అమెరికాలోని మసాచుసెట్స్ రాష్ట్రాన్ని ఒక అరుదైన, ప్రాణాంతక వైరస్ భయం వణికిస్తోంది. ఈస్ట్రన్ ఈక్వైన్ ఎన్‌సెఫలైటిస్ (ట్రిపుల్ ఈ) అనే ఈ వైరస్ బారినపడకుండా ముందు జాగ్రత్తగా అక్కడి 5 పట్టణాల్లో పాక్షిక లాక్‌డౌన్ విధించారు. ఈ వైరస్ దోమ కుట్టడం వల్ల సోకుతుంది. ఇటీవల 80 ఏళ్ల వృద్ధుడు ఈ వైరస్ బారినపడినట్టు గుర్తించడంతో అధికారులు హైఅలర్ట్ ప్రకటించారు. ఈ వైరస్ సోకితే మరణాల రేటు 30% వరకు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ముప్పు తీవ్రత ఉందని భావిస్తున్న ఆక్స్‌ఫర్డ్, డగ్లస్, సుటన్, వెబ్‌స్టర్ పట్టణాల్లో సాయంత్రం నుంచి ఉదయం వరకు లాక్‌డౌన్ అమలు చేస్తున్నారు. సాయంత్రం 6 గంటల తర్వాత దోమల బెడద ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఆలోపు బయట పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. పార్కులను, వినోద కేంద్రాలను మూసివేస్తున్నారు. సెప్టెంబరు 30 వరకు ఈ వేళలు పాటించాలని, తర్వాత చలి తీవ్రంగా ఉండే మరో నెలా 15 రోజుల పాటు సాయంత్రం 5 గంటలకల్లా ఇళ్లకు చేరుకోవాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. బోస్టన్‌కు 64 కిలోమీటర్ల దూరంలోని ప్లైమౌత్ పట్టణంలో ఒక గుర్రానికి ఈ వైరస్ సోకినట్టు గుర్తించారు. దాంతో అక్కడ కూడా అధికారులు సాయంత్రం నుంచి ఉదయం వరకు లాక్‌డౌన్ అమలు చేస్తున్నారు. కాగా, దోమల ద్వారా సోకే ఈ వైరస్ మనుషుల్లో ఒకరి నుంచి ఒకరికి వ్యాపించదు. దీనికి వ్యాక్సిన్, నిర్దిష్టమైన చికిత్స లేవని అమెరికాకు చెందిన సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ) పేర్కొంది. ఇది సోకిన వారిలో జ్వరం, తలనొప్పి, వాంతులు, విరేచనాలు, మూర్ఛ వంటి లక్షణాలు కనిపిస్తాయని పేర్కొంది. ఒక్కోసారి రోగి కోమాలోకి వెళ్లిపోయే ప్రమాదం కూడా ఉంది. 2020 తర్వాత మసాచుసెట్స్ రాష్ట్రంలో ఈ వైరస్ కేసు నమోదు కావడం ఇదే తొలిసారి. 2019లో 12 మందికి ఈ వైరస్ సోకగా వారిలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

పాత-కొత్త కలయికే ఏకీకృతం!

» సీపీఎస్ కంటే ప్రయోజనాలు ఎక్కువే

» రాష్ట్రాల్లో అమలు చేస్తే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు లబ్ధి

పాత పెన్షన్ పథకం

ఇప్పటికీ ఉద్యోగ సంఘాలు తమకు పాత పెన్షన్ విధానమే కావాలని ఆందోళనలు చేస్తున్నాయి. అందుక్కారణం.. ఉద్యోగిపై ఎలాంటి భారం లేకుండానే భవిష్యత్‌కు ఓపీఎస్ విధానం భద్రత కల్పిస్తుండడమే..! అంతేకాకుండా.. ఒకవేళ పెన్షన్‌దారుడు మరణిస్తే.. అతనిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఎలాంటి కోత లేకుండా.. పూర్తి పెన్షన్ రావడమే.

- ఈ విధానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగులకు అమలయ్యేది. పెన్షన్ పథకం కోసం ఉద్యోగి జీతంలో ఎలాంటి కోతలు ఉండేవి కాదు. ఈ విధానంలో ఒక ఉద్యోగి రిటైర్ అయ్యే సమయానికి చివరి నెలలో తీసుకున్న బేసిక్ వేతనంలో 50శాతాన్ని నెలసరి పింఛన్‌గా నిర్ధారించేవారు.
- దీంతోపాటు.. కరువు భత్యం(డీఏ) ఉండేది. అంటే.. ప్రభుత్వోద్యోగులకు ఎప్పుడు డీఏ పెరిగినా.. అది పెన్షనర్లకు కరువు ఉపశమనం(డీఆర్)గా వర్తించేది. వేతన సవరణ కమిషన్(పీఆర్సీ) సిఫారసులు కూడా అమలయ్యేవి.
- ఈ విధానంలో పెన్షన్ మొత్తం క్రమంగా పెరిగే అవకాశాలుండేవి. డీఏ, పీఆర్సీ ఎంత శాతం పెరిగితే.. పింఛన్ మొత్తం కూడా అంతే శాతం పెరిగేది. ఈ పథకానికి అనుబంధంగా సాధారణ భవిష్య నిధి(జీపీఎఫ్) వంటివి పదవీ విరమణ ప్రయోజనాలుగా ఉండేవి.
- పాత పెన్షన్ విధానంలో ఓ ఉద్యోగి రిటైర్ అయ్యాక రూ.20 లక్షల వరకు గ్రాట్యుటీ వచ్చేది.
- ఓపీఎస్ అనేది ప్రభుత్వ ఖజానా నుంచి అందేది. ఒకవేళ పెన్షనర్ చనిపోతే.. అతనిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు పూర్తిస్థాయిలో పింఛన్ ప్రయోజనాలు అందేవి. పాత పెన్షన్ విధానంలో ఇంటి నిర్మాణానికి, పిల్లల పెళ్లిళ్లకు పీఎఫ్ నుంచి విత్‌డ్రాకు వెసులుబాటు ఉండేది

జాతీయ పెన్షన్ పథకం

అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానంపై ఉద్యోగ సంఘాలు వ్యతిరేకంగా ఉన్నాయి. ఉద్యోగి వేతనంలోంచి నెలనెలా కొంత మొత్తం వెచ్చించడం.. చివరకు వచ్చే పెన్షన్ చాలా తక్కువగా.. కొన్ని సందర్భాల్లో వితంతు, వృద్ధాప్య పింఛన్ల కంటే హీనంగా ఉండడమే కారణం.

- ఈ పెన్షన్ స్కీమ్‌ను కేంద్రంలో జాతీయ పింఛన్ పథకం(ఎన్‌పీఎస్)గా.. రాష్ట్రంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్)గా అమలు చేస్తున్నారు.
- ఈ విధానంలో మూలవేతనం, డీఏను కలిపి.. దానిపై 10% ఉద్యోగి, 10% ప్రభుత్వం నెలనెలా జమచేయాలి. ఈ మొత్తాన్ని 100% ఎస్‌బీఐ, యూటీఐ, ఎల్‌ఐసీ షేర్లలో పెట్టేవారు. షేర్ విలువను బట్టి పెన్షన్‌లో రిటర్న్స్ చేరేవి.
- రిటైర్ అయ్యాక.. పొదుపు చేసిన దాంట్లో 60% లంప్సమ్‌గా ఇస్తారు. మిగతా దాంట్లో 40శాతాన్ని నెలవారీగా సమాన విలువగట్టి పింఛన్‌గా అందజేస్తారు. అంటే.. తీసుకునే జీతానికి.. చివరి బేసిక్ పేతో పోలిస్తే.. ఈ పింఛన్ చాలా తక్కువ. సర్వీసును బట్టి.. కొన్ని సందర్భాల్లో రూ.2వేలు.. అంతకంటే తక్కువ కూడా ఉండొచ్చు.


ఏకీకృత పెన్షన్ పథకం

- ఈ విధానం ఓపీఎస్, ఎన్‌పీఎస్/సీపీఎస్‌ల కలయికగా ఉందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎన్‌పీఎస్‌తో పోలిస్తే.. యూపీఎస్ విధానం ఉద్యోగులకు పింఛన్ హామీని పెంచుతూ.. గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలకు భరోసా ఇవ్వనుంది.
- కనీసం 25 సంవత్సరాలు సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యేవారికి పదవీ విరమణకు ముందు 12 నెలలు తీసుకున్న బేసిక్ పే+డీఏ మొత్తం సగటులో 50% పింఛన్‌గా వస్తుంది.
- కనీసం 10 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుని, రిటైర్ అయ్యే వారికి వారి సర్వీసు కాలాన్ని బట్టి పింఛన్ వస్తుంది. ఇది 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న వారితో పోలిస్తే.. తక్కువగా ఉంటుంది. అంటే.. పింఛన్ హామీ కనీసం రూ.10 వేలుగా ఉంటుంది.
- ఉద్యోగి మరణిస్తే.. పింఛన్‌లో 60% ఆయన/ఆమె కుటుంబ సభ్యులకు నెలవారీ పింఛన్‌గా అందుతుంది. డీఆర్ కూడా లభిస్తుంది. ఉద్యోగి రిటైర్ అయ్యాక గ్రాట్యుటీతోపాటు అదనపు ప్రయోజనాలుంటాయి.

మూడు పింఛన్ విధానాల్లో తేడాలివే!

ప్రయోజనం	ఓపీఎస్	సీపీఎస్/ఎన్‌పీఎస్	యూపీఎస్
ఉద్యోగి వాటా	లేదు	బేసిక్+డీఏపై 10%	బేసిక్+డీఏపై 10%
షేర్ మార్కెట్‌లో పెట్టుబడులు	లేదు	ఉంది	ప్రభుత్వమే భరిస్తుంది
గ్రాట్యుటీ	ఉంది	ఉంది	ఉంది
పథకం మార్పిడి	ఉంది	లేదు	ఉంది
పెన్షన్	చివరి బేసిక్ +డీఏపై 50%	మూలధనంలో 40%లో వాటాలుగా..	చివరి 12 నెలల బేసిక్+డీఏ సగటుపై 50%
పీఆర్సీ	ఉంది	లేదు	లేదు
అదనపు పెన్షన్	ఉంది	లేదు	స్పష్టత రావాల్సి ఉంది
కుటుంబ పెన్షన్	ఉంది	ఐచ్ఛికం	60% ఉంటుంది
కరువు ఉపశమనం(డీఆర్)	ఉంది	లేదు	ఉంది
హెల్త్ కార్డులు	ఉన్నాయి	లేవు	స్పష్టత లేదు
కారుణ్య నియామకం	ఉంది	ఉంది	ఉంది
రిటైర్‌మెంట్ లంప్సమ్	పీఎఫ్ 100%	ఎన్‌పీఎస్‌లో 60%	స్పష్టత రావాల్సి ఉంది
విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలకు పెన్షన్	ఉంటుంది	ఉంటుంది	ఉంటుంది

యూటర్న్ మోదీ!



న్యూఢిల్లీ, ఆగస్టు 25: ప్రభుత్వ ఉద్యోగులకు కేంద్రం కొత్తగా ప్రకటించిన 'యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)'ను కాంగ్రెస్ ఎద్దేవాచేసింది. ఈ యూపీఎస్‌లో 'యూ' అంటే మోదీ ప్రభుత్వ యూటర్న్‌లు అని అర్థమని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యానించారు. ఆదివారం ఆయన 'ఎక్స్'లో స్పందించారు. జూన్ 4 (ఎన్నికల ఫలితాల రోజు) తర్వాత ప్రధాని మోదీ అహంభావంపై ప్రజాధికారం విజయం సాధించిందన్నారు. దీర్ఘకాలిక కేపిటల్ గెయిన్/ఇండెక్సేషన్, వక్ఫ్ బిల్లును జేపీసీకి పంపడం, బ్రాడ్‌కాస్ట్ బిల్లు, సివిల్స్‌లో లేటరల్ ఎంట్రీపై కేంద్రం వెనక్కి తగ్గడాన్ని ప్రస్తావించారు. 'ఈ నిరంకుశ ప్రభుత్వం నుంచి 140 కోట్ల మంది భారతీయులను కాపాడేందుకు.. అది జవాబుదారీతనంతో వ్యవహరించేలా ఒత్తిడి కొనసాగిస్తాం' అని పేర్కొన్నారు. కాగా.. కొత్త యూపీఎస్ స్కీంను దళితులు, గిరిజనులు, ఓబీసీలపై దాడిగా ఏఐసీసీ మీడియా-పబ్లిసిటీ విభాగం అధిపతి పవన్ ఖేరా అభివర్ణించారు. 'పలు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వుడు కేటగిరీ వారికి వయోపరిమితి 40 ఏళ్లుగా ఉంది. యూపీఎస్‌సీలో 37 ఏళ్లు మాత్రమే. యూనిఫైడ్ పెన్షన్ స్కీం ప్రకారం.. పూర్తి పెన్షన్ అందాలంటే ఉద్యోగి 25 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకోవాలి. ఈ పరిస్థితిలో ఎస్సీలు, ఎస్టీలు, ఓబీసీలకు ఈ సౌకర్యం ఎలా లభిస్తుంది' అని ప్రశ్నించారు. అయితే కాంగ్రెస్ పార్టీకే చెందిన 'ప్రొఫెషనల్స్ కాంగ్రెస్' ఛైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి ఆయనతో విభేదించారు. కొత్త స్కీంను ఆయన స్వాగతించారు.

కన్న కొడుకులే కాలయములు

- నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం కేంద్రంలో మద్యం మత్తులో తల్లి గొంతు కోసిన కుమారుడు
- తర్వాత అదే కత్తితో గొంతుకోసుకొని ఆత్మహత్య
- మహబూబ్‌నగర్ జిల్లా సల్కర్ పేటలో తల్లి తలపై ఇనుపరాడ్‌తో మోది, గొంతుకోసి చంపిన పుత్రుడు

నిడమనూరు/గండీడ్, ఆగస్టు 25: కన్న కొడుకులే వాళ్ల పాలిట కాల యములయ్యారు. తాగిన మైకంలో కసాయిల్లాగా మారారు. ఒకడు తల్లి గొంతు కోసి అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. ఆ తరువాత అదే కత్తితో తనూ గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మరొకడు డబ్బు ఇవ్వలేదన్న కోపంతో ఇనుపరాడ్డుతో తన తల్లి తలపై మోది, గొంతుకోసి చంపేశాడు. నల్లగొండ జిల్లా నిడమనూరు మండల కేంద్రం, మహబూబ్ నగర్ జిల్లా గండీడు మండల పరిధిలోని సల్కర్‌పేట్ గ్రామంలో ఈ రెండు ఘటనలు జరిగాయి. నిడమనూరు మండల కేంద్రానికి చెందిన రావిరాల వీరయ్య, సాయమ్మ(65) దంపతులకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. గ్రామంలో ఆ వృద్ధ దంపతులు పాలు విక్రయించి జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు శ్రీనివాస్ మిర్యాలగూడలో టైలరింగ్ వృత్తి చేసుకుంటున్నాడు. చిన్న కుమారుడు శివకుమార్(36) కారు డ్రైవరుగా పనిచేస్తూ తల్లిదండ్రుల వద్దే ఉంటున్నాడు. శివకుమార్‌కు తన మేనకోడలితో 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఓ కుమార్తె పుట్టి చనిపోయింది. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరగడంతో పెద్దమనుషుల సమక్షంలో రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నారు. కోర్టులో కూడా విడాకుల కేసు నడుస్తోంది. ఈ క్రమంలో శివ మద్యానికి బానిసయ్యాడు. మరోవైపు, అతడు విడాకులిచ్చిన మహిళకు శనివారం వేరే వ్యక్తితో వివాహం జరిగింది. ఆ పెళ్లికి శివకుమార్ తండ్రి, సోదరుడు వెళ్లారు. దీన్ని శివకుమార్ జీర్ణించుకోలేకపోయాడు. శనివారం రాత్రి బాగా



సాయమ్మ, శివకుమార్, వెంకటమ్మ (ఫైల్)

మద్యం తాగి.. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వెళ్లాడు. నిద్రపోతున్న తల్లితో గొడవ పడి కత్తితో కిరాతకంగా గొంతుకోశాడు. రక్తపు మడుగులో విలవిలలాడుతూ ఆ వృద్ధురాలు అక్కడికక్కడే చనిపోయింది. తల్లిని చంపిన భయంతో అటూ ఇటూ పరుగులు పెడుతూ తాను కూడా అదే కత్తితో గొంతు కోసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

గొంతుకోసి.. పొదల్లో పడేసి..

మహబూబ్‌నగర్ జిల్లా గండీడు మండలం సల్కర్‌పేట్‌కు చెందిన వెంకటమ్మ(55) తన కుమారుడు కృష్ణయ్యతో కలిసి ఉంటోంది. ఊర్లో ఇటీవలే కొత్త ఇంటి నిర్మాణం చేపట్టింది. ఆ పనులు పూర్తయ్యాక కుమారుడికి పెళ్లి చేయాలని అనుకున్నది. కానీ మద్యానికి బానిసైన కృష్ణయ్య డబ్బుల కోసం తరచూ తల్లితో గొడవపడేవాడు. శనివారం రాత్రి కూడా మద్యం తాగి వచ్చి తల్లితో గొడవపడ్డాడు. ఆమె ఇవ్వకపోవడంతో ఇనుపరాడ్డుతో ఆమె తలపై మోది, గొంతు కోసి చంపేశాడు. మృతదేహాన్ని లాక్కెళ్లి ఇంటి దగ్గర్లోని చెట్ల పొదల్లో పడేశాడు. తన తల్లి కనిపించడం లేదని ఆదివారం ఉదయం కాసేపు వెతికాడు. ఆ తర్వాత పొదల్లోని మృతదేహాన్ని అప్పుడే చూసినట్లు ఏడవడం మొదలు పెట్టాడు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

అమెరికాలో తెలుగు డాక్టర్‌పై కాల్పులు

- దాడిలో తిరుపతి జిల్లా వైద్యుడి దుర్మరణం
- 38 ఏళ్లుగా సేవలు.. టస్కలూసాలో ఓ వీధికి ఆయన పేరు
- ఈత కొలనులో మునిగి సూర్యాపేట జిల్లా వాసి మరణం



రమేష్ బాబు, ప్రవీణ్‌కుమార్

నాయుడుపేట టౌన్/ఆత్మకూర్(ఎస్), ఆగస్టు 25: అమెరికాలో దుండగులు జరిపిన కాల్పుల్లో తిరుపతి జిల్లా నాయుడుపేట మండలం మేనకూరుకు చెందిన ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ పేరంశెట్టి రమేశ్‌బాబు(64) దుర్మరణం చెందారు. టస్కలూసా నగరంలోని ఆయన ఇంటి సమీపంలో ఉన్న కారు షెడ్‌వద్ద శుక్రవారం సాయంత్రం ఈ దారుణం జరిగింది. అమెరికాలో అనేక ఆసుపత్రులను నిర్వహించిన రమేశ్‌బాబు.. క్రిమ్సన్ నెట్‌వర్క్ పేరుతో పనిచేస్తున్న స్థానిక వైద్యాధికారుల బృందానికి వ్యవస్థాపకుడు. ఈ బృందానికి మెడికల్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరిస్తున్నారు. ఆరోగ్య రంగంలో 38 సంవత్సరాల పాటు ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా టస్కలూసాలోని ఓ వీధికి ఆయన పేరు పెట్టారు. కొవిడ్ సమయంలో ఆయన అందించిన సేవలకు పలు అవార్డులు అందుకున్నారు. చేనేత కుటుంబానికి చెందిన రమేష్ బాబు తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తిచేశారు. తర్వాత అమెరికా వెళ్లి జమైకాలో పీజీ పూర్తిచేసి డాక్టర్‌గా మంచిపేరు తెచ్చుకున్నారు. అక్కడే డాక్టర్‌గా పనిచేస్తున్న శ్రీలతను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరు అమెరికాలో స్థిరపడ్డారు. కాగా, అమెరికాలోని న్యూమెక్సికోలో ఉంటున్న సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్‌కు చెందిన తప్సి ప్రవీణ్ కుమార్(39) ఎమ్మెస్సీ చదవి హైదరాబాద్‌లోని ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. ఐదేళ్ల క్రితం అమెరికా వెళ్లి న్యూమెక్సికో ప్రాంతంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. శనివారం తన ఇంటి సమీపంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌లో ప్రమాదవశాత్తు పడిన ప్రవీణ్.. ఈత రాక నీట మునిగి చనిపోయారు.

ఆఫ్రికాలో తెలంగాణ వాసి మృతి



భరత్

వలిగొండ, ఆగస్టు 25: ఆఫ్రికాలోని గినియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లికి చెందిన గంధమల్ల భరత్(24) ప్రాణాలు కోల్పోయాడు. వర్కట్‌పల్లికి చెందిన గంధమల్ల శ్రీశైలంకు భార్య, కుమారుడు భరత్, వివాహితులైన ఇద్దరు కుమార్తెలున్నారు. శ్రీశైలం గినియాలో బోర్‌వెల్ యంత్రాన్ని నిర్వహిస్తున్నాడు. హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ పూర్తిచేసిన భరత్.. తండ్రికి చేదోడుగా ఉందామని ఆరేళ్ల క్రితం గినియా వెళ్లాడు. వృత్తి రీత్యా అక్కడి కొనక్రి నగరం నుంచి సిగ్రీ అనే ప్రాంతానికి వెళ్లేందుకు భరత్ ఆగస్టు 18న ఓ ప్రైవేటు వాహనంలో బయలుదేరాడు. అయితే, మార్గమధ్యలో ఆ వాహనం రోడ్డు ప్రమాదానికి గురి కాగా భరత్ సహా మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. భరత్ మృతదేహాన్ని శ్రీశైలం ఆదివారం స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు.

బాలికపై బాలుడి అత్యాచారం

ఆసిఫాబాద్ రూరల్, ఆగస్టు 25: కుమరం భీం ఆసిఫాబాద్‌కు చెందిన ఓ 13 ఏళ్ల బాలికపై ఓ 16 ఏళ్ల బాలుడు అత్యాచారం చేశాడు. స్నేహం పేరుతో దగ్గరై బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆసిఫాబాద్‌కు చెందిన ఓ బాలుడు బాలికతో స్నేహం చేశాడు. ఆమెతో ఫోన్‌లో వీడియో కాల్ మాట్లాడుతూ నగ్నంగా మాట్లాడాలని కోరాడు. మొదట ఒప్పుకోని బాలిక తర్వాత అంగీకరించింది. వీడియోకాల్ మాట్లాడే క్రమంలో బాలుడు స్క్రీన్ రికార్డ్ చేసి.. తర్వాత బాలికను బెదిరించి అత్యాచారం చేశాడు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు బాలుడిని జువైనల్ కోర్టులో హాజరు పరిచి.. పిల్లల సంరక్షణ గృహానికి పంపించారు.



బుద్ధ వనంలో బౌద్ధ విశ్వవిద్యాలయం!

- మలేషియా బుద్ధిస్ట్ సంస్థ ప్రతిపాదనలు
- బడ్జెట్ హోటల్ నిర్మాణానికి తైవాన్ ఓకే
- సమీక్షించి నిర్ణయం తీసుకోనున్న సర్కార్

హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ సమీపంలో అభివృద్ధి చేసిన బుద్ధ వనంలో బౌద్ధ విశ్వవిద్యాలయం స్థాపన కోసం మలేషియా బుద్ధిస్ట్ సంస్థ ముందుకు వచ్చింది. 274 ఎకరాల మేర విస్తరించి ఉన్న బుద్ధ వనం ప్రాజెక్టులో తమకు అవసరమైన స్థలాన్ని కేటాయించిన పక్షంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిసింది. బౌద్ధ మత ప్రచారకుడిగా విశ్వవ్యాప్త గుర్తింపుపొందిన ఆచార్య నాగార్జునుడు ఇక్కడ స్థాపించిన విజయపురి విశ్వవిద్యాలయంలో దేశ విదేశాలకు చెందిన వేలాది మంది విద్య అభ్యసించిన ప్రాశస్త్యాన్ని పరిగణనలోకి తీసుకుని బౌద్ధ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి వారు ఆసక్తి చూపుతున్నట్టు సమాచారం. మరోవైపు.. పర్యాటకులకు అవసరమైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు వీలుగా బడ్జెట్ హోటల్‌ను నిర్మించేందుకు తైవాన్ కేంద్రంగా పని చేస్తున్న బౌద్ధ సంస్థ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. అయితే, విదేశీ సంస్థలకు బుద్ధ వనంలో స్థలాల కేటాయింపుపై రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మలేషియా, తైవాన్ ప్రతినిధుల నుంచి వచ్చిన ప్రతిపాదనలపై ఉన్నత స్థాయిలో సమీక్షించి, నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

సైబర్ నేరాలకు ఏజెంట్లు!

ప్రతి దశలో దళారుల నియామకం.. వారి ద్వారానే బ్యాంకు ఖాతాలు

- సిమ్‌కార్డులు, సెల్‌ఫోన్లు కూడా
- వాటితోనే యథేచ్ఛగా సైబర్ నేరాలు



హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎక్కడో ఉత్తరాదిలో ఉంటూ.. అమాయకులకు కుచ్చుటోపీ పెడుతూ.. రూ.కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్ల సహకరిస్తున్నదెవరో తెలుసా? వారు చేసే ప్రతీ నేరానికి సిమ్ కార్డులు మొదలు.. సెల్‌ఫోన్లు అందజేయడం, చివరకు అమాయకుల డబ్బును బదిలీ చేసుకునేందుకు బ్యాంకు ఖాతాల దాకా సమకూర్చేందుకు ఎక్కడికక్కడ ఏజెంట్లను నియమించుకుంటున్నారు. తెలంగాణలో మారుమూల జిల్లాలకు కూడా సైబర్ నేరగాళ్ల ఏజెంట్ల సంస్కృతి పాకిపోయిందంటే.. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. బాధితులు ఫిర్యాదు చేసినా.. బ్యాంకు ఖాతాలు ఎవరి పేరిట ఉన్నాయో.. వారు, ఏజెంట్లు మాత్రమే పట్టుబడుతున్నారు. సైబర్ కేటుగాళ్లు మాత్రం సురక్షితంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సైబర్‌క్రైమ్ పోలీసులు.. ఏజెంట్ల ద్వారా మూలాలకు వెళ్లి నేరస్థులకు బేడీలు వేసే ప్రయత్నాలు చేస్తున్నారు.

30% కమీషన్..

సైబర్ నేరగాళ్లు తాము చేసిన నేరాల్లో ఏజెంట్లకు 30% కమీషన్ ఆశ చూపుతూ పని కానిచ్చేస్తున్నారు. ఏజెంట్లు గ్రామాల్లో ఉండే అమాయకులకు వల వేసి.. వారి పేరిట బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటి వివరాలను సైబర్ కేటుగాళ్లకు అందజేస్తూ.. లక్షలు గడిస్తున్నారు. నిర్మల్ జిల్లా భైంసాకు చెందిన ప్రణయ్ శిందే అనే ఏజెంట్.. అక్కడ నిరుపేద రైతులు, రైతుకూలీల పేర్లతో 125కు పైగా బ్యాంకు ఖాతాలను తెరిపించినట్లు పోలీసులు గుర్తించారు. రాష్ట్రంలో ఇటీవల చోటు చేసుకున్న సైబర్ నేరాల్లో బాధితుల సొమ్ము నిర్మల్ జిల్లాలోని బ్యాంకు ఖాతాల్లో జమ అవ్వడంతో.. పోలీసులు తీగ లాగితే.. ప్రణయ్ డొంక కదిలింది. ఇదే తరహాలో సెకండ్ హ్యాండ్ సెల్‌ఫోన్లు, గ్రామీణుల పేర్లతో తీసుకున్న సిమ్‌కార్డులను ఏజెంట్ల ద్వారా సంపాదిస్తున్న సైబర్ కేటుగాళ్లు.. వాటి సాయంతో నేరాలకు పాల్పడుతున్నారు. నేరం జరగ్గానే పోలీసులు ముందుగా దృష్టి సారించేది సెల్‌ఫోన్ నంబర్ యజమాని, స్మార్ట్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్‌పైనే. పోలీసులు వారిని విచారించేలోపు.. సైబర్ నేరగాళ్లు నగదును విత్‌డ్రా చేసుకుని, గప్‌చిప్ అయిపోతున్నారు.

పోలీసుల చేతిలో సైకాప్స్ అస్త్రం!

సైబర్ నేరాలకు సంబంధించి బాధితులు తెలంగాణకు చెందిన వారే అయినా.. నిందితులు ఇతర రాష్ట్రాల్లో ఉంటున్నారు. దీంతో సైబర్ నేరాల కట్టడిపై దృష్టి సారించిన రాష్ట్ర పోలీసులు.. అంతర్రాష్ట్ర ముఠాలను గుర్తించేందుకు టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఇండియన్ సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) సమాచారంతో.. రాష్ట్ర పోలీసులు సైబర్ క్రైం అనాలసిస్ అండ్ ప్రొఫైలింగ్ సిస్టం(సైకాప్స్) అనే టూల్‌ను రూపొందించారు. సైబర్ నేరగాళ్లు వాడిన సిమ్ నంబరు, ఐఎంఈఐ నంబర్‌ను ఇందులో ఎంటర్ చేస్తే.. వారు ఎక్కడున్నారో గుర్తించగలుగుతారు. ఇలా.. వేర్వేరు రాష్ట్రాలకు చెందిన 70 మంది కేటుగాళ్ల చిట్టాను ఈ యాప్‌లో పొందుపరిచారు. వీరు దేశవ్యాప్తంగా 9 వేలకు పైగా సైబర్ నేరాల కేసుల్లో నిందితులు. సైకాప్స్ మార్గదర్శనంలోనే ఇటీవల గుజరాత్‌లో 36మంది కేటుగాళ్లను పట్టుకోగలిగారు. వీరు దేశవ్యాప్తంగా వెయ్యికి పైగా సైబర్ నేరాల్లో నిందితులు. వీరిపై తెలంగాణలో 150 వరకు కేసులుండడం గమనార్హం. సైబర్ పోలీసులు ఓ వైపు నేరగాళ్లపైన ఫోకస్ చేస్తూనే.. ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. నేరం జరిగిన వెంటనే(గోల్డెన్ అవర్స్) ఫిర్యాదు చేస్తే.. పోగొట్టుకున్న డబ్బును తిరిగి రాబట్టవచ్చని, 1930కి ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.

బాధితులే ఏజెంట్లుగా మారి..

ట్రేడింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్ ఇలా రకరకాల పేర్లతో సైబర్ నేరగాళ్లు అమాయకులను ఉచ్చులోకి దింపుతుంటారు. అలా వారి ఉచ్చుకు చిక్కి.. ఉన్నదంతా పోగొట్టుకుంటున్న బాధితులు.. కమీషన్ల ఆశతో ఏజెంట్లుగా మారుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన కేశవరెడ్డి అలియాస్ మహా విషయంలో ఇదే జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. బెంగళూరులో నివసించే మహా.. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడేవాడు. బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బును తిరిగి సంపాదించేందుకు సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపాడు. వారి కోసం బ్యాంకు ఖాతాలను సమకూర్చడం మొదలుపెట్టాడు.

కస్తూర్బా విద్యాలయాల్లో సిబ్బంది వెట్టి

చాలీ చాలని వేతనాలు.. ఉద్యోగ భద్రత కరువు.. 15 ఏళ్లుగా క్రమబద్ధీకరణకు నోచుకోని వైనం

- సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్



పెద్దపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బాలికల్లో అక్షరాస్యతను పెంచేందుకు ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, సిబ్బందికి ఉద్యోగ భద్రత కరువైంది. ఏటా మంచి ఫలితాలు సాధిస్తున్నా.. ఉద్యోగులకు మాత్రం వెట్టిచాకిరీ తప్పడం లేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2009లో కస్తూర్బా విద్యాలయాలను ప్రారంభించారు. అక్షరాస్యతలో బాలికలు వెనుకబడ్డ మండలాలను గుర్తించి ఈ విద్యాలయాలను ఏర్పాటు చేశారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రెసిడెన్షియల్ తరహాలో విద్యను అందిస్తున్నారు. తొలుత ఈ విద్యాలయాల్లో తెలుగు మీడియంలోనే బోధించినప్పటికీ, క్రమంగా అన్ని విద్యాలయాలను ఆంగ్ల మాధ్యమంలోకి తీసుకొచ్చారు. తెలంగాణలో ప్రస్తుతం 475 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు కొనసాగుతున్నాయి. ఇందులో 283 విద్యాలయాలు ఇంటర్ విద్య వరకు అప్‌గ్రేడ్ కాగా, మరో 192 విద్యాలయాలు అప్‌గ్రేడ్ కావాల్సి ఉంది. పదవ తరగతి వరకు 99,423 మంది, ఇంటర్మీడియట్‌లో 24,730 మంది కలిపి మొత్తం 1,24,153 మంది బాలికలు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈ విద్యాలయాల్లో 7,398 మంది ఉపాధ్యాయులు, 5,983 మంది నాన్ టీచింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. అప్పట్లో టీచింగ్ సిబ్బందిని రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా నియమించగా, నాన్ టీచింగ్ స్టాఫ్‌ను ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమించారు. 2009-10 నుంచి 2010-11 విద్యా సంవత్సరం వరకు ఈ విద్యాలయాలను ప్రత్యేక సొసైటీల ద్వారా నిర్వహించగా, 2011-12 విద్యా సంవత్సరం నుంచి సర్వ శిక్ష ప్రాజెక్టు ద్వారా కొనసాగిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో కస్తూర్బా విద్యాలయాల నిర్వహణకు 536.16 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాలు ఉండగా, ఇందులో కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.320.49 కోట్లు వెచ్చించాల్సి ఉంది.

అరకొర వేతనాలతో ఇబ్బందులు..

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేసే ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బందికి అతి తక్కువ వేతనాలు అందుతున్నాయి. గురుకులం నిర్వహణను చూసుకునే స్పెషల్ ఆఫీసర్‌కు రూ.32,500, పీజీ సీఆర్‌టీలకు రూ.29,900, సీఆర్‌టీలకు రూ.26,000, పీఈటీలకు రూ.15,600, అకౌంటెంట్, ఏఎన్ఎంలకు రూ.14,300, అటెండర్, డే, నైట్ వాచ్‌మెన్, కుక్‌లకు రూ.9,750 చొప్పున వేతనాలు ఇస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది కంటే రెట్టింపు సేవలను అందిస్తున్నా.. వారికి కనీస వేతనాలు సైతం అందడం లేదు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా వేతన స్కేల్, సర్వీస్ రూల్స్, సెలవులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇక.. ప్రతి సీఆర్‌టీ నెలలో రెండు సార్లు నైట్ డ్యూటీ నిర్వహించాల్సి వస్తుంది. ఉదయం పూట విధులకు వెళ్లిన వారు.. ఆ మరుసటి రోజు మధ్యాహ్నం వరకు నిర్విరామంగా పని చేయాల్సి ఉంటుంది. మరోవైపు.. కస్తూర్బా సిబ్బందిని సెక్టోరల్ అధికారులు చులకనగా చూస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని వారు మొర పెట్టుకుంటున్నా.. ఆలకించే వారు కరువయ్యారు. సెర్ప్, జూనియర్ కాలేజీల్లో ఉద్యోగులు, అధ్యాపకులను క్రమబద్ధీకరించిన గత ప్రభుత్వం.. కస్తూర్బా ఉద్యోగులను మాత్రం గాలికి వదిలేసింది. కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కస్తూర్బా విద్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు కోరుతున్నారు.

బీసీ కమిషన్ మారుతుందా?

- ఉన్నదే కొనసాగుతుందా?
- కులగణన, స్థానిక ఎన్నికల నేపథ్యంలో చర్చ

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త బీసీ కమిషన్ వస్తుందా, లేదా ఉన్నదాన్నే కొనసాగిస్తారా అని చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే కులగణన చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత ఆరు నెలలుగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. అభివృద్ధి పనులు, ఫైనాన్స్ కమిషన్ నుంచి నిధుల విడుదల కోసం స్థానిక సంస్థల ఎన్నికలను వీలైనంత త్వరగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గ్రామాల్లో పనులు చేయించిన సర్పంచులు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. తమ బకాయిలు ఇప్పించాలని అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలనే ఆలోచనలో ఉంది. అదే సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని, దీనికోసం కుల గణన పూర్తి చేస్తామని కాంగ్రెస్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక కూడా దీన్ని నిలబెట్టుకుంటామని పలుమార్లు ప్రకటిస్తూ వస్తోంది. మూడు రోజుల క్రితం మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ విషయాన్ని మరొకసారి నొక్కి చెప్పారు. దాంతో బీసీ కమిషన్ విషయం కూడా చర్చకు వస్తోంది. కుల గణన ప్రక్రియ సాధారణంగా బీసీ కమిషన్ ఆధ్వర్యంలో జరగాల్సి ఉంటుంది. గణన ఎవరూ చేసినా డేటా మొత్తం బీసీ కమిషన్‌కు అందజేయాలి. అపుడు కమిషన్ ఆ డేటాను విశ్లేషించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి రిజర్వేషన్ల కోటాను ఖరారు చేయాల్సి ఉంటుంది. గతంలో సుప్రీం కోర్టు చెప్పిన ట్రిపుల్ టీ నియమం ప్రకారం ఇదే పద్ధతి అనుసరించాలి. ట్రిపుల్ టీలో భాగంగా డెడికేటెడ్ బీసీ కమిషన్ కులాల వారి డేటా విశ్లేషణ చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల రిజర్వేషన్ 50 శాతం మించకుండా చూడాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీసీ కమిషన్‌కు టీవోఆర్ (టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్) జారీ చేయాలి. అంటే కమిషన్ విధివిధానాలు నిర్ణయిస్తూ టీవోఆర్ జారీ చేయాలి. అప్పుడే కుల గణన మొదలవుతుంది. అయితే ఇది కొత్త కమిషన్‌తో చేయిస్తారా? లేదంటే ప్రస్తుత కమిషన్‌నే కొనసాగిస్తారా? అన్నది ప్రస్తుతం చర్చగా సాగుతోంది.

కుల గణనపై ఇప్పటికే నివేదికల సమర్పణ

బీసీ కమిషన్‌లో ఛైర్మన్ వకుళాభరం కృష్ణమోహన్ సహా మరో ముగ్గురు సభ్యులు ఉన్నారు. ఈ కమిషన్ ఇప్పటికే కులగణనపై కొంత కసరత్తు చేసింది. స్థానిక సంస్థల కోసమే గణన చేస్తే ఎలా చేయాలి? విద్యా ఉద్యోగ, రాజకీయ, సామాజిక స్థితిగతులు అంచనా వేసేలా విస్తృత స్థాయిలో కులగణన ఎలా చేయాలి? అనే విషయంలో ప్రభుత్వానికి పలు నివేదికలు ఇచ్చింది. ఆయా రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధానాలు, అక్కడ ఎదురైన న్యాయపరమైన చిక్కుల గురించి కూడా వివరించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కొత్త కమిషన్ వచ్చి.. విషయం పట్ల అవగాహన చేసుకునే వరకు సమయం పడుతుందని, ఉన్న కమిషన్‌ను కొనసాగించడం మంచిదేమోనన్న వాదన వినిపిస్తోంది. అయితే ప్రభుత్వం పాత వారితో వెళ్లిపోవడమా, పూర్తిగా తమ ముద్రతో కొత్త కమిషన్ ఏర్పాటు చేసుకోవడమా అనే విషయంలో ఏ నిర్ణయాన్ని స్పష్టంగా ప్రకటించడం లేదు. కులగణనపై అంతర్గతంగా ఒక ప్రణాళిక రచిస్తున్న తీరులోనే కమిషన్ విషయంలో ఏం చేయాలనే కసరత్తు కూడా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుత రిజర్వేషన్లు

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీలకు 27 శాతం, బీసీలకు 23 శాతం రిజర్వేషన్లు కొనసాగాయి. గతంలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఉండేవి. కానీ సుప్రీం కోర్టు మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని తీర్పు వెలువరించడంతో ఎస్సీఎస్టీలకు 27 శాతం పోనూ బీసీలకు 23 శాతం కేటాయించారు. 2018 తెలంగాణ పంచాయితీ చట్టంలో బీసీలకు వాస్తవానికి 34 శాతం రిజర్వేషన్లు కల్పించారు. అయితే తర్వాత సుప్రీం కోర్టు తీర్పు నేపథ్యంలో వాటిని 23 శాతానికి తగ్గించారు.

'వరలక్ష్మి టిఫిన్స్' ప్రభాకర్‌రెడ్డి అరెస్టు

- పెళ్లి పేరుతో మోసం చేశాడంటూ ఫిర్యాదు చేసిన యువతి
- ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు
- అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన గచ్చిబౌలి పోలీసులు
- గతంలో ఒకసారి డ్రగ్స్ కేసులో అరెస్టయిన ప్రభాకర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గతంలో డ్రగ్స్ కేసులో అరెస్టయి జైలుకు వెళ్లిన 'వరలక్ష్మి టిఫిన్స్' యజమాని ప్రభాకర్‌రెడ్డిని గచ్చిబౌలి పోలీసులు.. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రకాశం జిల్లాకు చెందిన ప్రభాకర్‌రెడ్డి (35) 2017లో బతుకుతెరువు కోసం నగరానికి వచ్చి.. గచ్చిబౌలి హౌసింగ్‌బోర్డు కాలనీలో 'వరలక్ష్మి టిఫిన్స్' పేరుతో టిఫిన్ సెంటర్ నడుపుతున్న సంగతి తెలిసిందే. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేసే కరీంనగర్ మహిళ(32)తో అతడికి పబ్‌లో పరిచయమైంది. అతణ్ని నమ్మిన ఆమె ఉద్యోగం మానేసి.. అతడి మాటలు విని స్మగ్లర్‌గా మారింది. ఈ క్రమంలోనే.. పెళ్లి చేసుకుంటానని చెప్పి ప్రభాకర్ రెడ్డి తనను మోసం చేశాడని.. గచ్చిబౌలి పోలీసులకు ఈ ఏడాది జనవరిలో ఆమె ఫిర్యాదు చేసింది. ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం అతణ్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

అలా మొదలైంది..

పదోతరగతిలోపే చదువు మానేసిన ప్రభాకర్ రెడ్డి.. ప్రకాశం జిల్లాలో రోడ్డుపక్క నాలుగు చక్రాల బండిమీద టిఫిన్ సెంటర్ పెట్టాడు. ఆ తర్వాత ఎక్కువ సంపాదన కోసం ప్రకాశం నుంచి 2017 హైదరాబాద్‌కు వచ్చాడు. గచ్చిబౌలి పరిధిలోని డీఎల్ఎఫ్‌లో చిన్న టిఫిన్ సెంటర్ ప్రారంభించాడు. రుచి, నాణ్యత బాగుండటంతో నగరవాసులు క్యూ కట్టారు. అనతికాలంలోనే వరలక్ష్మి టిఫిన్స్ పేరుతో సుమారు 10 బ్రాంచ్‌లు ఏర్పాటు చేశాడు. ఒక్కో టిఫిన్ సెంటర్ నుంచి రోజుకు రూ. 3-5 లక్షల ఆదాయం వస్తుండడంతో ప్రభాకర్‌రెడ్డి జల్సాలకు.. క్రమంగా డ్రగ్స్‌కు అలవాటుపడ్డాడు. పబ్‌లో తనకు పరిచయమైన మహిళనే స్మగ్లర్‌గా మార్చి.. గోవా నుంచి ఆమె ద్వారా నగరానికి డ్రగ్స్ స్మగ్లింగ్ సరఫరా చేయించేవాడు. ఆ డ్రగ్స్‌ను వారు తీసుకోవడంతో పాటు.. నగరంలో మరో 15 మంది కస్టమర్స్‌కు విక్రయించేవారు. ఈ దందాపై విశ్వసనీయ సమాచారం అందుకున్న సైబరాబాద్ మోకిలా పోలీసులు, రాజేంద్రనగర్ ఎస్‌వోటీ టీమ్ సంయుక్తంగా దాడిచేసి గతేడాది సెప్టెంబర్‌లో ప్రభాకర్ అండ్ కో ముఠాను పట్టుకున్నారు.

వివిధ

సాహిత్య వేదిక
vividha@andhrajyothy.com
బొమ్మలు: అక్బర్

ముసుగుల్ని సహించని అక్షరం



కథలు, కవితలు, స్మృతి వ్యాసాలూ కూడా రాసినా గానీ కాశీభట్ల వేణుగోపాల్‌ను ప్రధానంగా నవలా రచయిత గానే పాఠకులు గుర్తుంచుకుంటారనుకుంటాను. ఆ నవలలు అలాంటి ఇతివృత్తాలతో, అలాంటి శైలితో తెలుగులో ఆయనొక్కరి దగ్గరే దొరుకుతాయి. 'నేనూ–చీకటి', 'దిగంతం', 'తపన', 'తెరవని తలుపులు', 'మంచు పూవు' లాంటి నవలలు తెలుగు సాహిత్యంలో ఆయన ప్రత్యేక సంతకంగా నిలుస్తాయి. 'నవలా శిల్పం' అన్న ఈ శీర్షిక కోసం కాశీభట్లను మాట్లాడించాలని జూలై నెలలో ఫోన్ చేశాను. ఆయన ప్రశ్నలు పంపమన్నారు. కానీ పంపిన ప్రశ్నలకు దేనికది జవాబు ఇవ్వకుండా అంతా కలిపి ఒకే చిన్న వ్యాసంలా రాశారు. అందులో కూడా నేను అడిగిన ప్రశ్నలన్నింటికీ జవాబులు లేవు. తర్వాత ఫోన్ చేసి వాటి గురించి అడిగాను. ఆ సంభాషణలో కూడా ఆయన్నుంచి పెద్దగా జవాబులు రప్పించలేకపోయాను. దాదాపు ఐదేళ్ళ గాప్ తర్వాత నేను చేసిన ఈ ఫోన్ కాల్స్‌లో ఆయన గొంతు చాలా మారిపోయి వినపడింది.

పదం పదం కూడబలుక్కున్నట్టు మాట్లాడుతున్నారు. దరిదాపుల్లో పొంచి ఉన్న మరణమే ఆ అలసటకి కారణమేమో. ఏదేమైనా ఆయన్ని నవలా రచన మీద మాట్లాడిద్దాం అన్న నా ప్రయత్నం అసంపూర్తిగా మిగిలింది. ఆగస్టు 19న ఆయన వెళ్ళిపోయారు.

కాశీభట్ల ఈ నిష్క్రమణ కోసం చాలా కాలం నుంచే పెట్టే బేడా సర్దుకుని సిద్ధంగా ఉన్నారేమో అనిపిస్తుంది. అంటే జీవితం పట్ల ఏదో నిరాశతో కాదు. 'మళ్ళీ ఎగరాలని...' ఆశ ఎప్పుడూ ఉంది. కానీ అప్పటిదాకా ఎలా పడితే అలా వాడిన శరీరం త్వరలోనే పగ తీర్చుకుంటుందని ఆయనకి తెలుసు. 2013లో ఒక వెబ్‌మేగజైన్ కోసం ఆయన్ని ఇంటర్వ్యూ చేశాను. ఆ సంభాషణలో ఆయన "ఇదే నా చివరి ఇంటర్వ్యూ అవుతుందేమో" అన్నారు. ఆ తర్వాత అనారోగ్యాలతో చేతనైనంత యుద్ధం చేస్తూ, మరణాన్ని వీలైనంత వాయిదా వేసి, పదేళ్ళ తర్వాత, ఇలా చివరి ఇంటర్వ్యూ మళ్ళీ నాకే ఇచ్చి వెళ్ళిపోయారు. ఆ అసంపూర్ణమైన ఇంటర్వ్యూనే ఇక్కడ ఇస్తున్నాను. ఇది నేను అనుకున్నట్టు నవలల మీద సాగలేదు. ఐతే 1997లో నా పదిహేనేళ్ళ వయసులో ఆయన అక్షరంతో మొదటి పరిచయం అయినదగ్గర్నుంచీ ఇరవై ఎనిమిదేళ్ళ వయస్సులో 2010లో స్వయంగా ఆయనతో పరిచయం అయ్యేదాకా ఒక పాఠకుడిగా నాకు ఆయన నవలలతో, శైలితో దగ్గరి పరిచయం ఉంది. నవలా రచన మీద కాశీభట్ల అభిప్రాయాలేమిటో నాకు తెలుసు.

రచన అనేది బుద్ధిపూర్వకంగా, ఆద్యంతం అంతా తెలిసి చేసే పని అని ఆయన ఎప్పుడూ అనుకోలేదు. పెన్ పుచ్చుకొని ఖాళీ కాయితం ముందు కూర్చుని ఏదైనా రాయటానికి పూనుకోవటం అంటే– ఆయన దృష్టిలో– అది తెలీనిదేన్నో వెతుక్కుంటూ మొదలుపెట్టే ప్రయాణం ("a journey in seach of an unknown"). ఆ వెతుకులాట కూడా నింపాదిగా సాగేది కాదు. అందులో ఒక తొందర, తరుముడు ఉంటుంది, ముగింపు చేరాకే ఊపిరాడుతుందన్న వేగం ఉంటుంది. "నా పుస్తకాలేవీ వందపేజీలు దాటవు. నేను చెప్పదల్చుకున్నది అంతా కండెన్స్‌డ్‌గా ఉంటుంది. I hurry towards the end. చివరి వాక్యం కోసం పరిగెడుతుంటాను. అక్కడికి వచ్చాకా 'ఆహ్' అన్న రిలీఫ్" అంటారు. అప్పట్లో నేను పనిచేస్తున్న వెబ్‌మేగజైన్‌కి ఒక కథ పంపితే ఆయన చేతి రాతని మొదటి సారి చూశాను. స్కూలు పిల్లలు వాడే లాంటి సింగిల్ రూల్ నోట్ బుక్‌లో ఎరుపు బాల్ పాయింట్ పెన్‌తో మూడేసి చుక్కల పంక్చువేషన్ ఎడా పెడా వెదజల్లుతూ రాశారు. అది ఎన్నో డ్రాఫ్ట్ అని అడిగితే "మొదటి డ్రాఫ్ట్" అన్నారు.

> **"ఇన్ని గంటలు అని పెట్టుకుని రాయడం నాకు చేత కాదు. ఒక్కోసారి కొన్ని వారాల పాటు దాని జోలికి వెళ్లను. నా రచన ఇంటెన్స్‌గా కనపడుతుందేమో గానీ నేను చాలా లేజీ రైటర్‌ని."**

ఆయనకు రచయితగా చాలా ఆలస్యంగా గుర్తింపు వచ్చింది. నలభై మూడేళ్ళ వయస్సులో ఆయన మొదటి నవల 'నేనూ – చీకటి' ఆంధ్ర ప్రభలో సీరియలైజ్ అయ్యింది. ఎప్పుడో ఇరవై ఏళ్ళ వయస్సులో ఉండగా రాసిన 'రంగనాయకి లేచిపోయింది' అన్న మొదటి కథ పబ్లిష్ ఐనప్పుడు అది చదివి ఆయన గురువు దావూద్ సాహెబ్ అన్న మాటలే కాశీభట్లను ఆ తర్వాత పాతికేళ్ళ పాటు ఏమీ పబ్లిష్ చేయకుండా చేశాయి: "ఒరే నువ్వు చాలా బాగా రాస్తున్నావు. కానీ నీ మెదడింకా ఎదగాల్సి వుంది. దానికి నీకు పుస్తకాలకంటే మనుషులెక్కువ పని చేస్తారు. ప్రపంచాన్ని విస్తృతంగా పర్యటించటానికి ప్రయత్నించు. అధ్యయనం చేయి. రాసిన వాక్యాన్ని సపోర్ట్ చేసుకోగలవూ అన్నప్పుడే ఒక వాక్యాన్ని రాయి. పదిమంది పది ప్రశ్నలేస్తే ఆ పదిమందినీ కన్విన్స్ చేసేట్టు ఆ వాక్యం ఉండాలి. లేదంటే ఆ వాక్యాన్ని నీకై నువ్వు సపోర్ట్ చేసుకునేట్టుగా ఐనా ఉండాలి. అంతవరకూ రాయద్దురా," అన్నాడట. గురువు మాటని అక్షరాలా పాటించాడాయన. సైకిలెక్కి దేశమంతా తిరిగాడు. ప్రతి వాక్యం వెనుకా బలంగా నిలబడగలనన్న నమ్మకం వచ్చేదాకా రాయలేదు. అలా పాతికేళ్ళ పాటు దేన్నీ పబ్లిష్ చేయకుండా నిశ్శబ్దంగా ఉండిపోయి, నలభై మూడో ఏట ఒకేసారి 'నేనూ–చీకటి' ప్రచురించేసరికి, తెలుగు సాహిత్య లోకం ఉలిక్కి పడింది. శేషేంద్ర శర్మ ఆ నవలని "బౌద్ధిక భూకంపం" అన్నారు.

ఆ నవలలోనూ, ఆ తర్వాత రాసిన ప్రతి నవలలోనూ– బైట సమాజానికి కనపడని మనిషిలోని చీకటి తావుల గురించి ఎక్కువ రాశారు. ఆ చీకట్లను దాచుకోవటానికి మనిషి తొడిగే ముసుగుల గురించి రాశారు. మననం చేసుకోవటానికి కూడా మనమే సిగ్గుపడే ఆలోచనలకి నిర్మొహమాటమైన అక్షరాల్ని ఇచ్చారు.

వీటి గురించే ఎందుకు రాయాలని అడిగితే ఆయన చెప్పిన జవాబు: "మామూలు విషయాలు చెప్పటానికి చాలామంది ఉన్నారు. జీవితాన్నీ ప్రపంచాన్నీ సౌందర్యవంతం చేయటానికీ, మనసును చల్లబరచటానికీ, ఉపశమనంగా రాయటానికీ కోట్లాది మంది రచయితలున్నారు. నాలాంటి వాడు మధ్యలో ఎక్కడో ఉంటే తప్పేం లేదు కదా. ఇప్పుడు కాదు, ఇంకెన్ని రాసినా నేను

నవలా శిల్పం

డార్కర్ సైడ్ ఆఫ్ లైఫ్ గురించే రాస్తాను. ఈ లాబరింత్ (labyrinth)ను నేను ఎక్స్‌ప్లోర్ చేస్తూనే వెళ్తున్నాను. బయటకు దారి దొరుకుతుందేమో తెలియదు. దొరకదేమో కూడా. By the time I'll be dead. నేను చచ్చిపోయింతర్వాత ఏమవుతా నన్నది అస్తిత్వవాదం ప్రకారం నాకు సంబంధం లేదు. నా రచనలన్నీ నేను బతికుండగానే తగలబెట్టి ఎవడన్నా దాని మీద ఒంటేలుకు పోయినా కూడా నాకేం ప్రోబ్లెం లేదు. I wanted to speak out my inner self."

ఆయన మాటల్లో– 'నేనూ చీకటి'లో కవిత్వ శైలి గురించి:

నా సాహితీ ప్రస్థానం కవిత్వంతోనే మొదలైంది. అసలు మొదటి నవలగా పిలవబడుతున్న 'నేనూ చీకటి' మొదటి వాక్యాలు కవితా వాక్యాలే.. తరవాత అందులోకి కథ ప్రవేశించింది. మెల్లగా కథ దాన్ని ముందుకు లాక్కుపోయింది. అందుకే అందులో కొన్ని వ్యక్తిగత జీవితంలోని చాలా ఘటనలు నిర్మొహమాటంగా ప్రవేశించాయి.

కవిత్వమన్నది పూర్తి వ్యక్తిగతమైందని నేను నిష్కర్షగా నమ్ముతాను. ఏ సంఘటనన్నైనా కవితగా రాయొచ్చు అని నేననుకోను. కవిత్వానికి భాష ప్రత్యేకమైంది కావాలి, ఉపమలూ ఉత్ప్రేక్షలూ వుండాలి, భాషలో సాంద్రత అవసరం... కొద్దిగా క్లిష్టత కూడా వుండాలి. ఆ క్లిష్టతపాలు మరీ ఎక్కువై 'నేనూ–చీకటి' ఎక్కువమంది పాఠకులకు అందలేదు... 'నేనూ–చీకటి'లో కథ ఉంది. ఆ కథ పాఠకులకు అర్థం కావాలి అని నేననుకున్నాను. కానీ కాలేదని అర్థమైంది. ఆ విషయం గ్రహించాను. కాబట్టి పాఠకులకేమైనా అర్థం కావాలనుకుని నేను రాస్తే అది 'నేనూ – చీకటి'కి భిన్నంగా వుండాలని అనుకున్నాను. అందుకనే అదే కాలంలో మొదలుపెట్టి కంప్లీట్ చేసిన 'తపన'లో క్లిష్టతని చాలామటుకు తగ్గించేశాను.

రాసే భాషపై సంస్కృత ప్రభావం

బ్రాహ్మణ కుటుంబంలో పుట్టడం, రోజూ సంస్కృతంలో మంత్రాలు వినడం, తండ్రి పురోహితుడు కావడం, అమ్మ కూడా పురోహిత కుటుంబీకురాలు కావడం... ప్రతీ ఉదయం నామలింగానుశాసనం అనబడే అమరకోశం వల్లె వేయడం... ఇలాంటి కారణాల వల్ల సంస్కృతంలా బరువైన తెలుగు భాష వాడటం అలవాటు చేసుకున్నా ('నేనూ–చీకటి'కి మాత్రం). తర్వాత ఇమ్మీడియెట్‌గా సంస్కృతం వాడటాన్ని తగ్గించేసా.

నవలలన్నీ ఫస్ట్ పెర్సన్‌లోనే ఎందుకు

నేను రాసిన నవలలు చాలామటుకు నిజ జీవితాన్ని రిఫ్లెక్ట్ చేస్తూ వుంటాయి, సంభాషణలతో సహా... కాబట్టి ఆ ఆ జీవితాలు నాకు అత్యంత పరిచయమైనవిగా వుండాలి. నేను రాస్తున్నా కాబట్టి, నాకు తెలిసిన కథలు కాబట్టి 'నేను' చెబుతాను. అదొక్కటే కాదులెండి. అదొక సిగ్నేచర్ కూడా.

రాయటానికి ఇబ్బంది పెట్టిన నవల

'తెరవని తలుపులు'. ఎందుకంటే అది నాకస్సలు పరిచయం లేని వ్యక్తుల గురించి రాసింది కాబట్టి. నా చేత ఆ నవల అడిగి రాయించుకున్న వ్యక్తి అందులోని మిగతా వ్యక్తుల గురించి చిన్న చిన్న డీటైల్స్ కూడా నాకు చెప్పడంలో కష్టపడ్డాడు. చాలా చిన్న నవల (నావన్నీ చిన్నవే). కానీ రాయడానికి నాకు పట్టిన సమయం మూడున్నరేళ్లు! అంతగా ఇంకే నవల రాయడానికి కష్టపడలేదు.

ఏది కథ, ఏది నవల

కథ అన్నది ఒక ఇన్సిడెంట్. నవల కొన్ని ఇన్సిడెంట్స్ కలిపి రాసేది. ఇది నేను ఇచ్చుకున్న అర్థం.

రీరైటింగ్? రివిజన్?

నేను ఇంతవరకు ఏదీ రీరైట్ చేయలేదు. ప్రూఫ్ రీడ్ చేసేటప్పుడు అచ్చుతప్పులు సరి చేస్తాను, ఎక్కడైనా పదాలు మార్చాలంటే మారుస్తాను. ఇన్ని గంటలు అని పెట్టుకుని రాయడం నాకు చేత కాదు. ఒక్కోసారి కొన్ని వారాల పాటు దాని జోలికి వెళ్లను. నా రచన ఇంటెన్స్ గా కనపడుతుందేమో గానీ నేను చాలా లేజీ రైటర్‌ని.

ఎక్కువ చదవటం తప్పనిసరి

రచయితన్నవాడు మంచి పాఠకుడు కావాలి. ఒకరిద్దరిని కాదు. ఎంతమందిని వీలైతే అంతమంది రచయితల్ని చదవాలి. మంచి స్టాండర్డ్ ఉన్న రచయితల్ని ఎన్నుకుని చదవాలి. ప్రపంచ సాహిత్యం చాలామటుకు ఇంగ్లీష్‌లోకి అనువాదమై ఉంది కాబట్టి ఎక్కువ చదవడం కోసం మనకు ఇంగ్లీష్ వచ్చుండాలి.

ఇంటర్వ్యూ ■ మెహెర్



AKBAR

బాహ్యాంతరంగం

సరస్సు మాట్లాడినప్పుడు
నేను వినను
అలలు సరస్సు గురించి మాట్లాడినప్పుడు వింటాను
చేపలు కూడా చలనం గురించి
మాట్లాడినప్పుడు వింటాను

సముద్రం మాట్లాడినప్పుడు వినను
కెరటాలు సాగరం గురించి మాట్లాడినప్పుడు వింటాను
తిమింగలం
జీవితం లోతు గురించి మాట్లాడినప్పుడు వింటాను

చెట్టు మాట్లాడినప్పుడు వినను
కొమ్మ మీద కూర్చున్న పిట్ట
చెట్టు గురించి మాట్లాడినప్పుడు వింటాను
నీడనిచ్చే స్వభావం గురించి వింటాను

స్మశానం మాట్లాడినప్పుడు వినను
సమాధి మాట్లాడినప్పుడు వింటాను
అబద్ధానికీ నిజానికీ మధ్య వున్న తెర గురించి
మాట్లాడినప్పుడు వింటాను

మనిషితో మాట్లాడలేను
అతనిలోని ఆత్మ మాట్లాడితే వింటాను

■ నగ్నముని

నా మొదటి పుస్తకం

భరోసా ఉంది, భ్రమా ఉంది!


\- వరవరరావు

నా కవితా సంపుటి 'చలినెగళ్లు' పేరుతో 1968 మే నెలలో వెలువడింది. నిజానికి 1965లో వెలువడవలసింది. ఎందుకంటే అందులో నేను 1958 నుంచి 64 వరకు రాసిన తొలి కవితలు ఉన్నాయి. దాని గురించి మాట్లాడాలంటే జ్ఞాపకాల వీధి (డౌన్ మెమొరీ లేన్)లో అరవై ఏళ్ళు వెనక్కి వెళ్ళాలి. వరంగల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ, మిత్ర మండలి సాహిత్య సంస్థ నుంచి, ఉస్మానియా విశ్వవిద్యాలయ క్యాంపస్, ఆర్ట్స్ కాలేజి, ముఖ్యంగా ఎ హాస్టల్ రూమ్ నెం.67 దాకా నా 57–64 విద్యార్థి, యవ్వన అనుభవాల్లోకి, అనుభూతుల్లోకి వెళ్లాలి– అన్ని విధాల నా నేల నుంచి, నా భాష నుంచి చాలా దూరం నడిచి వచ్చిన ప్రవాసం నుంచి.

'చలినెగళ్లు' హైదరాబాద్ నారాయణగూడలోని నాగార్జున ప్రింటర్స్‌లో అచ్చయ్యింది. 1964 డిసెంబర్ మూడో వారానికి నేను క్యాంపస్ వదలడంతో నా కవితా సంకలనం ప్రయత్నాలు కూడా మూలపడినవి. 1966లో ప్రారంభమైన సృజన ద్వారానే పరిచయమైన శ్రీపతి హైదరాబాద్‌లో సృజన చిరునామా అయ్యాడు. ఆయన స్నేహం నాకు శ్రీకాకుళం సుబ్బారావు పాణిగ్రాహినే కాదు, ఆయన సహాధ్యాయులు సత్యం కైలాసం, రమణమూర్తి, భూషణం వంటి అందరినీ, శ్రీకాకుళ ఉద్యమాన్నీ పరిచయం చేసింది.

నాకు ఆధునిక/ అభ్యుదయ కవిగా గుర్తింపు తెచ్చిన 'సోషలిస్టు చంద్రుడు' 1957 'చలినెగళ్లు'లో చేర్చలేదు. 1958లో రాసిన 'కుక్కపిల్ల ఎక్కడికని వెళిపోతుంది' – స్వర్గంలోని వర్గ కలహాలు దాని కళ్లల్లో చదువుకుంటాను – అనే కవితలో సారళ్యం, స్పష్టత నండూరి రామమోహనరావు వంటి కవి, విమర్శకులు, పత్రికా సంపాదకుల దృష్టిని ఆకర్షించింది. 'కప్పుకోడానికి ఏమున్నయి, అయినా కప్పుకోడానికి ఏమున్నయి' (ఆకలి) కవితా వాక్యం చేకూరి రామారావుకు పాఠ్యాంశమైంది. 1962లో మర్లిన్ మన్రో చనిపోయినపుడు రాసిన కవిత 'అకవితా వస్తువు' నా కవిత్వాన్ని సంకలనంగా వేసుకోవాలన్న ఆత్మవిశ్వాసానికి దారి తీసింది. అది కొత్తగా విజయవాడ నుంచి వెలువడిన 'జ్యోతి'లో బాపు ఇష్టంగా వేసిన బొమ్మతో అచ్చయి ఆయనతో, రమణతో స్నేహం ఏర్పడింది. ఆ స్నేహాన్ని పురస్కరించుకునే బాపు 'చలినెగళ్లు'కు ముఖచిత్రం వేసి అక్షరాలు రాసాడు. కవర్ వెనుక ఉన్న నా ఫొటో ఆర్టిస్టు, రచయిత చలసాని ప్రసాదరావు 1961లో ఆంధ్ర సారస్వత పరిషత్ ఆవరణలో తీసింది. కింద నా పరిచయ వాక్యాలు రాసింది శ్రీపతి.





మా ఉత్తర ప్రత్యుత్తర స్నేహంతో కెవిఆర్ గారికి నేను 62లో 'చలినెగళ్లు' రాతప్రతి పంపించాను. ఆయన అక్షర, శబ్ద దోషాలు మొదలు అన్వయం దాకా సవరించి ఓపికగా సూచనలు చేసారు. ఆ సందర్భంలోనే ఎండా కాలం సెలవులు మే చలం సంచిక 'సృజన'తో పాటు 'చలినెగళ్లు' రూపొందింది. ఇటు శ్రీపతి ప్రోత్సాహానికి అటు 'మిత్రమండలి' సీనియర్ రచయిత దేవులపల్లి సుదర్శనరావు నెల్లుట్ల సంజీవరావుతో కలిసి ప్రచురణ సంస్థ ప్రారంభించాలనే ఆకాంక్ష దోహదం చేసింది. ఆయన అప్పటికే తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో కవి. "వసుధైక కుటుంబం కోసం, వర్గరహిత సమాజం కోసం ఎలుగెత్తి పిలిచి, మేల్కొల్పి స్వాతంత్ర్య పరమావధి వైపు పురోగమించే ప్రబోధం చేసిన వాని కోసం సాగిన" తన అన్వేషణలో నేను దొరికానని రాసారు.

> **కాగితం మీద రాసిన అక్షరానికి నిలవాలనే నిబద్ధత నా కవితా ప్రయాణానికి దిశానిర్దేశం చేసింది. ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటే స్పష్టాస్పష్టమైన నెహ్రూవియన్ సామ్యవాద ఎండమావి నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవ సాంస్కృతిక, సాహిత్య మార్గాన్ని ఎంచుకున్నాను.**

ఆంధ్రజ్యోతి వారపత్రికలో ఇంద్రగంటి శ్రీకాంతశర్మ అనుకూలమైన సమీక్ష చేసాడు. కాని తెలంగాణలో వాడే 'బొక్కలు' అనే మాటను ఆంధ్రలో పొక్కలుగా అర్థం చేసుకొని అన్వయం కొన్ని చోట్ల కుదరలేదన్నాడు. 'సంవేదన'లో రాచమల్లు రామచంద్రారెడ్డి నన్ను ప్రోత్సహించే సమీక్ష రాసాడు. కుందుర్తి 1968లో ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డులు ప్రారంభించాక శీలా వీర్రాజు 'కొడిగట్టిన సూర్యుడు' (68) తర్వాత 69లో 'చలినెగళ్లు'కు వచ్చింది. 'చలినెగళ్లు' గుడిపాటి వెంకట చలానికి అంకితమిచ్చాను.


కాగితం మీద రాసిన అక్షరానికి నిలవాలనే నిబద్ధత నా కవితా ప్రయాణానికి దిశానిర్దేశం చేసింది. ఇపుడు వెనక్కి తిరిగి చూసుకుంటే స్పష్టాస్పష్టమైన నెహ్రూవియన్ సామ్యవాద ఎండమావి నుంచి నూతన ప్రజాస్వామిక విప్లవ సాంస్కృతిక, సాహిత్య మార్గాన్ని ఎంచుకున్నాను. అది 'మిత్రమండలి' నుంచి, ఫ్రీవర్స్ ఫ్రంట్ నుంచి, సృజన, విరసంలోకి ప్రయాణం వల్ల సాధ్యమైంది. 'చలినెగళ్లు', ఇతివృత్త కవితల్లోని ప్రబంధ భాషా ప్రభావం నుంచి 'అన్‌లర్నింగ్ ప్రాసెస్'లో ప్రజలకు చేరువయ్యే పలకరించే భాషలోకి చేరుకున్నాను. ■

ప్రియ పద్యం

శ్రీసుధ మోదుగు కవిత్వం

ఒక పాఠకుడిగా నాకు ఏ predetermined అభిప్రాయాలు కవిత్వానికి సంబంధించి ఉండవనే అనుకుంటాను. ఇప్పుడు కవిత్వ పాఠకునికి కావాల్సిందల్లా, శాశ్వతంగా పీఠాలు వేసి కూర్చున్న అనుభవాలనూ అర్థాలనూ decentralize చేస్తూ, ముక్కలు చేస్తూ పోవటమే. తిరిగి కొత్త అర్థాలను అనుభవాలతో కలుపుతూ పోవడమే అత్యంత ఆధునిక కవిత్వంలోని పాఠక చర్య. ఇప్పటి మైక్రో విశ్వమే కిటికీ, పగిలే ముక్కలే ప్రవాహానుభవాలు. చూస్తూనే వున్నాం ఇటువంటి చిత్రధ్వనుల్ని. అందుకే, each and every tiny spectacle will morph into a spectacular world. ఇటువంటి అనుభవాన్ని తల లోపల, గుండె మీద ఎండాకాలం వానజల్లు లాగా శ్రీసుధ మోదుగు తీసుకు వచ్చింది. పద ధ్వని మాత్రల వివశత్వాన్నిస్తూ, విశ్రాంతిని విభ్రాంతిని పోగు చేస్తూ, కొన్ని ప్యారాగ్రాఫ్ కవితలతో. ఇందులోని పంక్తులలో multiplicity వుంది. గాఢత పెనవేసుకుంటూ పోయే నిరలంకారత కూడా వుంటుంది. సామాన్యత లోని అసమాన చలనాన్ని పసిగట్టడం చాలా అరుదైన విషయమే అనుకుంటాను. ఇస్మాయిల్ గారి నుంచీ వజీర్ రహ్మాన్, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, మందరపు హైమవతీ, రంధి సోమరాజు, మునాస వెంకట్, సూఫీ వచనకారుల అడుగుల ముద్రలు ఉండనే ఉన్నాయి. స్పష్టతలో అస్పష్టతను వికసింపచేయడం గొప్ప రసచర్య అని అనిపిస్తూ ఉంటుంది.

ఈ కవితల్లో వొక సహజతనంలో, నిలకడగా భ్రమింపజేసే వేగముంటుంది. Slowness కనపడుతుంది. నిశ్శబ్ద విస్మృతి వుంటుంది. వొక సన్నటి అలికిడిగా అనిపించే శబ్దమూ, నిర్లయా కళ్ళకు వినిపిస్తుంది. శిల్పి తన ఏకాగ్రతలో నిర్వాణ స్థితికి చేరుకుంటాడు అనే గొంగళి పురుగులోని Metamorphic గుర్తింపు కూడా వుంటుంది. పువ్వు రాలిపోతూ మళ్ళీ మొగ్గనై పుడతాననే మాటను అందించి వెళ్ళిపోతున్నట్టు. ఇటువంటి కవిత్వానికి కంటెంట్ మొత్తం జీవితమే. ప్రతి శకలమూ ఆరంభ అంతమే. చీకట్లో కొన్నిసార్లు ఒక్కో దీపాన్ని వెలిగిస్తూ పోవడమే కాదు వొక్కో దీపాన్ని మలుపుతూ పోవడం కూడా పాఠక గుణం అయ్యి వుండాలి, రాత్రిని అర్థం చేసుకోవడం కోసం అనుకుంటాను. ఈ కవిత్వంలోని క్లుప్తత ఇదే చెబుతుంది. గొంగళి పురుగును తెలంగాణ తెలుగు భాషలో బొంత పురుగు అని కూడా అంటారు. అందుకే బొంత పండు వంటి భయ స్నిగ్ధత కూడా వుంటుంది రూపంలో. అది క్రమంగా వొక సీతాకోక చిలుకయ్యి తోట వైపు ఎగిరిపోవడం వొక గొప్ప transmigration వంటి అనుభవం పాఠకునికి కవిత్వం లోనికి సాహస యాత్ర చెయ్యడానికి ఉన్మత్తంగా.



■ సిద్ధార్థ
✆ 73306 21563



గొంగళిపురుగుల సామ్రాజ్యం

కనీ వినీ ఎరుగని గాలిదుమారం
పెద్ద పెద్ద కొమ్మలు విరిగిపడ్డాయి
చిన్న గాలికే తెగి పడిపోతుందనుకున్న
చిగురుటాకు చెట్టుతోనే ఉండిపోయింది

***

శిల్పి ఏకాగ్రతతో చెక్కుతూ శిల్పమైపోయాడు
అతడు మరణించాడనుకొని
శిలను పూజించడం మొదలుపెట్టారు

***

నీపై దయలేని కోరికలు
గుండెకు వేలాడుతున్న గబ్బిలాలు
తరుముకొస్తున్న భేతాళ ప్రశ్నలు
కారుచిచ్చులా వెంటాడుతున్న జీవితం
నిర్దేశం, నిర్భావం నైరాశ్యం నిర్మాణం

■ శ్రీసుధ మోదుగు

గిడుగు జయంతి వేడుకలు

నవ్యాంధ్ర రచయితల సంఘం సారథ్యంలో గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ – శంకరం వేదిక ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి పంతులు జయంతి వేడుకలు ఆగస్టు 29 ఉ. 10 గంటలకు విజయవాడ ఠాగూర్ స్మారక గ్రంథా లయంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో గిడుగు జాతీయ భాషా సాహిత్య కళా సేవా రంగాల పురస్కారాల ప్రదానం, తెలుగు భాషా పరిరక్షణపై కవి సమ్మేళనం ఉంటాయి. బిక్కి కృష్ణ సభాధ్యక్షత వహించే ఈ వేడుకలకు టి.డి.జనార్థన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. వివరాలకు: 9246415150.

కలిమిశ్రీ

అద్దేపల్లి పురస్కారం

అద్దేపల్లి రామమోహనరావు సాహిత్య పురస్కారాన్ని 2024 సంవత్సరానికి గాను సాహితీవేత్త సన్నిధానం నరసింహశర్మకు ప్రదానం చేస్తున్నాము. సన్నిధానం కవిగా, విమర్శకునిగా వక్తగా ఎంతో ప్రసిద్ధి చెందినవారు. గౌతమీ గ్రంథాలయ ఉద్యోగిగా ఎంతోమంది కవులకూ పరిశోధకులకూ సహకరించడమే కాక వారితో సాహిత్య బంధాన్ని పెనవేసుకున్నవారు. అద్దేపల్లి రామమోహనరావు జన్మదిన సెప్టెంబర్ 8న కాకినాడలో జరిగే సభలో ఈ పురస్కార ప్రదానోత్సవం జరగనుంది.

ఉదయభాస్కరరావు

మధురాంతకం రాజారాం సమగ్ర రచనల సంకలనం

మధురాంతకం రాజారాం సమగ్ర రచనల సంకలనం కోసం రాజారాం గారు రాసిన ముందు మాటలు, పీఠికలు, గ్రంథ సమీక్షల సేకరణ జరుగుతోంది. తమ దగ్గర వున్న ముందు మాటలు, పీఠికలు, గ్రంథ సమీక్షలను ఈ చిరునామాకు పంపవలసినదిగా రచయితలను, పాఠకులను అభ్యర్థిస్తున్నాను. చిరునామా: మధురాంతకం నరేంద్ర, 1554/1 పద్మావతీ నగర్, తిరుపతి (పడమర) – 517502 ఫోన్: 9866243659, ఈమెయిల్: manarendra@gmail.com

మధురాంతకం నరేంద్ర

'పొలమారిన ఊరు'


వెలుగు రామినాయుడు (శాసపు) రచించిన 'పొలమారిన ఊరు' కవితా సంపుటిని ఈ ఆగస్టు 29సాయంత్రం 6 గంటలకు మక్క అప్పలనాయుడు ఆవిష్కరిస్తారు. విజయనగరం జిల్లా రాజాంలో గల శ్రీవేంకట సూర్యదుర్గా కళ్యాణ మండపంలో మజ్జిమదన్ మోహన్ అధ్యక్షతన జరుగనున్న సభలో అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, బాలసుధాకర్ మౌళి, గార రంగనాథం, జి.ఎస్. చలం, రౌతు వాసుదేవరావు తదితరులు పాల్గొంటారు.

వెలుగు మిత్రులు

కథలకు ఆహ్వానం

'నాకు నచ్చిన నా కథ' పేరిట ప్రచురించనున్న ఎనిమిదవ కథా సంకలనానికి శ్రీకారం చుట్టాం, సీనియర్ కథకుల నుండి, ఇప్పుడిప్పుడే కథలు రాస్తున్న వర్ధమాన కథ రచయితల వరకు ఎవరైనా తమ తమ కథలను పంపవచ్చు. కథ డిటిపిలో గాని చేతి వ్రాతతో గాని నాలుగు పేజీలకు మించరాదు, ఇదివరకు ప్రచురణ అయిన కథలు కూడా పంపవచ్చు. కథలను సెప్టెంబర్ 30లోగా ఈమెయిల్: nkbabu.publisher@gmail.com కు మెయిల్ చేయవచ్చు. మరిన్ని వివరాలకు ఫోన్: 89777 32619.

ఎన్.కె. బాబు



సర్కారు దవాఖానాల్లో అవయవమార్పిడులు

అంతంతే.. 8





హోల్‌సేల్ డ్రైవింగ్

చేతిలో సెల్‌ఫోన్.. చెవిలో ఇయర్ ఫోన్..

- అదుపు తప్పుతున్న వాహనాలు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- చలానా విధించినా బేఖాతర్
- 7 నెలల్లో 62,200 కేసులు..

- బంజారాహిల్స్‌లో బీటెక్ చదువుతున్న ఇద్దరు యువకులు చెవిలో ఇయర్‌బడ్స్ పెట్టుకొని బైక్‌పై వెళుతున్నారు. వెనుక వాహనాల హారన్ వినిపించుకోకుండా ముందుకు సాగుతున్నారు. ఇంతలో కారు వేగంగా ఓవర్‌టేక్ చేసి వెళ్లిపోయింది. హఠాత్తుగా కారు పక్క నుంచి వెళ్లడంతో వాహనాన్ని నియంత్రించలేక ఇద్దరూ కిందపడి తీవ్రంగా గాయపడ్డారు.

- ఎస్ఆర్‌నగర్‌లో ఇంటర్ విద్యార్థిని ఫోన్ మాట్లాడుతూ రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో విద్యార్థిని కాలు విరిగింది. ద్విచక్రవాహనదారుడు చాలా దూరం నుంచి హారన్ మోగిస్తున్నప్పటికీ విద్యార్థిని చెవిలో ఇయర్ ఫోన్ ఉండడం వల్ల ప్రమాదం జరిగిందని దర్యాప్తులో తేలింది.

- సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో పాదచారి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఇటీవల సుచిత్ర పరిధిలో చోటు చేసుకుంది.

హైదరాబాద్ సిటీ/బంజారాహిల్స్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): రోడ్డెక్కితే చాలు.. 60 శాతానికి పైగా వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూనే డ్రైవింగ్ చేస్తూ కనిపిస్తున్నారు. బైక్, ఆటో, బస్సు, కారు, లారీ.. వాహనం ఏదైనా.. దాన్ని నడుపుతున్న డ్రైవర్‌లను ఒక్కసారి పరిశీలిస్తే ప్రతి 10 మందిలో ఆరుగురు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. చేతిలో సెల్‌ఫోన్ లేదా చెవిలో ఇయర్ ఫోన్‌తో మాట్లాడుతూ, పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నారు. వాహనాలు అదుపుతప్పి, ప్రమాదాలకు గురై ప్రాణాలు పోతున్న వారిని చూసికూడా ఆ అలవాటును మానడం లేదు. ఎదుటివారి ప్రాణాలకూ ముప్పు తెచ్చిన వారవుతున్నారు.

అవగాహన పెంచుతున్నాం

సెల్ మాట్లాడుతూ ప్రయాణిస్తున్న వారిపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నాం. ట్రాఫిక్‌లో వెళ్లే సమయంలో గుర్తించి చలానా విధిస్తున్నాం. మార్పు తెచ్చేందుకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. వాహనదారులు, పాదచారులు రోడ్డు దాటేటప్పుడు బాధ్యతగా వ్యవహరించాలి.

- కట్టా హరిప్రసాద్, ట్రాఫిక్ ఏసీపీ, పంజాగుట్ట

మ్యూజిక్ హోరెత్తిస్తూ..

నగరంలో కొంతమంది ఆటోడ్రైవర్లు సౌండ్ బాక్స్‌లతో మ్యూజిక్ హోరెత్తిస్తూ రోడ్డుపై రయ్‌మంటూ దూసుకెళ్తున్నారు. కొందరు చెవిలో ఇయర్‌బడ్స్ పెట్టుకొని వెళ్తుండటంతో వెనుకాల వచ్చే వాహనదారులు కొడుతున్న హారన్ వినపడకపోవడంతో

మిగతా8వ పేజీలో..

గణేష్ మండపాల ఏర్పాటుకు

నిబంధనలు ఇవే

- సెప్టెంబర్ 6 లోపు అనుమతులు తీసుకోవాలి
- మండపం స్థలం, నిమజ్జన తేదీ, ప్రాంతం తెలపాలి
- ఊరేగింపు మార్గాన్ని స్పష్టం చేయాలి
- రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు లౌడ్ స్పీకర్లు వాడొద్దు
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు : సిటీ సీపీ శ్రీనివాస్‌రెడ్డి



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేయాలనుకునే మండపాల నిర్వాహకులు నిబంధనలను కచ్చితంగా పాటించాలని హైదరాబాద్ సిటీపోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6లోపు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిర్వాహకులు పాటించాల్సిన నియమ నిబంధనలు, విగ్రహాల ఏర్పాటులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీపీ ఓ ప్రకటన విడుదల చేశారు.

అందులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి..

- తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- అనుమతిపత్రంలో విగ్రహం ఏర్పాటు చేస్తున్న స్థలం, నిమజ్జనం జరిపే తేదీ, శోభాయాత్ర నిర్వహించే రూట్ మ్యాప్‌ను స్పష్టంగా తెలియజేయాలి.
- విగ్రహాన్ని ఇతరులకు చెందిన ప్రదేశం/స్థలంలో పెడుతున్నట్లయితే యజమాని అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. వివాదాస్పదమైన స్థలంలో విగ్రహాలు పెట్టకూడదు.
- విగ్రహాల నిమజ్జనం, శోభాయాత్ర సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించరాదు.
- మండపాల వద్ద అనధికారిక విద్యుత్తు వినియోగించకూడదు.
- విద్యుత్తు అనుమతులకోసం ముందే పోలీస్ క్లియరెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.
- మండపాల వద్ద దీపాలు, లైటింగ్ విషయంలో నిర్లక్ష్యం వహించొద్దు. అందుకు పూర్తి బాధ్యత నిర్వాహకులే వహించాలి.
- మండపాల వద్ద 2 బాక్స్‌ల టైప్ లౌడ్‌స్పీకర్లు మాత్రమే వినియోగించాలి.
- భారత ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్‌స్పీకర్లు వినియోగించకూడదు.
- గణేష్ మండపం స్థాయిని బట్టి, నిర్వాహకులు తగిన సంఖ్యలో వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలి. వారికి బ్యాడ్జీలు, ఐడెంటిటీ కార్డులు ఇవ్వాలి.
- ప్రతి డివిజన్ ఏసీపీ, పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌లు వారి పరిధిలో సమావేశాలు నిర్వహిస్తారు. ఆకస్మిక తనిఖీలు చేసినప్పుడు అనుమతి పత్రాన్ని తప్పనిసరిగా చూపించాలి.
- అపార్టుమెంట్లు, సెల్లార్లలో విగ్రహాలు ఏర్పాటు చేసుకునేవారు బహిరంగ ఊరేగింపుకోసం పోలీస్ అనుమతి తీసుకోవాలి.
- నిర్వాహకులకు ఏదైనా సందేహాలు ఉంటే స్థానిక పోలీసులను సంప్రదించి తెలుసుకోవాలి. లేదా మరిన్ని వివరాల కోసం 8712665785 లో సంప్రదించాలి.

మూడు నెలలుగా పనిచేయని ట్రై కమిషనరేట్ల వెబ్‌సైట్లు

- సెక్యూరిటీ లోపాలను సరిచేస్తున్న ఐటీ సెల్

8

బస్సు, లారీ మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి

6



ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు

పేస్కేల్ ఇవ్వాలి

- ఇందిరాపార్కు వద్ద శాంతియుత ధర్నా

8



ఉత్సాహంగా..
ఉల్లాసంగా..

- నగరంలో మారథాన్ సందడి
- ఫుల్ మారథాన్ 42.2 కిలోమీటర్లు



రన్నర్లతో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీలు వీహెచ్, వేణుగోపాల చారి, బాక్సర్ నిఖత్ జరీన్



ఖైరతాబాద్/జీడిమెట్ల/హైదరాబాద్‌సిటీ, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచే ఉద్దేశంతో ఏటా నిర్వహించే హైదరాబాద్ మారథాన్ ఆదివారం జోష్‌గా సాగింది. హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ, ఎన్ఎండీసీ సహకారంతో నిర్వహించిన మూడు విభాగాల రన్‌లను పీపుల్స్‌ప్లాజా వద్ద నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. 50 మంది ప్రొఫెషనల్ రన్నర్లు పాల్గొన్న ఎలైట్ రన్‌ను ఉదయం 4.30గంటలకు, 42.2 కిలోమీటర్ల ఫుల్ మారథాన్‌ను 4.35కు, హాఫ్ మారథాన్‌లను 5.30కు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల సరైన అవగాహన లేక 60 నుంచి 70 సంవత్సరాల వయస్సు వాళ్లకు వచ్చే శారీరక సమస్యలు నేడు యువతకే వస్తుండటం

మిగతా8వ పేజీలో..

25 టీములు.. 25 చోట్ల దాడులు

- క్లబ్‌లు, పబ్‌లపై స్పెషల్ ఫోకస్
- డ్రగ్ డిటెక్షన్ పరీక్షలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పబ్‌లు, క్లబ్బులపై ఎక్సైజ్ పోలీసులు స్పెషల్‌ఫోకస్ పెట్టారు. ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి ఆదేశాలతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ టీమ్‌లు రంగంలోకి దిగి మాదకద్రవ్యాలను అరికట్టడానికి అర్ధరాత్రి ఆకస్మిక దాడులు చేస్తున్నాయి. ఊహించని విధంగా వారాంతంలో దాడులు చేస్తూ డ్రగ్స్ వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నాయి. శనివారం రాత్రి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 25 టీమ్‌లుగా ఏర్పడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో ఉన్న 25 ప్రముఖ క్లబ్‌లు, పబ్‌లలో తనిఖీలు నిర్వహించారు. అనుమానం ఉన్న వారికి డ్రగ్స్ డిటెక్షన్ కిట్స్‌తో పరీక్షలు నిర్వహించారు. ఎవరికీ పాజిటివ్ రాకపోవడం గమనార్హం. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ఖురేషి, హైదరాబాద్ రంగారెడ్డి అసిస్టెంట్ కమిషనర్లు అనిల్ కుమార్ రెడ్డి, ఆర్ కిషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ తిరుపతి యాదవ్ పాల్గొన్నారు. పబ్‌లు, క్లబ్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లలో డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని కమలాసన్‌రెడ్డి హెచ్చరించారు.

పబ్‌లోకి మైనర్లంటూ వైరల్

రాయదుర్గం, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని వైట్‌హార్ట్ పబ్‌లో మైనర్లను అనుమతి ఇస్తున్నారని సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. దీనిపై ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్‌గౌడ్ స్పందిస్తూ పబ్‌లో నెల రోజుల సీసీకెమెరాల ఫుటేజీ పరిశీలిస్తామని, మైనర్లను అనుమతిస్తున్నట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



పబ్‌లో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు



ధర్నా చేస్తున్న పీవైఎల్ నాయకులు, ప్రయాణికులు

పెయిడ్ పార్కింగ్‌ను రద్దు చేయండి

- నాగోల్ మెట్రోస్టేషన్ వద్ద ధర్నా

ఉప్పల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నాగోల్, మియాపూర్ మెట్రోస్టేషన్ల వద్ద పెయిడ్ పార్కింగ్ విధానాన్ని శాశ్వతంగా రద్దు చేయాలని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) ధర్నా చేసింది. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్ మాట్లాడుతూ మెట్రోరైలు ప్రయాణికులకు పార్కింగ్ చార్జీలు పెనుభారంగా మారాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సదుపాయాలు కల్పించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడడాన్ని తప్పు పట్టారు. ప్రయాణికుల ఆగ్రహాన్ని గమనించిన యాజమాన్యం మెట్రో పెయిడ్ పార్కింగ్ నిర్ణయాన్ని తాత్కాలింగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించిందని, దాన్ని శాశ్వతం చేయాలని డిమాండ్ చేశారు. నష్టాల పేరుతో పార్కింగ్ ఫీజుల వసూలు బదులుగా ఇతర ఆదాయ మార్గాలపై ఎల్అండ్‌టీ దృష్టి సారించాలని సూచించారు. భవిష్యత్తులో పార్కింగ్ ఫీజు వసూలు చూస్తే పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ఎం. హన్మేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం. రవికుమార్, బిఎస్ కృష్ణ, కిరణ్, బంగారి శ్రీనివాస్, మణికంఠ, చంద్రశేఖర్, నాగరాజు, ప్రసాద్, నవీన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రపురి రో హౌజెస్‌కు నోటీసులు

- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలన్న కమిషనర్

నార్సింగ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): చిత్రపురి కాలనీలో 225 రో హౌజెస్ (కామన్ సైడ్ వాల్స్‌తో ఒకే వరుసలో నిర్మించిన విల్లాలు) నిర్మాణంపై వివరణ ఇవ్వాలని చిత్రపురి కాలనీ హౌసింగ్ సొసైటీకి మణికొండ మున్సిపల్ కమిషనర్ నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం జీ+1 అనుమతులు పొంది, జీ+2 నిర్మాణాలు చేపట్టారని, నిబంధనలను ఎందుకు అతిక్రమించారో 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. వివరణ ఇవ్వని పక్షంలో అన్నింటినీ కూల్చివేస్తామన్నారు. నోటీసుల జారీ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారింది. రో హౌజెస్ కేటాయింపుల్లో అనేక అక్రమాలు జరిగాయని, కొంతకాలంగా సినీ కార్మికులు ఫిర్యాదు చేస్తున్నారు. వీటిని తొలగించి అపార్ట్‌మెంట్ కడితే 3 వేల మంది కార్మికులకు మేలు జరుగుతుందనే వాదనను తెరపైకి తెస్తున్నారు. మణికొండ, చిత్రపురి కాలనీలో అక్రమంగా నిర్మించిన నాలుగు విల్లాలను ఇటీవల కూల్చివేసిన విషయం తెలిసిందే.

పర్మిషన్ లేదంటూ తప్పుడు ఆరోపణలు

చిత్రపురి కాలనీలో రో హౌజెస్ సభ్యులను మోసం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఫిల్మ్ డైరెక్టర్స్ సెక్రటరీ మద్దినేని రమేష్‌బాబు డిమాండ్ చేశారు. అర్హులకు న్యాయం చేయాలని హెచ్ఎండీఏ, హైడ్రా కమిషనర్లకు చిత్రపురి హిల్స్ డైరెక్టర్స్ సినిమా ఆధ్వర్యంలో రమేష్‌బాబు వినతి పత్రం అందచేశారు. జీవో 658 ప్రకారం అధికారిక ఫైవ్‌మెన్ కమిటీ కేటాయించిన, నిర్మాణ అర్హతలు పొందిన 225 రో హౌస్ అఫీషియల్ యూనిట్ల జోలికి వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. ఆ నిర్మాణాలకు పర్మిషన్ లేదంటూ కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. అనుమతులున్న ఇళ్లను కూడా కూల్చివేస్తారేమో అని సినీ కార్మికులు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రో హౌజెస్ సభ్యులను మోసం చేస్తున్న ఓ.కళ్యాణ్, సి. కల్యాణ్‌లపై సొసైటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.



చిత్రపురిలోని రో హౌజెస్

మున్సిపాలిటీగా డబిల్‌పూర్?

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- ఎనిమిది గ్రామాలు కలిపి బల్దియా ఏర్పాటుకు ప్రణాళికలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరశివారు ప్రాంతంలోని గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా మేడ్చల్ మండలంలోని డబీల్‌పూర్ పంచాయతీని మున్సిపాలిటీగా మార్చే దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రస్తుతం మండలంలోని డబిల్‌పూర్, మైసిరెడ్డిపల్లి, లింగాపూర్, బర్మాజీగూడ, నూతన్‌కల్, శ్రీరంగవరం, ఎల్లంపేట బండమాదారం గ్రామాలను కలుపుతూ కొత్తగా డబిల్‌పూర్ మున్సిపాలిటీ ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఇటీవల అధికారులు ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో కొత్త మున్సిపాలిటీ ప్రతిపాదన కోసం స్థానికులకు సంకేతాలిచ్చారు. డబిల్‌పూర్‌ను మున్సిపాలిటీగా మార్చడంతో విలీనం చేస్తున్న గ్రామాలను కలుపుకుని 25నుంచి 30 వేల జనాభా ఉండనుంది. ఓటర్ల



పరంగా 18 నుంచి 20వేల మంది ఉండనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మేడ్చల్ మండలం పరిధిలో మొత్తం 17గ్రామ పంచాయతీలున్నాయి. అందులో 8గ్రామాలను కలుపుకుని డబిల్‌పూర్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. మరో రెండు పంచాయతీలు పూడూరు, రాయిలాపూర్ మేడ్చల్ మున్సిపాలిటీలో, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మునీరాబాద్, గౌడవెల్లి గ్రామాలను విలీనం చేశారు. కాగా మండలంలో మిగిలిపోయిన రావల్‌కోల్, రాజబొల్లారం, సోమారం, రాజబొల్లారం తండా, యాడారం గ్రామాలను కలుపుతూ రావల్‌కోల్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తారా లేక పంచాయతీలుగా కొనసాగిస్తార అన్న విషయం పట్ల స్పష్టత కరువైంది. దీంతో మిగిలిన గ్రామాల ప్రజలు తర్జనభర్జన పడుతున్నారు.

కొత్త మున్సిపాలిటీలు ఏర్పడినా చివరికి గ్రేటర్‌లో విలీనం?

ప్రస్తుతం కొత్తగా ఏర్పాటు కానున్న డబిల్‌పూర్ మున్సిపాలిటీతో పాటు కొనసాగుతున్న మేడ్చల్ మున్సిపాలిటీలను భవిష్యత్తులో గ్రేటర్ హైదరాబాద్‌లో విలీనం చేస్తారన్న వాదనలు బలంగా వినబడుతున్నాయి. ఈ మున్సిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నికలు మాత్రం జరగబోవని, గ్రేటర్ ఎన్నికల వరకు రెండు మున్సిపాలిటీలను విలీనం చేస్తారని అప్పటి వరకు అధికారుల పాలన కొనసాగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ విషయంలో అధికారులకు , అధికార పార్టీకి చెందిన బడానేతలకు స్పష్టత ఉన్నప్పటికీ కింది స్థాయి నేతలకు అవగాహన లేక అయోమయంలో ఉన్నారు.

తెలంగాణ ఏర్పాటులో బీసీల పాత్ర మరువలేనిది

- ఓబీసీ అడ్వొకేట్స్ కన్వెన్షన్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటులో బీసీల పాత్ర మరువలేనిదన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఓబీసీ అడ్వొకేట్స్ కన్వెన్షన్ కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఏర్పాటులో బీసీల పాత్ర మరువలేనిదన్నారు. ఈ విషయంలో అందరినీ అభినందిస్తున్నానని అన్నారు. బీసీలు తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ చెప్పిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి నాయకత్వంలో రాష్ట్రంలో కులగణన పూర్తిచేస్తామని చెప్పారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా బలహీనవర్గాల న్యాయవాదులు ఏకం కావాలని జీవితం సార్థకం కావాలంటే మన హక్కుల కోసం పోరాడాలి అని మంత్రి పిలుపునిచ్చారు.

సిక్కుల పుణ్యక్షేత్రాల దర్శనానికి ప్రత్యేక రైలు

నాందేడ్‌లో జెండా ఊపి ప్రారంభించిన కేంద్రమంత్రి రవనీత్

హైదరాబాద్,ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): సిక్కు మతస్థుల పవిత్ర ఐదు పుణ్యక్షేత్రాలను దర్శించేందుకు దక్షిణమధ్య రైల్వే ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'అయిదుతఖ్త్' రైలును కేంద్రరైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ సింగ్ ప్రారంభించారు. హుజూర్ సాహిబ్ నాందేడ్ రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన జెండా ఊపి ప్రారంభించారు. భారతీయ సంస్కృతీ- సంప్రదాయ ఆధ్యాత్మిక భావాన్ని, జాతీయతను పెంపొందించేందుకు భారతీయరైల్వే ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తుందని రవనీత్ సింగ్ చెప్పారు. హుజూర్ సాహిబ్‌తో నాందేడ్ నుంచి బయలు దేరిన ప్రత్యేకరైలు పాట్నాసాహిబ్, ఆనంద్‌పూర్‌సాహిబ్, ఫతేఘర్ సాహెబ్, దామ్‌దామా సాహిబ్, అమృత్‌సర్ సాహిబ్‌లను సందర్శించేందుకు అనువుగా నడుపుతున్నట్టు వివరించారు. సెప్టెంబర్ 6న తిరిగి నాందేడ్‌కు తిరిగి చేరుకుంటుందని తెలిపారు. పన్నెండు రోజులపాటు కొనసాగే యాత్రలో 1300 మంది భక్తులు పాల్గొంటున్నట్టు వివరించారు. రైలులోని మొదటి కోచ్ సెలూన్‌లో గురు గ్రంథ్ సాహిబ్‌జీ ఉంటారని, ప్యాంట్రీ కారులో భక్తులకు ప్రయాణం కోసం లంగర్ సౌకర్యం అందుబాటులో ఉందని తెలిపారు. ప్రతి కోచ్‌కి ఏర్పాటు చేసిన స్పీకర్ ద్వారా భక్తి కీర్తనలు విన్పించడానికి ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

ఇంటర్ సెప్టర్' వాహనాలను తొలగించలేదు

- డీజీపీ కార్యాలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో..

గస్తీ తిరుగుతున్న ఇంటర్ సెప్టర్ వాహనాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): గత కొంత కాలంగా ఇంటర్ సెప్టర్ వాహనాలు గస్తీ నిర్వహించకుండా, ఒకే ప్రదేశంలో ఉండి స్తబ్దతతో ఉంటున్నాయి. దాంతో వాటి పనితీరును విశ్లేషించడానికి గస్తీ నిర్వహణకు వినియోగిస్తున్నట్లు సెంట్రల్‌జోన్ డీసీపీ స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఇంటర్ సెప్టర్ వాహనాలు డీజీపీ ఆఫీస్ చుట్టుపక్కల ఉన్న కలెక్టర్ ఆఫీసు, నాంపల్లి రైల్వే స్టేషన్, పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆఫీస్, సెక్రటేరియట్, అసెంబ్లీ తదితర ప్రాంతాలలో గస్తీ నిర్వహించేటట్లుగా ప్రణాళికలు రూపొందించామన్నారు.

అంతేకాకుండా సిటీలో ఇంటర్సెప్టర్ వాహనాల పనితీరును మరింత సమర్థవంతంగా ఉపయోగించుకోవడంలో భాగంగా సిటీ పోలీస్ కమిషనర్ ఆఫీస్ వద్ద ఉన్న ఇంటర్ సెప్టర్ వాహనాలను కూడా ఆఫీస్ చుట్టుపక్కల ఉన్న ఇతర ముఖ్యమైనటువంటి ప్రాంతాల్లో గస్తీ తిరిగేటట్లుగా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. డీజీపీ ఆఫీస్ నుంచి ఇంటర్ సెప్టర్ వాహనాలు పూర్తిగా తొలగించామనడం అవాస్తవమని డీసీపీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

డ్రగ్స్ విక్రయిస్తున్న ఏడుగురి అరెస్ట్

11 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం

చార్మినార్ ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్న ఏడుగురిని రైన్ బజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి 11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, 8 సెల్‌ఫోన్లు ఫార్చునర్ కారు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. దబీల్‌పురా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఎండీఎంఏ డ్రగ్స్ విక్రయిస్తున్నారని సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. డబీల్‌పురాకు చెందిన షబ్బీర్ అలీ, మహ్మద్ అతిక్ సిద్ధికి స్నేహితులు. వీరు తరచూ డ్రగ్స్ వినియోగిస్తుంటారు. సైదాబాద్‌కి చెందిన మతిన్ జాబ్రీ .. ముంబయికి చెందిన ఇర్ఫాన్ ద్వారా ఎండీఎంఏ తీసుకొచ్చి అవసరమైన వారికి విక్రయిస్తుంటాడు. శనివారం ముంబయి నుంచి మొహమ్మద్ అదనాన్, ఎండీఎంఏ తీసుకుని వచ్చి డబీల్‌పురా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద షబ్బీర్ అలీ, అతిక్ సిడిఖితో కలసి హాశిమ్ పర్వేజ్, అబ్దుల్ రెహమాన్, ఖలీద్, బురాన్ మొహమ్మద్ సిడిఖిలకు విక్రయిస్తుండగా పోలీసులు దాడిచేసి ఎడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎన్‌టీఆర్‌నగర్ మార్కెట్‌లో వ్యాపారి ఆత్మహత్య

కొత్తపేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ పీఎస్ పరిధి ఎన్‌టీఆర్‌నగర్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలో ఉంటున్న బీ.శ్రీరాములు గౌడ్(57) ఎన్‌టీఆర్‌నగర్ మార్కెట్‌లో కూరగాయల వ్యాపారి. ఆర్థిక సమస్యలతో సొంతింటిని అమ్మివేసి అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. అయినా సమస్యలు అధికం కావడంతో మద్యానికి బానిసయ్యాడు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో డబ్బుల విషయంపై భార్యతో గొడవపడ్డాడు. అప్పటి నుంచి బయటకు వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఆదివారం తెల్లవారుజామున ఎన్‌టీఆర్‌నగర్ మార్కెట్‌లో షెడ్‌రాడ్‌కు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం మార్కెట్‌కు వచ్చిన ఓ వ్యాపారి డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా, ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు సాయికుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

బస్సు, లారీ మధ్య ఇరుక్కుని డ్రైవర్ మృతి

హయత్‌నగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బస్సు, లారీ మధ్య చిక్కుకుని ఓ డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దఅంబర్‌పేటలో ఉంటున్న శెట్టి రాజేశ్ (38) లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో లారీని పార్కు చేయడానికి లక్ష్మారెడ్డి పాలెంలోని గజ్జి స్వామి పార్కింగ్‌యార్డ్‌కు వెళ్లాడు. అక్కడ గేటు మూసి ఉండడంతో, హ్యాండ్‌బ్రేక్ వేయకుండా లారీని ఆపి కిందకు దిగాడు. గేటు తీస్తుండగా లారీ ముందుకు కదిలింది. బ్రేకు వేయడానికి లారీ ఎక్కుతుండగా ఆ లారీ పక్కనే పార్కు చేసిఉన్న బస్సు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో రెండింటి మధ్య ఇరుక్కుని అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని హయత్‌నగర్ పోలీసులు తెలిపారు.



లారీ, బస్సు మధ్యలో ఇరుక్కుని మృతిచెందిన లారీ డ్రైవర్

శాంతి భద్రతలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

● మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి


రాయల్ కాలనీ వాసులతో మాట్లాడుతున్న డీసీపీ సునీతా రెడ్డి

పహాడిషరీఫ్ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి అన్నారు, ఆదివారం ఉదయం బాలాపూర్ పోలీసులు రాయల్ కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించి ముగ్గురు రౌడీషీటర్లను, ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకోవడంతో పాటు సరైన పత్రాలు లేని 63 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, ఎవరైనా నేరాలు చేస్తే పోలీసుకు సమాచారం ఇచ్చి సహకరించాలని స్థానికులను కోరారు. వాహనదారులు తమ వాహనాలకు సంబంధించిన అన్ని ప్రతాలను వెంట ఉంచుకుంటే నిర్భయంగా ఎక్కడికైనా వెళ్లొచ్చని అన్నారు. బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాయల్ కాలనీ. డైమండ్ హోటల్ ప్రాంతంలో సుమారు 290 మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ నిర్బంధ సోదాల్లో అడిషనల్ డీసీపీ సత్యనారాయణ. మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి. మహేశ్వరం జోన్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం: ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి

పహాడిషరీఫ్ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి మహాదానం వంటిందని, అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి రక్తదానం చేసి ఆదుకోవాలని మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంత్ రెడ్డి అన్నారు. షాహీన్‌నగర్‌లోని టీఎంజీ సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో మజ్లిస్ ఉలుమా హఫీజ్ దానిశ్వరనే మిల్లత్ సంస్థ తరఫున మెగా బ్లడ్ డొనేషన్ క్యాంపు నిర్వహించారు. సుమారు 210 మంది రక్తదానం చేయగా వారికి ఏసీపీ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తం దానం చేసిన వారు చాలా గొప్పవారని, మరికొందరు ముందుకు వచ్చి ఇలాంటి శిబిరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నర్సింహా రెడ్డి, మాజీ సెట్విన్ ఛైర్మన్ ఇనాయత్ అలీ, మౌలానా అబ్దుల్ హది, డాక్టర్ ముస్తఫా, అబ్దుల్ బారి, షాకేర్, హసన్ షా, తదితరులు పాల్గొన్నారు,



అర్బయిన్ పండుగ సందర్భంగా షియా ముస్లిం మతపెద్దలతో ప్రత్యేక ప్రార్థనల కార్యక్రమాలు దూరదర్శన్‌లో ప్రసారం చేసేందుకు అనుమతించినందుకు కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న షియా మత పెద్దలు. - (చార్మినార్ ఆంధ్రజ్యోతి)

అషూర్‌ఖానాను అభివృద్ధి చేయండి


వక్ఫ్ బోర్డ్ చైర్మన్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహ్మద్ షరీఫ్, మహ్మద్ అర్బాజ్

రాజేంద్రనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేట మండలం చిన్న జాత్రం గ్రామంలో గల అషూర్‌ఖానాను అభివృద్ధి చేయాలని కోరుతూ మాజీ కౌన్సిలర్ మహ్మద్ షరీఫ్ శనివారం తెలంగాణ రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీని కలిసి వినతి పత్రం అందజేశారు. అషూర్‌ఖానా అభివృద్ధి కోసం సిఫార్సు చేస్తూ కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ రాసిన లేఖను కూడా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ షరీఫ్, ఆయన కుమారుడు రాఘవేంద్రకాలనీ మజ్లిస్ అధ్యక్షుడు మహ్మద్ అర్బాజ్‌లు మాట్లాడు తూ, చిన్న జాత్రం గ్రామంలో ఉన్న అషూర్‌ఖానా శిథిలావస్థకు చేరుకుందన్నారు. తాము వక్ఫ్‌బోర్డ్ చైర్మన్‌ను కలిసి చిన్న జాత్రం గ్రామంలోని అషూర్‌ఖానాను సందర్శించి అభివృద్ధి చేయాలని కోరామన్నారు.

'కోల్‌కతా' ఘటనను ప్రతి ఒక్కరూ ఖండించాలి


కొవ్వొత్తుల ప్రదర్శనలో పాల్గొన్న యువకులు

రాజేంద్రనగర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం చేయడాన్ని సమాజంలోని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని నవ యువ యువజన సంఘం అధ్యక్షుడు ఎర్వ కుమారస్వామి, ఉపాధ్యక్షుడు రమేశ్‌రెడ్డి అన్నారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా ఆదివారం బుద్వేల్ రైల్వే స్టేషన్ బస్తీలో కొవ్వొత్తులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. చాలా ప్రాంతాలలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యువకులు కొంపల్లి జగదీధ్, రామారావు, ధనుంజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం విద్యార్థులకు బహుమతుల ప్రదానం


విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు చిత్ర లేఖనం తదితర రంగాలలో విద్యార్థులు రాణించడం సంతోషకరమని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. హైదర్‌గూడ రాధాకృష్ణానగర్ కాలనీలోని సంస్కృతి రూరల్ ఆర్ట్ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశా రు. అప్పిరెడ్డి బొమ్మారెడ్డి, పద్మారెడ్డిల ఆధ్వర్యంలో సంస్కృతి రూరల్ ఆర్ట్ సెంటర్‌ను నిర్వహిస్తు న్నారు. ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు గీసిన చిత్రాలకు బహుమతులు అందజేశారు. ప్రోగ్రెస్ ఆఫ్ ఆర్ట్ బర్డ్స్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కళారత్న ఆర్. రమేశ్‌బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని సరస్వతీ మాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.మల్లారెడ్డి, షాబాద్ విజయ్‌కుమార్, ఎం.రామేశ్వర్‌రావు, జి.సురేందర్‌రెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, సులిగె వెంకటేశ్, నల్లింగ్ రమేశ్, కె.కిరణ్ చారి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా నాగులబండ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నగర్‌లోని అంబేడ్కర్ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చీఫ్ ప్యాట్రన్‌గా కొంపెల్ల మాధవీలత, ముఖ్య సలహాదారుడిగా బోయిని విజయ్‌కుమార్, అధ్యక్షుడిగా జి.శివకుమార్, ప్రధాన కార్యదర్శిగా జి.ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా వి.చంద్రశేఖర్, వి.సతీష్‌కుమార్, కోశాధికారిగా బొర్ర రనదీర్, యంజాల నరేశ్‌కుమార్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పాతబస్తీలో అధ్వానంగా రోడ్లు

- గుంతలుపడ్డ ప్రధాన రహదారులు
- ప్రమాదాలకు గురవుతున్న జనం
- మరమ్మతులపై దృష్టి పెట్టని అధికారులు
- వినాయక ఉత్సవాల నాటికైనా రోడ్లకు మరమ్మతులు జరిగేనా.!

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో రహదారులు గుంతలమయంగా మారడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వీధిదీపాలు లేకపోవడంతో అంధకారంలో రోడ్లపై ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాతబస్తీలోని ఉప్పుగూడ, లలితాబాగ్, గౌలిపురా, కందికల్‌గేట్, ఆలయాబాద్, రాజన్నబావి, శంషీర్‌గంజ్, జంగమ్మెట్, ఫలక్‌నుమా, చాంద్రాయణగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. రోడ్లపై ఏర్పడ్డ గుంతల్లో వర్షపు నీరు నిలిచి దోమలు కూడా వృద్ధి చెందుతున్నాయి. ఈ విషయంపై అధికారులకు ఎన్ని సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. నగరంలోని రోడ్ల అభివృద్ధికి జీహెచ్‌ఎంసీ కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నా పాతబస్తీలో మాత్రం రోడ్ల పరిస్థితి మారడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గుంతలు పడ్డ ఛత్రినాక ప్రధాన రహదారి


కంకర తేలిన ఛత్రినాక శివగంగానగర్ రోడ్డు

సమీపిస్తున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు..

పాతబస్తీలో వినాయక నవరాత్రి ఉత్సవాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. దక్షిణ మండలంలో వందల సంఖ్యలో విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేస్తారు. అనంతరం పెద్దఎత్తున ఊరేగింపు నిర్వహిస్తారు. ప్రస్తుతం ప్రధాన రోడ్లు గోతులమయంగా మారాయని, ఈ రోడ్లపై వినాయక విగ్రహాల ఊరేగింపు ఎలా నిర్వహించగలమని మండపాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోనాల పండుగ సమయంలో అధికారులు రోడ్లకు ప్యాచ్‌వర్క్‌లు చేసి చేతులు దులుపుకున్నారని, అప్పుడే నాణ్యతతో పనులు చేపట్టి ఉంటే రోడ్ల పరిస్థితి ఇలా ఉండేది కాదని కొందరు అభిప్రాయపడుతున్నారు.

రాజన్నబావిలో విగ్రహాల నిమజ్జనం కోసం తిప్పలు

శంషీర్‌గంజ్ నుంచి రాజన్నబావి వరకు రోడ్డు గుంతలమయంగా మారి రెండున్నరేళ్లు అయ్యింది. ఈ రోడ్డుపై నుంచి రాజన్నబావికి నిమజ్జనం కోసం సుమారు 300 విగ్రహాలు వస్తుంటాయి. ఈ రోడ్డును బాగు చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, స్థానిక నాయకులు గ్రేటర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. అయినా ఎలాంటి ప్రయోజనం లేకుండాపోయింది. నిధులు మంజూరై ఏడాదైనా అధికారులు సీసీ రోడ్డు వేయడానికి వెనుకడుగు వేస్తున్నారు.

వినాయక ఉత్సవాల నాటికి రోడ్లు వేయాలి

వినాయక నవరాత్రి ఉత్సవాలు సెప్టెంబర్ 7వ తేదీ నుంచి 17 వరకు జరగనున్నాయి. అధికారులు ఉత్సవాల ప్రారంభంలోపు సీసీ రోడ్లు వేయించాలి. శంషీర్‌గంజ్ నుంచి రాజన్నబావి వరకు మంజూరైన రోడ్డును వేయాలి. మంజూరైన రోడ్డు వేయడంలోనూ రాజకీయం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కనిపిస్తోంది.

- ఉదయ్‌కిరణ్‌రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి, బహదూర్‌పురా నియోజకవర్గం కన్వీనర్


రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మకు పూలబొకే అందజేస్తున్న వ్యాపారులు బబూత్ సింగ్, అవినాష్ దేవడా, రాజ్ పురోహిత్

రాజస్థాన్ సీఎంను కలిసిన బేగంబజార్ వ్యాపారులు

గోషామహల్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ తన వంతు సహాయ సహకారాలు అందించాలని బేగంబజార్‌కు చెందిన పెట్టుబడిదారులు కోరారు. పెట్టుబడిదారులు బబూత్ సింగ్, అవినాష్ దేవడా, రాజ్ పురోహిత్‌ల బృందం ఆదివారం నగరం నుంచి రాజస్థాన్ వెళ్లి ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మను కలిశారు. రాజస్థాన్‌లో అత్యధిక పెట్టుబడులను ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఈ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకెళ్లాలని ముఖ్యమంత్రిని కోరామని బబూత్ సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ముఖ్యమంత్రిని వారు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజేశ్ మాల్‌పానీ, సుభాష్ అగర్వాల్, ముఖేశ్ జైన్ చౌహన్, సుమీర్‌జీ సోనీ, ప్రభుజీ పాల్గొన్నారు


ఆచార్య శలాక రఘునాథ్ శర్మకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఆచార్య సాగి కమలాకర శర్మ, దుగ్గిరాల భువనేశ్వరి

శలాక రఘునాథ్ శర్మకు దుగ్గిరాల మూర్తి స్మారక పురస్కారం ప్రదానం

మంగళ్‌హట్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో ఆదివారం రాత్రి శ్రీ దుగ్గిరాల మూర్తి స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం సభాధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగింది. మహామహోపాధ్యాయ ఆచార్య శలాక రఘునాథ శర్మకు దుగ్గిరాల మూర్తి స్మారక పురస్కారాన్ని ఓయు తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య సాగి కమలాకర శర్మ, దుగ్గిరాల భువనేశ్వరి చేతులు మీదుగా ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యువ భారతి అధ్యక్షుడు డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, సాధన నర్సింహాచార్య, ప్రధాన కార్యదర్శి ఎం.దత్తాత్రేయ శర్మ, ఉపాధ్యక్షుడు జి.ఎం.రామశర్మ, ఆచార్య ఫణీంద్ర, సూర్యనారాయణ మూర్తి, వాసుదేవరావు పాల్గొన్నారు.

ఘనంగా మైథిలి ఆర్ట్స్ వార్షికోత్సవం


నిర్వాహకులను సత్కరిస్తున్న అతిథులు

రవీంద్రభారతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): మైథిలి ఆర్ట్స్ అకాడమీ 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారత్ వరల్డ్ రికార్డ్స్, యూనివర్సల్ బుక్ రికార్డ్స్, నేషనల్ కోఆర్డినేటర్ లయన్ కేవీ రమణారావు మైథిలి ఆర్ట్స్ అకాడమీ పేరును యూనివర్సల్ బుక్ రికార్డ్స్‌లో నమోదు చేసిన ధృవపత్రాన్ని నాట్య గురువు మైథిలి దినకరన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ పాలక సభ్యుడు పోకల అశోక్‌కుమార్, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ, పసుమర్తి శేషబాబు, వేదాంతం వెంకటనాగ చలపతిరావు, ఎస్ఆర్ రెడ్డి, కావేరి తదితరులు పాల్గొన్నారు.

అన్ని ప్రభుత్వ శాఖల్లో 'ఎస్సీ వర్గీకరణ' అమలు చేయాలి

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు మద్దతుగా ఆదివారం షెడ్యూల్డ్ కాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి రాజపాగ అర్జున్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని ప్రభుత్వ శాఖల్లో వర్గీకరణ బిల్లు అమలయ్యేలా నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రభు త్వ శాఖలతో పాటు మెడిసిన్, ఇంజనీరింగ్ లాంటి సీట్ల కేటాయింపులో కూడా వర్గీకరణకు అనుగుణంగానే ప్రతిపాదనలు చేయాలన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకొచ్చి ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు జె.మురళీధర్, ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహ స్వామి మాదిగ, బండి నరేశ్‌మాదిగ, నాగేశ్, సత్యనారాయణ, మహేశ్, దుర్గారాజ్, గణేష్, భుజందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కాటేదాన్-శివరాంపల్లి ఆర్యవైశ్య సంఘం

అధ్యక్షుడిగా భద్రయ్య గుప్తా ఎన్నిక



రాజేంద్రనగర్, ఆగస్టు25 (ఆంధ్రజ్యోతి): కాటేదాన్ - శివరాంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఓరుగంటి భద్రయ్య గుప్తా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం శివరాంపల్లిలోని సంఘం భవనంలో జరిగిన ఎన్నికల్లో సంఘం నాయకులు ఓరుగంటి భద్రయ్య గుప్తాను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సంఘం సీనియర్ సభ్యుడు అర్థం లక్ష్మయ్య గుప్తా ఎన్నికల అధికారిగా వ్యవహరిం చారు. మొత్తం ఆరుగురు సభ్యులు అధ్యక్ష స్థానానికి పోటీ పడగా, సంఘం పెద్దలు, సభ్యుల సూచనతో ఐదుగురు పోటీ నుంచి విరమించుకున్నారు. దీంతో ఓరుగంటి భద్రయ్య గుప్తాను కాటేదాన్ - శివరాంపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం పూర్వ అధ్యక్షుడు వీరబొమ్మ శ్రీరాములుతో పాటు ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భద్రయ్య గుప్తా మాట్లాడుతూ, సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


అఫ్జల్‌గంజ్ ఠాణాలో దీక్ష కొనసాగిస్తున్న జక్కని సంజయ్, దాసు సురేశ్.

'బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలి'

గోషామహల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ నాయకులు జక్కని సంజయ్, బత్తుల సిద్దేశ్వర్, చాపర్తి కుమార్ గాడ్గే డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఆదివారం నారాయణగూడలో ప్రారంభించిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. దీక్షలో కూర్చున్న ఆందోళనకారులను అరెస్ట్ చేసి అఫ్జల్‌గంజ్ స్టేషన్‌కు తరలించారు. స్టేషన్‌లోనూ వారు తమ దీక్షను కొనసాగించారు. కాగా, దీక్షకు బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు దాసు సురేశ్, కార్యదర్శి మారెపల్లి లక్ష్మణ్‌లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వి.అనిల్, జి.సాయి కుమార్, రూప్ సాగర్, కె.నరహరి, పి.వనజా, పోశం అశోక్, భీమనాథం, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లోని చేపల ఉత్పత్తి కేంద్రం తనిఖీ


అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న మెట్టు సాయి కుమార్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మెదక్ పట్టణంలోని చేపల ఉత్పత్తి కేంద్రాన్ని ఆదివారం తెలంగాణ ఫిషరీష్ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా మత్స్యశాఖ అధికారి మల్లేషం తదితరుల బృందం తనిఖీ చేసింది. నగరంలో నుంచి మెదక్ వెళ్లిన సాయికుమార్ నేతృత్వంలోని బృందం చేపల ఉత్పత్తి కేంద్రాన్ని పరిశీలించి అక్కడ జరుగుతున్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంది. ప్రస్తుతం ఈ చేపల ఉత్పత్తి కేంద్రంలో 46 పాండ్స్ వాడకంలో ఉన్నాయని, మిగతా 60 పాండ్స్‌ను వాడుకలోకి తీసుకొస్తామని మెట్టు సాయి కుమార్ తెలిపారు. ఈ పర్యటనలో సొసైటీ ఉపాధ్యక్షుడు మహేశ్, ప్రధాన కార్యదర్శి దేవేందర్ తదితరులు ఉన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి...


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరాలు వెల్లడిస్తున్న పొల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హయాంలో ప్రవేశపెట్టిన రెండేళ్ల నిర్వహణ పనుల టెండర్‌లను పొడిగించకుండా ప్రజాధనాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జనరల్ సెక్రటరీ పొల్కం శ్రీనివాస్ అన్నారు. మంత్రి పొన్నంను ఆదివారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందేశారు. టెండర్ల పొడిగింపు వల్ల ప్రభుత్వానికి కలిగే నష్టాన్ని ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. అనంతరం పొల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ... జలమండలి విభాగం ఎండీ దాన కిశోర్, ఈడీ సత్యనారాయణలు బీఆర్ఎస్ హయాంలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని వారిపై రాష్ట్ర విజిలెన్స్ అధికారులతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://https://ejyothy.com/0yhrG7i లో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తర్వాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

పేకాటరాయుళ్ల అరెస్టు

నార్సింగ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 21 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసిన ఘటన నార్సింగ్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... పుప్పాల్‌గూడలోని ఓ అపార్ట్‌మెంట్‌లో శనివారం రాత్రి కొందరు పేకాటడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. నార్సింగ్, ఎస్‌ఓటీ పోలీసులు అక్కడికి వెళ్లి దాడి చేయగా 21 మంది చిక్కారు. వీరంతా నార్సింగ్, మొయినాబాద్, చేవెళ్ల ప్రాంతంలో రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌లుగా పని చేస్తున్నారు. వీరి నుంచి లక్షా 50 వేల నగదు, 21 మొబైల్ ఫోన్లు, ఆరు కార్లు సీజ్ చేశారు. వీరిపై గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నార్సింగ్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపారు.

లిఫ్ట్ నుంచి దిగుతూ మృత్యు ఒడికి...

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ లిఫ్ట్ గుంతలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆసిఫ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఉదయ్‌నగర్ కాలనీలోని వకాస్ స్క్వేర్ అపార్టుమెంట్స్ 402 ఫ్లాట్‌లో నివసించే సమీవుల్లా బేగ్ తాను దిగే అంతస్తు వచ్చిందనుకొని లిఫ్ట్ తలుపులు తెరిచాడు. బయటకు వస్తున్నాన్న ధ్యాసలో ప్రమాదవశాత్తూ గుంతలో పడిపోయాడు. 4వ అంతస్తు నుంచి కిందకు పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అపార్టుమెంట్ వాసులు క్షతగాత్రున్ని ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ప్రమాదవశాత్తూ మూడు ద్విచక్ర వాహనాలు దగ్ధం

చాంద్రాయణగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తూ మూడు ద్విచక్ర వాహనాలు దగ్ధమైన ఘటన శాలిబండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఈ ఇలా ఉన్నాయి.. జహనుమ ఫయిస్ బార్‌కు చెందిన సయ్యద్ అబు బాకర్ సిద్దిఖీ శనివారం రాత్రి తన ఇంటి ముందు యాక్టీవా 5జీ వాహనాన్ని నిలిపి నిద్రపోయాడు. ఆదివారం ఉదయం ఏదో కాలుతున్నట్లు వాసన రావడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చి చూడగా, తన ద్విచక్ర వాహనంతో పాటు మరో రెండు వాహనాలు (కరిష్మా, యూనికార్న్) కాలిపోతూ కనిపించాయి. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. శాలిబండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ టీవీని పరిశీలించారు. కరిష్మా వాహనం బ్యాటరీ నుంచి మంటలు రావడం వల్ల ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం

సైదాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): కుటుంబ నిర్వహణ ఖర్చు లు అడిగితే భార్యతో గొడవపడి భర్త కనిపించకుండా పోయిన సంఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చావునీ నాదర్‌అలీ బేగ్‌లో నివాసముండే మహ్మద్ అక్బర్(34) కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సారాబేగం ఇంటి నిర్వహణ, పిల్లల స్కూల్ ఫీజు, కరెంట్ బిల్లులు కట్టేందుకు భర్తను డబ్బులు అడిగింది. దీంతో భా ర్యతో గొడవపడి ఆగస్టు 1న ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. అతడి కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భార్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనానికి ప్రయత్నిస్తూ వ్యక్తి మృతి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దొంగతనం చేసేందుకు ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మధురానగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆగ్రా స్వీట్స్ ఎందుట గల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చోరీ చేసేందుకు ఆదివారం తెల్లవారు జామున ఓ వ్యక్తి ప్రయత్నించాడు. డబ్బాకు ఉన్న ఒక సైడ్ మూత తీశాడు. మరో వైపు మూత తీసేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు డబ్బా అతడిపై పడడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. ఉదయం 6 గంటల సమయంలో గమనించిన పోలీసులు డబ్బా తీసి చూడగా వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వివరాలు తెలియరాలేదు. పండ్ల వ్యాపారిని కొట్టి చంపారని సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఇలాంటి వార్తలను ప్రచారం చేసే ముందు పోలీసులను అడిగి నిజాలు తెలుసుకోవాలని, అసత్యాలను ప్రచారం చేసి ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించడం తగదన్నారు.



హైకోర్టు అడ్వకేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైకోర్టులో జరిగిన బోనాల వేడుకలో పాల్గొన్న జస్టిస్ మాధవీ దేవి, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

దేశభక్తిలో బీసీలు తక్కువ కాదు

వ్యవస్థలో కుల,చేతి వృత్తులను నాశనం చేస్తున్నారు



బీపీ మండల్ చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగిస్తున్న జస్టిస్ చంద్రకుమార్, తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు

పంజాగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో 60 శాతం ఉన్న ఓబీసీలకు అరకొర రిజర్వేషన్లు అమలు చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నష్టం చేకూరుస్తున్నాయని పలువురు వక్తలు ఆరోపించారు. నీతి, నిజాయితీ, దేశభక్తిలో బీసీలు తక్కువ కాదని వారన్నారు. వ్యవస్థలో కుల, చేతి వృత్తులను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీపీ మండల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ బీసీ రాజులు ఎక్కడైతే పరిపాలన చేశారో అక్కడ ఎంతో అభివృద్ధి జరిగిందని అన్నారు. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన ఎన్నికల్లో పలు రాష్ట్రాలలో ప్రజలు బ్రాహ్మణ, మనువాదాన్ని ఓడించారని అన్నారు. వ్యవస్థలో కుల, చేతి వృత్తులు నాశనం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వతంత్రం వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా వివక్ష, అణిచివేత కొనసాగుతూనే ఉందని అన్నారు. డాక్టర్ పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ బీసీ ఉద్యోగులు భీష్మించుకుని కూర్చుంటే ముఖ్యమంత్రిగా బీసీ వ్యక్తే అవుతారని అన్నారు. ఫెడరేషన్ వ్యవస్థాపకుడు దేవళ్ల సమ్మయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రొఫెసర్ ఐ.తిరుమలి, వివిధ సంఘాల నాయకులు దుర్గం రవీందర్, ఫెడరేషన్ ప్రతినిధులు కొట్టె సతీష్, కురవ వినోద్, తదితరులు మాట్లాడారు. ముందుగా బీపీ మండల్ చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అభివాదం చేస్తున్న బీసీ సంఘాల నేతలు

కుల, జనగణన చేయకపోతే ఉద్యమిస్తాం..

- బీపీ మండల్ విగ్రహాన్ని పార్లమెంటల్లో ప్రతిష్ఠించాలి
- జాజుల శ్రీనివాస్‌గౌడ్

రవీంద్రభారతి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ కులగణన చేయకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో సామాజిక న్యాయ జేఏసీ అధ్యక్షుడు ప్రభంజన్‌యాదవ్ ఆధ్వర్యంలో మహనీయుల జాతర, బీపీ మండల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించి సమాజంలో తల ఎత్తుకునేలా చేసిన ఘనత బీపీ మండల్‌కు దక్కుతుందని అన్నారు. కుల, జనగణన జరిగితే బీసీలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బీపీ మండల్ జమిందారు కుటుంబానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ విద్యార్థిదశ నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై జరిగిన దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు చేశారన్నారు. బీపీ మండల్ విగ్రహాన్ని పార్లమెంటల్లో ప్రతిష్ఠించాలని, ఆయన జయంతి, వర్ధంతులను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండల్ స్ఫూర్తితోనే కులగణన సాధిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ శ్రీనివాస్‌యాదవ్, బీపీ మండల్ మనువడితో పాలు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సాంకేతికతను సమాజాభివృద్ధి కోసం ఉపయోగించాలి

- బిట్స్‌పిలానీ క్యాంపస్‌లో ఘనంగా హైబ్రిడ్ కాన్వొకేషన్
- పట్టాలు అందుకున్న 7,800 మంది



పట్టాలు అందజేస్తున్న బిట్స్ వీసీ రామ్‌గోపాల్‌రావు

జవహర్‌నగర్, ఆగస్ట్ 25 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా మానవ మేధస్సును, నైపుణ్యం, సాంకేతికతను సమాజాభివృద్ధి కోసం ఉపయోగించాలని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రెడిటేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ సహస్రబుద్దే అన్నారు. మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ పరిధి లోని బిట్స్‌పిలానీ హైదరాబాద్ క్యాంపస్‌లో ఆదివారం హైబ్రిడ్ కాన్వొకేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎమ్ఐటీ విశ్వవిద్యాలయం ఇంటర్‌నేషనల్ అండ్ ఎంగేజ్‌మెంట్ డిప్యూటీ వైస్‌చాన్స్‌లర్ సస్కియా లోయర్‌హాన్సెస్ సాంకేతికతను ఎలా వినియోగించుకోవాలో విద్యార్థులకు వివరించారు. విజయాలు, అపజయాలను సానుకూల దృక్పథంతో ఎదుర్కోవాలన్నారు. స్నాతకోత్సవంలో పట్టాలు అందుకున్న వృత్తినిపుణులను ఉద్దేశించి బిట్స్‌పిలానీ చాన్స్‌లర్ డాక్టర్ కుమార్ మంగళం బిర్ల్లా వర్చువల్‌గా సందేశం ఇచ్చారు. అచంచలమైన నిబద్ధత వల్లే మీరు ఇక్కడకు చేరుకున్నారని వృత్తి నిపుణులను అభినందించారు. బిట్స్‌పిలానీ వీసీ రామ్‌గోపాల్‌రావు, డైరెక్టర్ ప్రొఫెసర్ సుందర్ మాట్లాడారు. ఈ సందర్భంగా 7,800మంది వృత్తినిపుణులకు బిట్స్ వైస్‌చాన్స్‌లర్ రామ్‌గోపాల్‌రావు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, గ్రాడ్యుయేట్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

(5వ పేజీ తరువాయి)

బాధాకరమన్నారు. అందరూ రోజూ వ్యాయామం చేయాలన్నారు. మారథాన్ సందర్భంగా పీపుల్స్‌ప్లాజా వద్ద ప్రదర్శించిన బ్యాండు, వామప్ జోష్‌ఫుల్‌గా సాగింది. అనంతరం గచ్చిబౌలి బాలయోగి స్టేడియం వరకు రన్ సాగింది. కార్యక్రమంలో ఎన్ఎండీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, ఐఎఫ్‌డీసీ ఫస్ట్ బ్యాంక్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ టీవీ నారాయణ, రేస్ డైరెక్టర్ రాజేష్ వెచ్చా ఉన్నారు. మారథాన్‌లో పాల్గొని 21.26కిలో మీటర్లను 2గంటల 32 నిమిషాల 25 సెకండ్లలో పూర్తిచేయడం సంతోషంగా ఉందని డీసీపీ సురేష్‌కుమార్ తెలిపారు. వివిధ రంగాల నుంచి భారీస్థాయిలో 25వేల మంది రన్నర్లు, 50 ఎలైట్ రన్నర్లు ఈ మారథాన్‌లో పాల్గొన్నారు. మారథాన్‌లో పాల్గొన్న వారికి కేర్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించారు. ఒక్కో శిబిరంలో ఇద్దరు ఫిజియోథెరపిస్టులు, ఇద్దరు పారామెడికల్ స్టాఫ్, ఒక డాక్టరు చొప్పున దాదాపు 150 మంది వైద్య సిబ్బంది ఇందులో పాల్గొన్నారు.

విజేతలు వీరే..

మారథాన్ ఎలైట్ మహిళల విభాగంలో షీలా చెబెట్, జెనెత్ జెప్‌కోస్గీ కిప్టో, అలెమిటు హరోయె తొలి మూడుస్థానాల్లో నిలిచారు. భారత్ నుంచి అశ్విని జాదవ్, జ్యోతి గవాటె, భగీరధి బిష్త్ తొలి మూడు స్థానాలను దక్కించుకున్నారు. ఇక, మారథాన్ ఎలైట్ పురుషుల కేటగిరిలో హమ్మింగ్టన్ కిమోయో, ఎజెకిల్ కిప్కోరిర్, ఫెలెకె డెర్సెమా టులు మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకోగా.. భారత పురుషుల విభాగంలో శ్రీను బుగత, సోను తోమర్, అనంత్ గావోన్కర్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపీలు వి. హనుమంతరావు, వేణుగోపాల చారి, బాక్సర్ నిఖత్ జరీన్ తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ దవాఖానాల్లో అవయవమార్పిడులు అంతంతే..

- ఉస్మానియా, గాంధీలో 99 మాత్రమే
- నిమ్స్‌లో 455 మార్పిడులు
- ప్రైవేట్‌లో 5,061 మార్పిడులు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఎలాంటి ఆరోగ్య సమస్య వచ్చినా వెంటనే వారు వెళ్లేది ప్రభుత్వ ఆస్పత్రులకే. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోలేని పేద, మధ్య తరగతి వర్గాల వారికి నగరంలోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ ఆస్పత్రులు వరంగా నిలుస్తున్నాయి. ఈ రెండు ఆస్పతుల్లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి ఉచితంగా చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీంతో అవయవ మార్పిడి అవసరమైన పేద రోగులు తమ వంతు ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

నిమ్స్‌లో అవయవ మార్పిడికి రెండు, మూడు లక్షలు ఖర్చు అవుతుంది. అదే ఆరోగ్యశ్రీ ఉంటే ఉచితమే. కార్పొరేట్ ఆస్పత్రుల్లో రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు వ్యయం అవుతుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వేల సంఖ్యలో అవయవ మార్పిడులు జరగగా, ఉస్మానియా, గాంధీ ఆస్పత్రుల్లో వందల సంఖ్యలో కూడా జరగడం లేదు. గడిచిన పదేళ్లలో జీవన్‌దాన్ ద్వారా 5,620 అవయవ మార్పిడులు జరగగా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కేవలం 559 మాత్రమే జరిగాయి. ఉస్మానియా ఆస్పత్రిలో 85, గాంధీలో 14, ఈఎస్ఐసీలో 5 అవయవ మార్పిడులు జరగగా, అత్యధికంగా నిమ్స్‌లో 455 జరిగాయి. ఉస్మానియా, గాంధీలో 2013 నుంచి 2024 ఆగస్టు వరకు కేవలం 99 మాత్రమే జరిగాయి.

ఒకే ఒక గుండె మార్పిడి..

ఉస్మానియా ఆస్పత్రిలో పదేళ్లలో 66 కిడ్నీ మార్పిడులు జరగగా, గాంధీలో మాత్రం కేవలం 13తోనే సరిపెట్టారు. గాంధీ ఆస్పత్రిలో ఒకే ఒకరికి గుండె మార్పిడి చేయగా, ఉస్మానియాలో ఒక్కటి కూడా జరగలేదు. ఈ రెండు ఆస్పత్రుల్లో ఊపిరితిత్తుల మార్పిడి ఒకటి కూడా జరగలేదు. కాలేయ మార్పిడులు ఉస్మానియాలో 18 జరగగా, గాంధీలో ఒక్కటి కూడా కాలేదు.

రిస్కు తీసుకోలేక తాత్సారం

అవయవమార్పిడి అంటే రిస్కుతో కూడుకున్నది. ఏ మాత్రం ఇన్‌ఫెక్షన్ సోకినా, నిర్లక్ష్యం జరిగినా ప్రాణాలకే ముప్పు. అందుకే కొంత మంది వైద్యులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది. మరోవైపు నిమ్స్‌లో మాదిరిగా ఉస్మానియా, గాంధీలో ప్రత్యేకంగా మార్పిడికి అవసరమైన ఆధునిక పరికరాలు, ఆపరేషన్ థియేటర్లు పెద్దగా లేవు. పాతకాలం నాటి ఆపరేషన్ థియేటర్లలోనే అవయవ మార్పిడులు చేయాల్సిరావడం వల్ల కూడా వైద్యులు రిస్కు తీసుకోవడం లేదని తెలుస్తోంది.

ముందుకు రాకపోవడం.

అవయవ దానానికి దాతల కుటుంబాలు కూడా ముందుకు రాకపోవడం ఈ పరిస్థితికి మరో కారణంగా కనిపిస్తోంది. పదేళ్లలో కేవలం పది మంది దాతలు మాత్రమే ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో కిడ్నీ, కాలేయం మార్పిడులపైనే ప్రభుత్వ ఆస్పత్రులు దృష్టి సారిస్తున్నాయి.

రక్త సంబంధీకులు వస్తే...

కిడ్నీ, కాలేయ మార్పిడులు వంటివి లైవ్ డోనర్లు అయిన కుటుంబసభ్యులు, రక్తసంబంధీకులు ముందుకు వస్తే వారి వద్ద నుంచి సేకరించి బాధితులకు మార్పిడి చేస్తారు. కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువుల బ్లడ్ మ్యాచ్ కాకపోతే బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి జీవన్ దాన్ ట్రస్ట్ సాయంతో సేకరించి బాధితులకు మార్పిడి చేస్తారు.

3,633 మంది నిరీక్షణ...

దాతలు ముందుకు రాకపోవడం, అవసరమైన అవయవాలు అందుబాటులో లేకపోవడంతో బాధితులు తమకు ఈ నరకం నుంచి ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ఎదురు చేస్తున్నారు. జీవన్‌దాన్‌లో అవయవాల కోసం తమ పేర్లను నమోదు చేసుకుని 3,633 మంది బాధితులు నిరీక్షిస్తున్నారు. కాలేయం కోసం 982, మూత్రపిండాలు 2,467, గుండె 88, ఊపిరితిత్తులు 81, పాంక్రియాస్ కోసం 15 మంది ఎదురు చూస్తున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో 2013 నుంచి 2024 ఆగస్టు వరకు.. అవయవమార్పిడులు ఇలా

ఆస్పత్రి	కిడ్నీ	కాలేయం	గుండె	లంగ్స్	పాంక్రియాస్
ఉస్మానియా	66	18	0	0	1
గాంధీ	13	0	01	0	0
నిమ్స్	423	19	11	02	0
ఈఎస్ఐసీ	05	0	0	0	0
మొత్తం	507	37	12	02	01

మధ్యాహ్న భోజన కార్మికులను ఆదుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

కవాడిగూడ ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన పథకం వంట కార్మికులకు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి వారిని ఆదుకోవాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కింద పనిచేసే వంట కార్మికుల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఎన్నికల హామీ ప్రకారం నెలకు పదివేల రూపాయల గౌరవ వేతనం వారికి చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడానికి అమలుకాని హామీలు ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని ఆయన ధ్వజమెత్తారు. వంట కార్మికులనే కాదు మహిళలకు నెలకు రూ.2500 జీవనభృతి, 18 సంవత్సరాలు నిండిన యువతులకు స్కూటీలు, పెన్షన్ల పెంపు తదితర హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటి అమలుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం ప్రకారం వారికి గౌరవ వేతనం పదివేలు ఇవ్వడంతో పాటు నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా బడ్జెట్ పెంచి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే మధ్యాహ్న భోజన పథకం కార్మికులతో కలిసి రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం వంట కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల హనుమాండ్లు చారి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పజెప్పాలన్న ఆలోచనను వెంటనే ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం గుడ్లకు ప్రభుత్వం చెల్లిస్తున్న రూ.5లను ఏడు రూపాయలకు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబాయి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సంతోష, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మంజుల, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ హమీద్‌ఖాన్ పాల్గొన్నారు.



ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మద్దతు తెలియజేస్తున్న ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కొండ పద్మ తదితరులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పేస్కేల్ ఇవ్వాలి

- శాంతియుత ధర్నాలో పలువురు వక్తల డిమాండ్

కవాడిగూడ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సరైన సమయంలో వేతనాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఏజెన్సీ విధానం రద్దు చేసి ప్రభుత్వం నేరుగా పేస్కేల్ ఇవ్వాలని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వారి ఏజెన్సీలు నాలుగు, ఆరు నెలలకోసారి వేతనాలు ఇస్తే వారి కుటుంబ పోషణ ఎలా సాగుతుందని ప్రశ్నించారు. ఆదివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, ప్రతి నెలా ఒకటవ తేదీన వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ ధర్నాకు ఎంపీ ఈటల రాజేందర్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కొండ పద్మ హాజరై మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల వేతనాలు ఎలా వస్తాయో అలాగే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కూడా ఇవ్వాలని, పీఎఫ్, హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఔట్‌సోర్సింగ్ కార్మికుల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో వారు చేసే పోరాటానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆయన అన్నారు. అనంతరం ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి కొండా పద్మ మాట్లాడూతూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకొని ఏజెన్సీలు లబ్ధిపొందుతున్నాయని ఆరోపించారు. ఔట్ సోర్సింగ్ పద్ధతిని తొలగించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రతినెలా 1వ తేదీన వేతనం అమలు చేసే అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు పులి లక్ష్మయ్య మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసే ప్రతి నోటిఫికేషన్‌లో వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమానంగా సెలవులు ఇస్తూ, మహిళలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో జేఏసీ నేతలు బొల్లం గోవర్ధన్, కొటాల సంతోష్‌కుమార్, వినోద్, విజయలక్ష్మి, జె.సంధ్య ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న విద్యార్థి ఉద్యమకారులు

తార్నాక, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని విద్యార్థి ఉద్యమకారుల బృంద సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, టీఎస్ జేఏసీ చైర్మన్ భట్టు శ్రీహరి అధ్యక్షతన ఆదివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీ సెమినార్‌హాల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డా. పిడమర్తి రవి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన విద్యార్థి ఉద్యమకారులకు ఇంటి స్థలంతోపాటు, నామినేటెడ్ పోస్టుల భర్తీలో సముచిత స్థానాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి భట్టు శ్రీహరి మాట్లాడుతూ త్వరలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విద్యార్థి ఉద్యమకారులకు ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీలు, 10 కార్పొరేషన్ చైర్మన్ పోస్టులతో పాటు, జిల్లా పరిషత్, మున్సిపల్ చైర్మన్ పోస్టులను కేటాయించాలని కోరుతామన్నారు. అదేవిధంగా ఓయూ విద్యార్థి ఉద్యమకారులకు హైద్రాబాద్‌లో 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థి ఉద్యమకారులు లోకేష్ యాదవ్, చరణ్ కౌశిక్‌యాదవ్, దుర్గం భాస్కర్, కోట శ్రీనివాస్‌గౌడ్, శ్రీధర్‌గౌడ్, కృష్ణకాంత్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలుగా పనిచేయని ట్రై కమిషనరేట్ల వెబ్‌సైట్లు

- సెక్యూరిటీ లోపాలను సరిచేస్తున్న ఐటీ సెల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే కీలకంగా ఉన్న హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ వెబ్‌సైట్లు గడిచిన మూడు నెలలుగా అందుబాటులో లేవు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న హ్యాక్ ఐ యాప్‌ను ఈ ఏడాది జూన్‌లో సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేయడంతో యాప్‌తోపాటు ట్రై కమిషనరేట్ల వెబ్‌సైట్లలో ఉన్న సెక్యూరిటీ లోపాలు బయటపడ్డాయి. వెంటనే రంగంలోకి దిగిన ఐటీ సెల్ దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. ఇందులో భాగంగా పోలీస్‌శాఖలో వినియోగిస్తున్న అప్లికేషన్స్‌తో పాటు వివిధ కమిషనరేట్‌ల వెబ్‌సైట్లలో ఉన్న సెక్యూరిటీ లోపాలను సరిదిద్దే ప్రయత్నం మొదలు పెట్టారు. దాంతో గత మూడు నెలలుగా హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల వెబ్‌సైట్స్ పనిచేయడంలేదు. దీంతో కమిషనరేట్ల పరిధిలోని పోలీస్‌స్టేషన్‌ల, అధికారుల సమాచారం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. జూన్‌లో తెలంగాణ పోలీస్ యాప్ హ్యాక్‌ఐని హ్యాక్ చేసిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన హ్యాకర్‌ను సాంకేతిక ఆధారాలతో పోలీసులు అరెస్ట్ చేశారు. అప్పటికే అతను డేటాను ఆన్‌లైన్‌లో అమ్మకానికి పెట్టినట్లు గుర్తించారు. ఈ తరుణంలో ఆయా కమిషనరేట్ల వెబ్‌సైట్లలో లోపాలను గుర్తించిన సైబర్ నిపుణులు వాటిని అప్‌గ్రేడ్ చేయాలని సూచించారు. జూన్ నుంచి ట్రైకమిషనరేట్ల వెబ్‌సైట్లు ఇప్పటికీ అందుబాటులో రాలేదు.

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్‌కు నామినేషన్లు పంపండి

- జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2024-25కు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల నుంచి ఐదుగురు చొప్పున విద్యార్థులు నామినేషన్స్ దాఖలు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రోహిణి తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ సెప్టెంబర్ 15 వరకు ఉందన్నారు. మరిన్ని వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్‌రావును 7799171277, 7981950513, 6300869388 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.



జమిలిపోగు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న కుప్పిలి పద్మ,నాగసూరి వేణుగోపాల్, రామ్మోహన్, సజయ,విజయ్ కుమార్, తదితరులు

'జమిలిపోగు' ఆవిష్కరణ

పంజాగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రచయిత రుబీనా పర్వీన్ రాసిన జమిలిపోగు కథా సంపుటిని ఆవిష్కరణ ఆదివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. సీనియర్ పాత్రికేయుడు జీఎస్ రామ్మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి కుప్పిలి పద్మ, సీనియర్ పాత్రికేయుడు నాగసూరి వేణుగోపాల్, సామాజిక కార్యకర్త సజయ, ప్రముఖ కవి కె.విజయ్‌కుమార్ తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఈ పుస్తకంలోని కథలు సంపదను సృష్టించేలా, భరోసా, ధైర్యం ఇచ్చేలా ఉన్నాయని కుప్పిలి పద్మ అన్నారు. ఈ పుస్తకాన్ని తన తల్లికి అంకితం ఇస్తున్నానని రచయిత రుబీనా పర్వీన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంచుకునే దిశగా ఆర్టీసీ చర్యలు



హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తూనే రోజు వారీ ఆదాయం పెంచుకునే అవకాశాలపై దృష్టి సారించినట్లు గ్రేటర్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. నగరంలో మూడువారాల క్రితం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన 24 మెట్రోడీలక్స్ బస్సులకు ప్రయాణికుల నుంచి ఆదరణ పెరుగుతున్నదన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా గ్రేటర్‌జోన్ వ్యాప్తంగా కొత్త రూట్లు పరిశీలిస్తూ ప్రయాణికుల అవసరాల మేరకు ఆయా రూట్లలో బస్‌ట్రిప్పులు పెంచుతున్నట్లు ఆదివారం వెల్లడించారు. సిటీ బస్సుల్లో రోజు ప్రయాణాలు సాగించే వారి కోసం రూ.1450తో మెట్రో డీలక్స్ బస్‌పాస్‌లను అందుబాటులోకి తెచ్చామని, ఈ పాస్‌తో మెట్రో డీలక్స్, మెట్రో ఈ-ఎక్స్‌ప్రెస్ నాన్‌ఏసీ, మెట్రోఎక్స్‌ప్రెస్‌లలో నెలంతా ప్రయాణించవచ్చని ఈడీ తెలిపారు.



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు

రిటైర్డ్ పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మాసబ్ ట్యాంక్‌లోని పోలీస్ ఆఫీసర్స్‌మెస్‌లో ఆదివారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో 75 ఏళ్లు నిండిన రిటైర్డ్ పోలీసు అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ నవీన్‌చంద్, అప్పారావు, విజయ్‌కుమార్, రతన్, ప్రభాకర్‌రెడ్డి, రాజేందర్, గోపాల్‌రెడ్డి, శేషగిరిరావు, రాజయ్య, నర్సింగ్‌రావు, సుకుమార్, మాధవాచారి, గోపాలరాజులు, మల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.

హెల్'సెల్' డ్రైవింగ్

(5వ పేజీ తరువాయి)

మ్యూజిక్ మైకంలో రోడ్డు ప్రమాదాలు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇరువైపు వాహనాల నుంచి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. కొంతమంది లారీ డ్రైవర్లు మ్యూజిక్ పెట్టి పాటలు వింటూ డ్రైవింగ్ చేస్తున్నారు. మరికొంతమంది లాంగ్ డ్రైవ్‌కు వెళ్తున్న సమయంలో చెవిలో ఇయర్‌ఫోన్లు పెట్టుకొని పాటలు వింటూ, లేదా ఫోన్ మాట్లాడుతూ లారీలు నడుపుతున్నారు. ఈ క్రమంలో పాటల మైకంలో పడి వెనుకాల వచ్చే వాహనాల హారన్‌లను పట్టించుకోకుండా, జరగబోయే ప్రమాదాన్ని పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నడుపుతున్నారు. దాంతో రోడ్డు ప్రమాదాల బారినపడి అమాయకుల ప్రాణాలు బలితీసుకోవడంతో పాటు.. కొన్ని సందర్భాల్లో వారి ప్రాణాలే పోగొట్టుకుంటున్నారు.

క్యాబ్ డ్రైవర్‌లదీ అదే తీరు

కొంతమంది ఆటో, క్యాబ్ డ్రైవర్‌ల పరిస్థితి మరీ దారుణం. గూగుల్‌మ్యాప్‌లు, వీడియోలు చూస్తూ డ్రైవింగ్ చేస్తున్నారు. పక్కన వచ్చే వాహనదారులను పట్టించుకోవట్లేదు. ఒకచేతిలో సెల్‌ఫోన్, మరొక చేతిలో స్టీరింగ్ పట్టుకొని కార్లు నడుపుతున్నారు. రైడర్లు, డెలివరీ బాయ్‌ల డ్రైవింగ్ అయితే చెప్పనవసరంలేదు.సెల్‌ఫోన్ మాట్లాడకుండా, రన్నింగ్‌లో గూగుల్‌మ్యాప్‌ను చూడకుండా డ్రైవింగ్ చేసే పరిస్థితి లేదు. వెనకాల వస్తున్న వాహనదారులు కొడుతున్న హారన్‌లను వినిపించుకోకుండా, రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహన డ్రైవర్‌లే కాదు.. నగరంలోని అనేక కూడళ్ల వద్ద పాదచారులు కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఇష్టానుసారంగా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. ఇయర్ ఫోన్‌లో పాటలు వింటూ రోడ్డు దాటుతూ మృత్యువు ఒడిలోకి వెళ్తున్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ వల్ల ఎంతోమంది వాహనదారులు, పాదచారులు ప్రాణాలు కోల్పోతున్నారని ట్రాఫిక్ పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మారని తీరు

ఏటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని వేల మంది క్షతగాత్రులు వికలాంగులుగా మారుతున్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి పోలీసులు, ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా వాహనదారుల్లో మార్పు రావడంలేదు. ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతూ ట్రాఫిక్ రూల్స్‌ను తుంగలో తొక్కుతున్నారు. ముఖ్యంగా యువత చేతిలో బైక్ ఉంటే చాలు వాయువేగంతో దూసుకెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. రహదారి భద్రతకు పెద్దపీట వేస్తామని అధికారులు ఏటా ప్రకటిస్తున్నా.. రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్నా.. అవి కేవలం వారోత్సవాలకు మాత్రమే పరిమితం అవుతున్నాయి.

15 శాతం అధికం

నగరంలో సెల్‌ఫోన్ డ్రైవింగ్‌లే దర్శనమిస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌తో ఉక్కుపాదం మోపుతున్నారు. ఏడు నెలల్లోనే ట్రై కమిషనరేట్ పరిధిలో 62,200 సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు నమోదు చేశారు. హైదరాబాద్ సిటీలో 31,712, సైబరాబాద్‌లో 15,488, రాచకొండ కమిషనరేట్ పరిధిలో మరో 15 వేల కేసులు నమోదైనట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. గతేడాదితో పోల్చితే సుమారు 15 శాతం అధికంగా సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులు పెరిగినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం • 26 ఆగస్టు 2024

సెలబ్ ఫిట్

నాన్నే ఆదర్శంగా...

సినిమాల్లో పెద్దగా కనిపించకపోయినా... అభిమానులతో ఎప్పుడూ టచ్‌లోనే ఉంటుంది అథియా శెట్టి. హీరో సునీల్‌శెట్టి వారసురాలిగా బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఈ బ్యూటీ... స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌ను ప్రేమించి పెళ్లాడి అటు క్రికెట్ ప్రేమికులకూ దగ్గరైంది. ఇన్‌స్టాలో తరచూ తన వర్కవుట్ సెషన్స్‌ను పోస్ట్ చేస్తూ... యువతను వ్యాయామాల వైపు మళ్లించేందుకు ప్రయత్నిస్తోంది.

'హీరో' చిత్రంతో తొలిసారి వెండితెర మీద కనిపించిన అథియా, ఆ ఏడాది ఫిలిమ్‌ఫేర్ అవార్డు గెలుచుకుంది. అయితే ఆ తరువాత రెండు మూడు చిత్రాల్లో మినహా పెద్దగా చేయలేదు. అయినా లేటెస్ట్ లుక్స్‌తో... తన దైనందిన జీవితానికి చెందిన విశేషాలతో సామాజిక మాధ్యమాల్లో నిత్యం బిజీగా గడుపుతోంది. అన్నిటికీ మించి భారత స్టార్ బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్‌తో ప్రేమాయణం ఎపిసోడ్‌వల్ల క్రికెట్ అభిమానులతో కూడా బాగా కనెక్ట్ అయింది. గత ఏడాది జనవరిలో రాహుల్‌ను పెళ్లి చేసుకున్న ఆమె... తన వైవాహిక జీవితంలోని మధురిమలను అప్పుడప్పుడూ ఇన్‌స్టాలో పంచుకొంటోంది. అంతేకాదు... పెళ్లి తరువాత కూడా అంతే నాజూకుగా మురిపిస్తోంది. అందుకు క్రమం తప్పని తన వ్యాయామాలే కారణమంటూ... ఆ చిత్రాలను పోస్ట్ చేస్తోంది. ఎందరికో ప్రేరణగా నిలుస్తోంది. ఆమె ఫిట్‌నెస్, డైట్‌ప్లాన్‌పై మీరూ ఓ లుక్కేయండి.

వర్కవుట్ ఇలా...

వారంలో కనీసం ఐదు రోజులు అథియా జిమ్‌కు వెళుతుంది. తన శరీర తత్వాన్ని బట్టి వివిధ రకాల వ్యాయామాలకు సమయం కేటాయిస్తుంది. ఎప్పటికప్పుడు ఫిట్‌నెస్ గోల్స్ నిర్దేశించుకొంటుంది. ఇందులో నాన్న సునీల్‌శెట్టినే ఆమెకు స్ఫూర్తి.

- ఉదయం ఇరవై నిమిషాలు కార్డియో. తరువాత వెయిట్ ట్రైనింగ్
- మూడు సెట్స్ చొప్పున పుషప్స్, పుల్‌డౌన్స్, ట్రైసెప్స్ పుష్‌డౌన్స్, డంబెల్స్, బైసెప్స్.
- రోజూ ఒకటే రకం వ్యాయామాలు కాకుండా మార్షల్ ఆర్ట్స్ మిక్స్ చేస్తుంది అథియా.
- జిమ్‌కు వెళ్లే ముందు లాంగ్ వాక్స్‌తో ప్రకృతి ఆస్వాదనం.
- ఫ్లెక్సిబిలిటీ కోసం కాసేపు యోగా. మానసిక ప్రశాంతత, ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ధ్యానం.



ఇదీ మెనూ...

బలవర్ధకమైన, ఆరోగ్యకరమైన పోషకాహారం అథియా మెనూలో ఉంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకే ప్రాధాన్యం ఇస్తుంది. వీలైతే తనే వండుకొంటుంది. ప్రతిరోజూ బ్రేక్‌ఫాస్ట్ తప్పనిసరి. ఒకవేళ ప్రయాణంలోనో, పనిలోనో ఉంటే గ్రీన్ జ్యూస్‌లు తీసుకొంటుంది. తీపి పదార్థాలకు దూరం. శరీరం డీహైడ్రేట్ కాకుండా తరచూ కొబ్బరి నీళ్లు తాగుతుంది.

- బ్రేక్‌ఫాస్ట్‌లో పెద్ద బౌల్ నిండా బొప్పాయి, పైనాపిల్, పుచ్చకాయ తదితర తాజా పండ్ల ముక్కలు, జీడిపప్పు, బాదం, వాల్‌నట్స్. లేదంటే చెర్రీ టమోటా, అవకాడో, బాయిల్డ్ ఎగ్స్, మల్టీగ్రెయిన్ బ్రెడ్. అప్పుడప్పుడూ పాన్‌కేక్స్.
- లంచ్‌కు రాజ్మా చావల్. ఇది తన ఆల్‌టైమ్ ఫేవరెట్.
- లంచ్ తరువాత గంటకు ఐస్‌డ్ లెమన్ విఁట్ టీ.
- వారాంతంలో ఎప్పుడైనా ఐస్‌క్రీమ్

ఆ ప్రశ్నే నన్ను రాజకీయాల్లోకి నడిపించింది

ఆమె అవమానం ఎదురైనా, ఆత్మాభిమానం గాయపడినా భగ్గున మండే భాస్వరం. ముఖ్యమంత్రులనైనా నిలదీసే ముక్కుసూటిదనం... గల్లా అరుణకుమారి స్వభావం. అలాంటి నిక్కచ్చి మనిషి తన 'స్వీయ చరిత్ర'ను అక్షరబద్ధం చేశారు. అది కేవలం ఆమె ఆత్మకథ మాత్రమే కాదు... ఆరు దశాబ్దాలుగా అనేక రూపాలు మార్చుకున్న తెలుగు నేల రాజకీయ చరిత్ర కూడా. ఆ వెయ్యి పేజీల పుస్తకం ఈ నెల 30న తిరుపతిలో విడుదల కాబోతున్న సందర్భంగా... 'నవ్య' ఆమెతో సంభాషించింది.



మీకు ఆత్మకథ రాయాలని ఎలా అనిపించింది?

తొమ్మిదేళ్ల క్రితం అమెరికాలో ఉన్న మా అమ్మాయి రమ దగ్గరకు వెళ్లాను. "ఎవరెవరి కథలో రాశావు. నీ కథ కూడా రాయమ్మా" అంటూ తను నా వెంట పడింది. 'ఏం రాయాలి? ఎలా రాయాలి? అసలెందుకు రాయాలి?' అనే ప్రశ్నలు నన్ను ముందుకు కదలనివ్వలేదు. కానీ రమ వదలలేదు. లైబ్రరీకి తీసుకువెళ్లింది. "ఇక్కడ బోలెడు స్వీయచరిత్రలు ఉన్నాయి. చదువు" అని చూపించింది. "ప్రశాంతంగా ఉంటుంది. ఇక్కడ రాసుకో" అని నోట్ పుస్తకాలు నాముందు పెట్టి వెళ్లిపోయింది. 'నన్ను నేను చూసుకోవాలి. నాలోకి నేను చూసుకోవాలి' అనుకున్నాను. అలా మొదలు పెట్టాను. పగలు నేను రాసినవన్నీ... రాత్రి తను ఆసుపత్రి నుంచి రాగానే నాతో చదివించుకొనేది. 300 పేజీలు రాశాక ఇండియా వచ్చేశాం. దాంతో రాయడం ఆగిపోయింది. కరోనా సమయంలో మళ్లీ కదిలింది. ఆ సమయంలోనే రాయడం పూర్తి చేసేశాను. రాతలో మొత్తం 3,000 పేజీలు వచ్చింది.

40 ఏళ్ల కిందటే కథలు రాశారు. ఆ అనుభవం పనికొచ్చిందా?

ఇది పూర్తిగా నా కథ. ఈ అనుభవం భిన్నమైనది. అమ్మలేని బిడ్డగా, ఆడపిల్లగా పెరిగాను. నాన్న చాటునుంచి బయటకు వచ్చి, భర్త సహచర్యంతో దేశం దాటాను. తిరిగి వచ్చాక అనేక రాజకీయ పదవుల్లో ఉన్నాను. నా ప్రయాణంలో ఎంతో ఘర్షణ ఉంది. ఇదంతా నా తరువాతి తరాలకు తెలియాలి అనిపించి రాశాను. ఇంట్లో ఎందరున్నా అమ్మలేనితనం నన్ను ఒంటరిని చేసేది. బిడియం, భయం, జంకు.. మాట పెగిలేది కాదు. ముడుచుకుపోయి ఉండేదాన్ని. మా బట్టలుతికే దేశవ్వ "నోట్లో నాలిక లేని బిడ్డ ఎట్లా బతకపోతోందో" అని బాధపడేది. అమెరికా జీవితం నాకు ప్రశ్నను నేర్పించింది. ఆ ప్రశ్నే నన్ను రాజకీయాల్లోకి నడిపించింది.

మీ స్వీయ చరిత్ర మొత్తం చదివాక... అది మీ నాన్నగారు పాటూరి రాజగోపాలనాయుడు జీవిత చరిత్ర అనిపిస్తోంది!

పెళ్లయిన నాలుగు సంవత్సరాలకే భార్య చనిపోతే, బిడ్డ కోసం ఒంటరిగా ఉండిపోయిన వ్యక్తి మా నాన్న. స్వాతంత్ర్య పోరాటం కాలంలో పత్రిక నడిపారని నాన్ననూ, అమ్మనూ కూడా జైల్లో పెట్టారట. అప్పుడు అమ్మకు ఏడో నెల. నేను కడుపులో ఉన్నాను. జైల్లోనే నొప్పులు మొదలుకావడంతో... ఇంటికి తీసుకువెళ్లమన్నారట. వేలూరు సీఎంసీ ఆసుపత్రిలో కష్టం మీద కాన్పు అయిందట. వారం రోజులకే మళ్లీ తీసుకువెళ్లి అమ్మను జైల్లో పడేశారట. 1947 ఆగస్టు 1న నేను పుట్టాను. 15న దేశానికి వచ్చింది. అమ్మా, నాన్నా విడుదలయ్యారు. అప్పటికే అమ్మకు జైల్లో ఇన్‌ఫెక్షన్ సోకింది. మళ్లీ గర్భవతి అయింది. ఏడో నెలలోనే పుట్టిన బిడ్డ పురిటిలోనే పోయిందట. అమ్మ కొన్ని రోజులకు కన్నుమూసింది. అప్పటికి నాన్నకు పాతికేళ్లయినా లేవు. చెప్పులు కూడా లేకుండా ఒక పల్లె నుంచి మరో పల్లెకు నడిచి తిరుగుతూ ఉండేవాడు. కరువు రోజుల్లో ఒకసారి విరేచనాలు, వాంతులతో పసిబిడ్డనైన నేను ప్రాణాపాయ స్థితిలో ఉంటే... ప్రజల ఆకలి తీర్చడానికి గంజి కేంద్రాలకు వెళ్ళిపోయారట. ఆయనకు నీడలా పెరిగిన దాన్ని నేను. మరి నా కథ అంటే ఆయన కథే కదా!

మీ నాన్నగారికి... ఎంపీ టికెట్టు ఇవ్వకపోవడం మిమ్మల్ని బాగా కలతపెట్టినట్టుంది. మీ స్వీయచరిత్రలో పదేపదే ప్రస్తావించారు?

ఇందిరాగాంధీ దగ్గరకు కూడా నేరుగా వెళ్లగలిగిన స్వతంత్రం ఆయనకు ఉండేది. కేంద్రమంత్రులు 'రాజన్నా' అంటూ అభిమానంగా గౌరవించేవారు. బహుశా ఇదే రాష్ట్ర నాయకుల్లో నిశ్శబ్దంగా భయాన్నీ, ఆయనపై వ్యతిరేకతనూ పెంచింది. ఆయన గురువులూ, ఆయన శిష్యులూ కూడా చాప కింద ఎసరు పెట్టారు. ఇందిరాగాంధీ హత్య తర్వాత అధికారం చేపట్టిన రాజీవ్‌గాంధీకి రాష్ట్ర రాజకీయాల పట్ల అప్పటికి అవగాహన లేకపోవడంతో నాన్నకు అన్యాయం జరిగింది.

దీని గురించి మీరు కోట్ల విజయభాస్కర్‌రెడ్డిని, చెన్నారెడ్డిని, చివరకు అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీని కూడా నిలదీశారు కదా!

అవును. తనకు ద్రోహం చేసిన వారిని కూడా తప్పుపట్టని స్వభావం నాన్నది. నేను ఆయనలా కాదు. ఆయన కోసం నేను ఎవరినైనా కలుస్తానంటే ఆయన ఒప్పుకోరు. అందుకే నాకే టికెట్ కావాలనే సాకుతో అందరినీ కలిశాను. నాన్నకు చిత్తూరు ఎంపీ టికెట్ ఎందుకు ఇవ్వలేదు? అని అడిగాను. అందరూ ఒకే కారణం చెప్పారు... 'చంద్రబాబు వల్ల' అని. చంద్రబాబును కాంగ్రెస్‌లో నాన్న ప్రోత్సహించారు. చాలామంది వ్యతిరేకించినా మంత్రిని చేశారు. చంద్రబాబు ఆ తరువాత ఎన్టీయార్ దగ్గరకు వెళ్లిపోయారు. "ఎన్టీయార్‌కు రాజకీయ అనుభవం లేదు. చంద్రబాబు వల్లే తెలుగుదేశం బలపడుతోంది. ఆయన (మా నాన్న) శిష్యుడిని ఆపలేకపోయారు" అనేది వాళ్లందరూ చెప్పిన కారణం. అయితే 'చంద్రబాబు కేవలం సాకు మాత్రమే' అని నాకు తెలుసు. నాన్న పేరు ప్రతిష్ఠలు మరింత పెరగడం తమ ఉనికికి ప్రమాదమని అప్పటి నాయకులు చాలామంది భయపడ్డారు. చివరకు ఆచార్య రంగాగారు వారించినా వినకుండా రాజీవ్ గాంధీని నిలదీశాను.

చంద్రబాబు, రాజశేఖరరెడ్డి.... వీరిద్దరి రాజకీయ వ్యవహారశైలిని తప్పు పడుతూ రాశారు. కానీ ఆ సందర్భాల తరువాత కూడా ఆ ఇద్దరితోనూ మీరు సఖ్యతగానే ఉన్నారు. ఎలా సాధ్యం?

'రాజశేఖర్‌రెడ్డి ముందు ఎలా ఉండేవారో కానీ... సీఎం అయ్యాక ఎన్నడూ ఎవరిపట్లా కక్షగా వ్యవహరించలేదు. నేను విన్న రాజశేఖరెడ్డి వేరు, నేను చూసిన రాజశేఖరరెడ్డి వేరు.



తల్లిలేని బాల్యం, ఇల్లొదిలి ప్రజల్లో తిరిగే నాన్న, ఆడపిల్లను అదుపులో పెంచాలని చూసే నానమ్మ, రక్షణ గోడల్లా నిలిచే అత్తలు... ఆటలు.. భారతాలు... ఎన్జీరంగా తాతయ్య ఇంట్లో ఉండి సాగించిన చదువు... ఎన్నికల్లో నాన్న కోసం తిరిగిన పల్లెలు... ఒక సాధారణ రైతుబిడ్డ రామచంద్రనాయుడుతో పెళ్లి... అమెరికా ప్రయాణం... ఉద్యోగం కోసం అగచాట్లు... ఈ ఘట్టాలన్నీ గల్లా అరుణ కుమారి కథన శైలి వల్ల ఒక నవలలా సాగిపోతాయి. పీయూసీ చదువుకే పరిమితమైన అరుణ.. అమెరికాలో భర్త ప్రోత్సాహంతో చదువు కొనసాగించారు. కంప్యూటర్స్ విద్యను అభ్యసించి, క్రిస్లర్ కార్ల కంపెనీలో 9 ఏళ్లకు పైగా ఉద్యోగం చేయడం, జర్మన్, రష్యన్ భాషలు కూడా నేర్చుకోవడం ఆమెలోని పట్టుదలకు నిదర్శనం. ఇండియాలో పెట్టే పరిశ్రమ కోసం వచ్చిన అరుణకుమారి యాదృచ్ఛికంగా రాజకీయాల్లో ప్రవేశించారు. సుఖవంతమైన అమెరికా జీవితాన్ని కాదనుకుని, సొంత నేల మీద పరిశ్రమ పెట్టి, వేలాది మందికి ఉపాధి కల్పించినా ఆ కుటుంబం రాజకీయ కారణాలవల్ల ఒడుదొడుకులను ఎదుర్కోక తప్పలేదు. ఇరవై ఏళ్ల ఎమ్మెల్యేగా, మూడు పర్యాయాలు మంత్రిగా ఉన్నా ఆమెకు, రాజకీయాల్లోకి వచ్చిన ఆమె కుమారుడు జయదేవ్‌కు నిరంతర పోరాటం అనివార్యమయింది. వీటన్నిటినీ గల్లా అరుణకుమారి తన స్వీయచరిత్రలో నమోదు చేశారు. ఇది రాజకీయాలకు వీడ్కోలు చెప్పి, తను పుట్టిన దిగువమాఘం పల్లెలో కట్టుకున్న కొత్త ఇంట్లో భర్త రామచంద్రనాయుడితో విశ్రాంత జీవితం గడుపుతున్న గల్లా అరుణకుమారి కథ మాత్రమే కాదు, ఆత్మలేని రాజకీయాల తీరును జనం కళ్ల ముందు నిలబెట్టిన కథ.

ముఖ్యంగా రోజాను పార్టీలో చేర్చుకొనేటప్పుడు మీరు చాలా కఠినంగా వ్యవహరించారు కదా...

నా మనసుకు ఏమనిపించిందో అదే మాట్లాడాను. అలాగే వ్యవహరించాను.

రోజా విషయంలో మిమ్మల్ని ఆయన కన్విన్స్ చేసినట్టున్నారు కదా?

(నవ్వుతూ) కన్విన్స్ చేశానని ఆయన అనుకున్నారు.

'చంద్రబాబు టీడీపీలోకి వెళ్లిపోయినా నాన్న తప్పుపట్టలేదు. కానీ మీ నాన్న గారు ఆసుపత్రిలో ఉంటే పలకరించలేదు' అని రాశారు. మీకు కోపం రాలేదా? పైగా ఆ తర్వాత చంద్రబాబుకు రాజకీయంగా మీరు సన్నిహితులయ్యారు కూడా...

మేము అమెరికాలో ఉన్నపుడు నాన్న ఉత్తరాల్లో చంద్రబాబు గురించి రాసేవారు. "ఈసారి నువ్వు ఇండియాకి వచ్చేప్పటికి నీకో తమ్ముడుంటాడు ఇక్కడ" అని. చంద్రబాబుతోనూ "అమెరికాలో నీకో అక్క ఉంది" అని చెప్పేవారట. చంద్రబాబే నాతో ఆ విషయం చెప్పారు. అలా ఆయన పట్ల సోదర భావం నాలో పెరుగుతూ వచ్చింది. రోశయ్యగారితో సహా మావాళ్లు ఆయనకు వ్యతిరేకంగా అసెంబ్లీలో మాట్లాడాలని ఒత్తిడి చేసినా... "నాకు తెలియని విషయాల గురించి నేను మాట్లాడను" అని తిరస్కరించాను. అయితే చంద్రబాబునూ వ్యతిరేకించాల్సినపుడు గట్టిగానే వ్యతిరేకించాను.

మూడు తరాల రాజకీయాలు చూశారు. మీకేమనిపిస్తోంది?

భవిష్యత్తును తలచుకుంటేనే భయం వేస్తోంది.

రాజకీయాల్లో వివాదాల పుట్టను కదిలిస్తున్నారేమో?

నేను ఫేస్ చేయగలను.

కొన్ని అంశాలు కొందరు నాయకుల్ని బాధపెడతాయేమో?

నేను చేయగలిగిందేమీ లేదు. ఎవరినైనా బాధపెట్టడానికో, కించపరచడానికో నేనిది రాయలేదు. జరిగిన సంఘటనలను యథాతథంగా వివరించాను.

సెల్ఫ్ ఎడిటింగ్ చేసుకోవాలనిపించలేదా?

అలాంటప్పుడు రాయడం ఎందుకు?

● ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు

నవ్య | చిత్రజ్యోతి

పెళ్లి చేసుకున్న అమీ జాక్సన్



హీరోయిన్ అమీ జాక్సన్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. హాలీవుడ్ నటుడు ఎడ్ వెస్ట్‌విక్‌తో ఏడడుగులు వేశారు. వీరి వివాహం ఇటలీలో ఘనంగా జరిగింది. పెళ్లి వేడుకకు సంబంధించిన ఫొటోలను వారు ఆదివారం ఇన్‌గ్రామ్‌లో పోస్ట్ చేసి.. "ప్రయాణం ఇప్పుడే మొదలైంది" అని పేర్కొన్నారు. కాగా, అమీ జాక్సన్ గతంలో ఇంగ్లాండ్‌కు చెందిన జార్జ్ అనే వ్యక్తితో కొంతకాలం లివింగ్ రిలేషన్‌లో ఉండి.. ఓ బిడ్డను కూడా కన్నారు. 2022లో వారు విడిపోయారు.

మ్యూజిక్ లవర్స్‌ని అలరించేలా...



సంబీత్ ఆచార్య, జో శర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'ఎమ్4ఎమ్'. మోహన్ వడ్లపట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. తాజాగా, ఈ సినిమాలోని మ్యూజిక్‌పై ఓ స్పెషల్ వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మోహన్ మాట్లాడుతూ "ఈ సినిమా మ్యూజిక్ లవర్స్‌ని అలరిస్తుంది. అందరికీ నచ్చే అంశాలు పుష్కలంగా సినిమాలో ఉన్నాయి" అని చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి.

ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు



తెలుగు చిత్ర పరిశ్రమలోని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన ఇండస్ట్రీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ప్రధాన కార్యదర్శిగా అమ్మిరాజు కానుమిల్లి విజయం సాధించారు. సినీ కార్మికుల సమస్యలను పరిష్కరించి వారికి అండగా ఉంటానని ఆయన తెలిపారు.

ప్రేమంటే త్యాగం



సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండే నటీమణుల్లో సమంత ఒకరు. తాజాగా, ఆమె ప్రేమ గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్ట్ పెట్టారు. "చాలా మంది ప్రేమ.. స్నేహం అంటే ఇచ్చిపుచ్చుకోవడం అనుకుంటారు. ఈ విషయాన్ని నేనూ అంగీకరిస్తాను. కానీ నిజమైన ప్రేమంటే.. కొన్నిసార్లు అవతలి వ్యక్తి మనకు ప్రేమనివ్వలేని స్థితిలో ఉన్నా.. మనం ప్రేమనందించాలి అని నేర్చుకున్నాను" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. "ప్రేమంటే త్యాగం కూడా. పరిస్థితులకనుగుణంగా అది మారిపోతుండొచ్చు. నేను తిరిగి ప్రేమనందించలేకపోయినా.. నన్ను నిరంతరం ప్రేమించే అభిమానులకు రుణపడి ఉంటాను" అని అదే పోస్ట్‌లో పేర్కొన్నారు. సమంత నటించిన 'సిటాడెల్' వెబ్‌సిరీస్ ఇండియన్ వెర్షన్ 'హనీ బన్నీ' త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది. అలాగే ఆమె నటిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం సెట్స్‌పై ఉంది.

పదవులకి రాజీనామా చేసిన సిద్ధిఖీ.. రంజిత్





మలయాళ చిత్ర పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై జస్టిస్ హేమ కమిటీ రిపోర్ట్ వెలువడినప్పటినుంచి.. పలు దర్శక, నిర్మాతలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న దర్శక నిర్మాతలు తమ పదవులకి రాజీనామా చేశారు. మలయాళ నటుడు, నిర్మాత, మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి సిద్ధిఖీ లైంగికంగా వేధించారని నటి రేవతి సంపత్ ఆరోపించిన నేపథ్యంలో.. ఆయన తన పదవికి రాజీనామా చేశారు. మరోవైపు, మలయాళ దర్శకుడు రంజిత్ బాలకృష్ణన్ కేరళ చలనచిత్ర మండలి అధ్యక్షుడి పదవికి రాజీనామా చేశారు. ఇటీవలే బెంగాలి నటి శ్రీలేఖ మిత్ర.. తనతో ఆయన అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన రాజీనామా నిర్ణయం తీసుకున్నారు. "నటి శ్రీలేఖ నాపై చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదు. నిజానికి ఈ విషయంలో అసలు బాధితుడ్ని నేను. నాపై వస్తున్న ఆరోపణలను చట్టపరంగా ఎదుర్కొని.. నా తప్పు లేదని నిరూపించుకుంటా" అని ఓ టెలివిజన్ చానల్‌కు పంపిన ఆడియో రికార్డ్‌లో పేర్కొన్నారు.

సిట్ ఏర్పాటు

మలయాళ చిత్ర పరిశ్రమలోని ప్రముఖులపై వరుస ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ విషయాలపై విచారణ చేయడానికి ఓ స్పెషల్ కమిటీని కేరళ ప్రభుత్వం నియమించింది. దీనిపై విచారణ జరిపి వీలైనంత తొందరలో నివేదిక అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

సుబ్బమ్మ సందేశం



చక్కని సందేశంతో పాటు ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందుతున్న చిత్రం 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ'. కిరణ్ దర్శకత్వంలో మంద మల్లికార్జున్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం చిత్రీకరణ ప్రారంభమైంది. తొలి షాట్‌కు మల్లికార్జున రెడ్డి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తుంది' అన్నారు. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులను ఈ చిత్రం ఆకట్టుకుంటుందని దర్శకుడు తెలిపారు. శ్యామ్ సెల్వన్, హస్విక హీరో హీరోయిన్లు. సంగీతం: చరణ్ అర్జున్, సినిమాటోగ్రఫీ: గాజుల శివ.

పొల్లాచ్చిలో ప్రేమ గీతం



వెంకటేశ్ హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం షూటింగ్ కొత్త షెడ్యూల్ ప్రస్తుతం పొల్లాచ్చిలో జరుగుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్‌కు జోడీగా ఐశ్వర్యారాజేశ్ నటిస్తున్నారు. భార్యభర్తల అనుబంధం నేపథ్యంలో సాగే పాటను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించారు. ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు. మీనాక్షి చౌదరి కీలకపాత్ర పోషిస్తున్నారు. దిల్‌రాజు సమర్పణలో శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

సెప్టెంబర్‌లో చిన్న కథ



రానా దగ్గుబాటి సమర్పణలో ప్రియదర్శి కథానాయకుడిగా నటిస్తున్న '35 చిన్న కథ కాదు' చిత్రం విడుదల తేదీ ఖరారైంది. సెప్టెంబర్ 6న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి తెలిపారు. నందకిశోర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నివేదా థామస్ కథానాయిక.

సారంగపాణి జాతకం

ప్రియదర్శి హీరోగా మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. జాతకాల నేపథ్యంలో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి 'సారంగపాణి జాతకం' అనే టైటిల్‌ను ఖాయం చేసి, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను యూనిట్ విడుదల చేసింది. జంధ్యాల గారి తరహా వినోదాన్ని పంచే చిత్రమిదని నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ అన్నారు. కుటుంబంతో హాయిగా చూడగలిగే హాస్య సంబరం ఈ సినిమా అని మోహనకృష్ణ చెప్పారు. ఈ చిత్రంలో రూప కొడువాయుర్ కథానాయిక. సంగీతం: వివేక్ సాగర్.

నాన్‌స్టాప్‌గా నవ్వించే చిత్రం




చిమటా రమేశ్‌బాబు కథానాయకుడిగా నటిస్తూ, దర్శకత్వం వహించిన చిత్రం 'నేను కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. సినిమా ఈ నెల 30న విడుదలవుతున్న సందర్భంగా హీరో రమేశ్, హీరోయిన్ మేఘన మీడియాతో ముచ్చటించారు. "ఇదో విభిన్న తరహా చిత్రం. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది. అందరినీ నాన్‌స్టాప్‌గా నవ్విస్తుంది" అని హీరో రమేశ్ అన్నారు. "ఈ సినిమాలో నా పాత్ర చాలా బాగుంటుంది. ప్రేక్షకులు ఈ సినిమాను ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని హీరోయిన్ మేఘన చెప్పారు.

వేట మొదలైంది



తేజస్ వీరమాచినేని, అక్షయ రోమి జంటగా, బన్నీ అశ్వంత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రానికి 'రాజా మార్కండేయ' అనే టైటిల్ ఖరారైంది. 'వేట మొదలైంది' అనేది ట్యాగ్‌లైన్. ఆదివారం చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో సుమన్ ముఖ్య అతిథిగా పాల్గొని, సినిమా ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. చిత్రీకరణ చివరి దశలో ఉందని నిర్మాతలు శ్రీధర్ సామా, వెంకట్ గౌడ్ పంజా తెలిపారు.



"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేకసార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఉమ్మడి పౌరస్మృతి
'ఒకే దేశం - ఒకే చట్టం'

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తి హక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, టర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.

పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్శీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.


ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్ల లోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

రీజనింగ్

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణా కాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీనలకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు.

మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

తెలంగాణలో విద్య, నైపుణ్యం

టీజీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

మానవాభివృద్ధికి విద్య చక్కటి సాధనం. పేదరిక నిర్మూలన, ఆరోగ్యాభివృద్ధి, లింగపరమైన సమానత్వ సాధన, శాంతి-సుస్థిరత సాధన, పర్యావరణ సమతుల్యతను, రాజకీయ సుస్థిరతను బలోపేతం చేయడంలో, సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించడం, అందరినీ కలుపుకునిపోయే సమ్మిళిత వృద్ధిలో ఉపయోగపడే ప్రధాన సాధనాల్లో విద్య ముందు వరుసలో ఉంటుంది.

ఐక్యరాజ్య సమితి రూపొందించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 సంవత్సరం నాటికి దేశాలు వందశాతం యువ అక్షరాస్యతను సాధించాల్సి ఉన్నది.

2019-20లో జరిగిన అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం తెలంగాణలో అక్షరాస్యత 73.4 శాతంగా ఉంది. పురుషుల్లో 82 శాతం, మహిళల్లో 64.8 శాతం అక్షరాస్యత ఉంది. 2009లో చేసిన ఉచిత, నిర్బంధ విద్యాచట్టం ప్రకారం ఆరు నుంచి 14 సంవత్సరాల వయసు పిల్లలందరికీ ఉన్నత స్థాయి నాణ్యమైన విద్యను అందించాలి.

పాఠశాల విద్య

తెలంగాణలో 'సమగ్ర శిక్షా' కార్యక్రమం ద్వారా మూడు నుంచి అయిదు సంవత్సరాల పిల్లలకు శిశు విద్య, ఆరు నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ప్రాథమిక విద్య 14 నుంచి 18 సంవత్సరాల పిల్లలకు సెకండరీ విద్యను అందరికీ అందుబాటులో ఉంచడంతోపాటు వివిధ సంస్థల ద్వారా ఎప్పటికప్పుడు శిక్షణను అందిస్తూ ఉపాధ్యాయుల బోధనా నాణ్యతను పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేయడంతోపాటు ఉన్నతస్థాయి నాణ్యమైన సెకండరీ పాఠశాలలను నెలకొల్పుతున్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో 194 ఆదర్శ పాఠశాలలను ఉన్నతస్థాయి అవస్థాపనా సౌకర్యాలతో నిర్వహిస్తున్నారు.

2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని వివిధ విద్యాలయాలకు సంబంధించిన గణాంక సమాచారం కిందివిధంగా ఉంది.

రాష్ట్రంలో మొత్తం 40,656 పాఠశాలలున్నాయి. ఇందులో 10,478 పూర్తిగా ప్రైవేటురంగంలో ఉన్నాయి. 642 పాఠశాలలు ప్రభుత్వ సహాయం పొందుతున్న ప్రైవేటు పాఠశాలలు, 52 పాఠశాలలు కేంద్రప్రభుత్వ సంబంధిత పాఠశాలలు కాగా మిగతావన్నీ రాష్ట్రప్రభుత్వ సంబంధిత పాఠశాలలు. మొత్తం పాఠశాలల్లో 58,98,686 మంది విద్యార్థులు నమోదయ్యారు. అయితే మొత్తం విద్యార్థుల్లో 51 శాతం కంటే ఎక్కువగా ప్రైవేటురంగం పాఠశాలల్లో నమోదై ఉండటం గమనార్హం. రాష్ట్రంలోని మొత్తం పాఠశాలల్లో 2,69,776 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఇందులో 1,43,258 మంది ప్రైవేటు పాఠశాలల్లో ఉన్నారు.



యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ

2024 జూలై 8న జరిగిన ఒక సమావేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి స్కిల్ యూనివర్సిటీని నెలకొల్పే ఉద్దేశ్యాన్ని వెల్లడించారు. ఆగస్టు 1న 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'కి శంకుస్థాపన చేశారు. ఇందులో నైపుణ్యం అందించే వివిధరకాల కోర్సులను బోధిస్తారు. 2024-25 విద్యా సంవత్సరంలో రెండువేలమంది విద్యార్థులకు, రాబోయే సంవత్సరం పదివేల మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించే ఈ 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ' కోసం రాష్ట్రప్రభుత్వం రూ.100 కోట్లను విడుదల చేసింది. ఆగస్టు 5న మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రాను 'యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ'కి నియమించారు. హైదరాబాద్‌కు దగ్గరలోని కందుకూరు మండలంలోని మీర్‌ఖాన్‌పేటలో ఈ వర్సిటీ క్యాంపస్ నిర్మాణం కానుంది. పబ్లిక్ - ప్రైవేటు భాగస్వామ్యం(పీపీపీ) తో ఈ యూనివర్సిటీ ఏర్పాటు, నిర్వహణ జరుగుతుంది.

ఆంగ్ల మాధ్యమంలో ప్రభుత్వ పాఠశాలలు

2022-23 విద్యాసంవత్సరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమాన్ని ఆరంభించారు. 2024-25 సంవత్సరం నాటికి పదో తరగతికి కూడా ఆంగ్ల మాధ్యమాన్ని ఆరంభిస్తారు. ఆంగ్లంలో ఉపాధ్యాయుల నైపుణ్యాన్ని పెంచడానికి అజిం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ద్వారా 80,564 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇప్పించారు.

అవస్థాపనా సౌకర్యాల అభివృద్ధి

పాఠశాలల్లో నిరంతర నీటిసరఫరా కలిగిన మరుగుదొడ్ల నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, సురక్షిత తాగునీరు ఉండాలి. ఫర్నిచర్, పెయింటింగ్, మరమ్మత్తులు, గ్రీన్-చాక్ బోర్డులు, ప్రహరీగోడల నిర్మాణం, కిచెన్‌షెడ్‌ల నిర్మాణం, నూతన అదనపు గదుల నిర్మాణం, భోజనశాలల నిర్మాణం, డిజిటల్ తరగతి గదుల ఏర్పాటు మొదలైన అవస్థాపనా సౌకర్యాల కోసం రాష్ట్రంలో 26,065 ప్రభుత్వ పాఠశాలలను గుర్తించారు. రూ.7,289.54 కోట్లతో ఈ సమగ్ర అవస్థాపన సౌకర్యాలను మూడు సంవత్సరాల కాలంలో ఈ పాఠశాలల్లో కల్పించే ప్రయ త్నం చేస్తున్నారు.

ప్రధానమంత్రి పోషణ పథకం

రాష్ట్రంలోని పాఠశాలల్లో ప్రధానమంత్రి పోషణ పథకం కింద మధ్యాహ్న భోజన పథకాన్ని అమలుపరుస్తున్నారు. 2003 సంవత్సరంలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఒకటి నుంచి అయిదో తరగతి పిల్లలకు, 2008-09 నుంచి ఆరో తరగతి నుంచి పదో తరగతి పిల్లలకు కూడా పథకాన్ని వర్తింపచేశారు. రాష్ట్రంలో 23,05,801 మంది విద్యార్థులు నమోదైన 28,807 ప్రభుత్వ పాఠశాలల్లో ఈ పథకం అమలు జరుగుతున్నది.

పాఠశాలల్లో రాగి అంబలి

2023-24 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 27,147 పాఠశాలల్లో అదనపు పౌష్టికాహారం అందించే లక్ష్యంతో వారంలో మూడు రోజులు 'రాగి అంబలి'ని ఉదయం ప్రార్థనకు ముందు విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని ఆరంభించారు. రాష్ట్రప్రభుత్వం, శ్రీసత్యసాయి ట్రస్టులు సమానంగా ఈ కార్యక్రమ ఖర్చును భరిస్తున్నాయి.

సాంకేతిక విద్య

ఆల్ ఇండియా సాంకేతిక విద్యామండలి దార్శనికతతో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ రాష్ట్రంలో సాంకేతిక విద్యా నిర్వహణను చూస్తోంది. ఇంజనీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ, పాలిటెక్నిక్ కళాశాలల స్థాపన, నిర్వహణను ఇది పర్యవేక్షిస్తోంది. రాష్ట్రంలోని 56 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యాశాఖ పర్యవేక్షిస్తున్నది. ఈ కళాశాలల్లో చదివే 12,000 మంది విద్యార్థుల్లో ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే కావడం గమనార్హం.



ఆదర్శ పాఠశాలలు

విద్యాపరంగా వెనుకబడిన ప్రాంతాల్లో ఆరువేల ఆదర్శ పాఠశాలలను నెలకొల్పాలనే కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా రాష్ట్రంలో 194 ఆదర్శ పాఠశాలలు ఉన్నాయి. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతుంది.

ఉన్నతస్థాయి విద్యావంతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను ఆంగ్ల మాధ్యమంలో అందిస్తున్నారు. 2023-24 సంవత్సరంలో 1,21,346 మంది విద్యారులు రాష్ట్రంలోని ఆదర్శ విద్యాలయాల్లో నమోదయ్యారు.

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట

బడి ఈడు పిల్లలందరూ బడిలోనే ఉండాలనే లక్ష్యంతో బడి మానిన పిల్లలను, నూతనంగా బడిలో చేరాల్సిన వయసు గల పిల్లలను బడిలో చేర్పించే లక్ష్యంతో రాష్ట్రంలో 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమాన్ని అమలుపరుస్తున్నారు. 2024-25 సంవత్సరంలో 2024 జూన్ 6 నుంచి జూన్ 19 వరకు ఈ కార్యక్రమాన్ని అమలుచేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యం, విద్యాలయాల్లో గల సౌకర్యాలపై అవగాహన కల్పించి పాఠశాలల ఎన్‌రోల్‌మెంట్ పెంచే ప్రయత్నం చేస్తారు.

అమ్మ ఆదర్శ పాఠశాల

ప్రభుత్వ పాఠశాలల్లో అవస్థాపనా సౌకర్యాలను మెరుగుపర్చడం కోసం 'అమ్మ ఆదర్శ పాఠశాల' కార్యక్రమాన్ని ప్రభుత్వం ఆరంభించింది. ఈ కార్యక్రమం కింద పాఠశాలల్లో ఉన్నతస్థాయి సౌకర్యాలు ఉండటంతోపాటు వాటి సమర్థ నిర్వహణ ఉండేట్టు చూస్తారు. అందుకు స్థానిక స్వయం సహాయ బృందాలకు చెందిన మహిళలు సభ్యులుగా 'అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ'లు ఏర్పాటుచేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం(2024-25)లో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన 21,19,439 పాఠశాల యూనిఫారాలను కుట్టి అందించే బాధ్యతను స్వయం సహాయ బృందాల సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమం ద్వారా దాదాపు 30 వేల మంది మహిళలు ప్రయోజనం పొందారు. ఒక్కో యూనిఫాంకు ఇచ్చే గౌరవ చెల్లింపు మొత్తాన్ని కూడా రూ.50 నుంచి రూ.75లకు పెంచడం జరిగింది.

ప్రతి మండలానికి అంతర్జాతీయ స్థాయి ప్రభుత్వ పాఠశాల

ప్రతి మండలంలో అన్నిరకాల ఆధునిక వసతులతో కూడిన అంతర్జాతీయ స్థాయి పాఠశాలలను నెలకొల్పడం రాష్ట్రప్రభుత్వ సమగ్ర విద్యా సంస్కరణల్లో భాగమని, అందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నదని 2023-24 రాష్ట్ర సాంఘిక, ఆర్థిక ముఖచిత్రం పేరిట వెలువడే ఆర్థికసర్వేలో పేర్కొన్నారు.

ఇంటర్ విద్య

తెలంగాణ ఇంటర్మీడియెట్ విద్య బోర్డుతో తెలంగాణలో ఇంటర్మీడియెట్(10+2) విద్య నిర్వహణ జరుగుతుంది. 2023-24 సంవత్సరంలో 4,180 ఇంటర్మీడియెట్ కళాశాలలు ఉండగా, వాటిలో ప్రవేశ సామర్థ్యం 9,77,537. కాగా 2023-24లో నమోదైన విద్యార్థుల సంఖ్య 4,77,266. దానిలో విద్యార్థినుల సంఖ్య 2,39,913.



ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకం

రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా 119 పాఠశాలల్లో ఆరంభమైన ఈ పథకం ప్రస్తుతం 27,147 పాఠశాలల్లో, 23,05,801 మంది విద్యార్థులకు వర్తిస్తోంది.

కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు

సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సామాజిక వర్గాలకు చెందిన బాలికలకు ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు నాణ్యమైన విద్యను అందించడం 'సమగ్ర శిక్షా' కార్యక్రమ లక్ష్యాల్లో ఒకటి. అందుకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలను నెలకొల్పారు. దేశంలోనే ఎక్కువ(479) కేజీబీవీలు రాష్ట్రం స్థాపించారు. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాలను మినహాయిస్తే మిగతా 31 జిల్లాల్లో ఈ పాఠశాలలు పనిచేస్తున్నాయి. అందులో 283 ఇంటర్మీడియెట్ విద్యను కూడా అందిస్తున్నాయి. మొత్తం 1,24,153 మంది బాలికలు ఈ పాఠశాలల్లో నమోదు అందులో 24,730 మంది బాలికలు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థుల నమోదులో కూడా దేశంలోనే తెలంగాణ ప్రథమస్థానంలో ఉండటం గమనార్హం.



కళాశాల విద్య

రాష్ట్రంలో 146 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అందులో 22 కళాశాలలు స్వయం ప్రతిపత్తిని పొందాయి. 94 కళాశాలలు న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) గుర్తింపు పొందాయి. 2023-24లో 48,954 మంది విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశం పొందారు. అలాగే ప్రభుత్వం నూతనంగా 13 డిగ్రీ కళాశాలలను నెలకొల్పింది. దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

అక్షరాస్యత

2011 సంవత్సరంలో జరిగిన జనాభా లెక్కల ప్రకారం తెలంగాణలో అక్షరాస్యత 66.54 శాతం. అయితే 2019-20లో జరిగిన అయిదో జాతీయ కుటుంబ ఆరోగ్యసర్వే ప్రకారం రాష్ట్రంలో అక్షరాస్యత 73.4 శాతం. అలాగే 14 నుంచి 18 సంవత్సరాల మధ్య వయసు గల వారిలో విద్యాలయాలు లేదా శిక్షణా సంస్థల్లో లేనివారు 22.1 శాతం ఉన్నారు. జాతీయంగా వీరు 13.2 శాతం మాత్రమే ఉండటం గమనార్హం. బాలురలో 26 శాతం, బాలికల్లో 17.4 శాతం విద్యాలయాల్లో ప్రవేశం పొందలేదు. 17 నుంచి 18 సంవత్సరాల వయసు గల వారిలో 40.1 శాతం విద్యాలయాలకు బయట ఉన్నారు.

నైపుణ్య అభివృద్ధి

నిరుద్యోగ సమస్య పరిష్కరించడానికి నైపుణ్య అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా 2024 జూన్ 18న హైదరాబాద్‌లోని మల్లేపల్లి ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం(ఐటిఐ)లో అధునాతన సాంకేతిక కేంద్రం(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్-ఏటీసీ)కు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలోని 65 ఐటీఐలను ఏటీసీలుగా అభివృద్ధి చేయనున్నారు. టాటా టెక్నాలజీతో కలిసి రూ.2,700 కోట్లతో నిరుద్యోగ సమస్యను పరిష్కరించేవిధంగా యువతలో నైపుణ్య అభివృద్ధికి ఈ కేంద్రాల్లో శిక్షణనిస్తారు.



డా.ఎం.ఏ.మాలిక్
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకనామిక్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చేవెళ్ల

బిజినెస్

హైదరాబాద్ ● సోమవారం 26 ఆగస్టు 2024

మరిన్ని 'టెక్' కొనుగోళ్లకు సిద్ధం

కొన్ని కంపెనీలతో చర్చలు షురూ

ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్



న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మరిన్ని కొనుగోళ్లకు సిద్ధమవుతోంది. ఈ కొనుగోళ్ల డేటా అనలిటిక్స్, సాఫ్ట్‌వేర్ యాజ్ ఏ సర్వీస్ (సాస్) వంటి రంగాలకు సంబంధించినవని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ చెప్పారు. ఇలాంటి కంపెనీలు అమెరికా, యూరప్ దేశాల్లో ఉన్నా కొనుగోళ్లకు వెనుకాడేది లేదన్నారు. ఇందుకోసం ఒక్కో కంపెనీ కొనుగోలుకు గతంలోలానే 45 కోట్ల డాలర్ల వరకు ఖర్చు చేసేందుకూ సిద్ధంగా ఉన్నట్టు ఆయన చెప్పారు. ఇన్ఫోసిస్ ఈ ఏడాది జనవరిలో మన దేశానికే చెందిన ఇన్‌సెమీ టెక్నాలజీ సర్వీసెస్ అనే సెమీకండక్టర్ డిజైన్ సర్వీసెస్ కంపెనీని రూ.280 కోట్లకు కొనుగోలు చేసింది. మళ్లీ ఏప్రిల్‌లో జర్మనీకి చెందిన ఇన్‌టెక్ హోల్డింగ్ అనే ఇంజనీరింగ్ ఆర్ అండ్ డీ సర్వీసెస్ కంపెనీని 45 కోట్ల డాలర్లకు (సుమారు రూ.4,045 కోట్లు) కొనుగోలు చేసింది. తమ వ్యాపార ప్రయోజనాలకు దోహదం చేసే కొన్ని కంపెనీలను ఇప్పటికే గుర్తించి, చర్చలు కూడా జరుపుతున్నట్టు పరేఖ్ తెలిపారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చేందుకు ఎంత కాలం పడుతుందనే విషయాన్ని మాత్రం తాను చెప్పలేనన్నారు.

'ఏఐ'తో కొలువులకు ధోకా లేదు

జెనరేటివ్ ఏఐ వంటి కొత్త టెక్నాలజీల కారణంగా ఉద్యోగాలు పోతాయన్న భయాల్ని సలీల్ పరేఖ్ కొట్టివేశారు. తమ కంపెనీలో అలాంటి పరిస్థితి వస్తుందని కూడా తాను అనుకోవడం లేదన్నారు. తమ క్లయింట్లలో అనేక మంది ఇప్పటికే ఈ సరికొత్త టెక్నాలజీలపై ఆసక్తి చూపిస్తున్నట్టు తెలిపారు. ఐటీ రంగంలో ముందు ముందు ఈ టెక్నాలజీల వినియోగం మరింత పెరుగుతుందని పరేఖ్ తెలిపారు

యూజియా ఫార్మాపై ఎఫ్‌డీఏ కొరడా

హైదరాబాద్: అరబిందో ఫార్మా అనుబంధ సంస్థ యూజియా ఫార్మా స్పెషాలిటీస్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) కొరడా ఝుళిపించింది. హైదరాబాద్ సమీపంలోని పటాన్‌చెరు ప్రాంతంలోని యూజియా ప్లాంటులో ఎఫ్‌డీఏ అధికారులు ఈ ఏడాది జనవరి 22 నుంచి ఫిబ్రవరి 2 వరకు విస్తృతంగా తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఔషధాల ఉత్పత్తి, తయారీ ప్రక్రియకు సంబంధించిన వివరాలు (డేటా) సక్రమంగా నమోదు చేయడం లేవని గుర్తించారు. ఈ లోపాలను ఎలా సరిదిద్దుతారో 15 రోజుల్లో తెలియజేయాలని ఎఫ్‌డీఏ కోరింది. లేకపోతే ఈ ప్లాంటులో ఉత్పత్తి చేసే ఔషధాలపై వేటు తప్పదని హెచ్చరించింది. కంపెనీ మాత్రం ఈ లేఖ ప్రభావం ప్రస్తుత ఉత్పత్తులపై ఏ మాత్రం ఉండదని తెలిపింది.

సెబీ ఉత్తర్వులపై కోర్టుకు అనిల్ అంబానీ?



న్యూఢిల్లీ: రిలయన్స్ గ్రూప్ అధినేత అనిల్ అంబానీ ఇప్పట్లో దారికొచ్చేలా కనిపించడం లేదు. సెబీ తనపై రూ.25 కోట్ల జరిమానా విధించడం, ఐదేళ్ల పాటు క్యాపిటల్ మార్కెట్లో పాల్గొనకుండా వేటు వేయడాన్ని ఆయన జీర్ణించుకోలేక పోతున్నారు. ఈ విషయాన్ని న్యాయస్థానాల్లో సవాల్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం న్యాయ నిపుణులను సంప్రదిస్తున్నట్టు అనిల్ అంబానీ అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. 2022 ఫిబ్రవరి 11న సెబీ జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులకు అనుగుణంగా అనిల్ అంబానీ.. రిలయన్స్ ఇన్‌ఫ్రా, రిలయన్స్ పవర్ ఛైర్మన్‌గా తప్పుకోవడమే గాక, ఫండ్స్‌ను దారిమళ్లించారని చెబుతున్న రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ కంపెనీకీ దూరంగా ఉన్న విషయాన్నీ ఆ ప్రకటనలో గుర్తు చేశారు. 'ఈ నెల 22న సెబీ జారీ చేసిన తుది ఉత్తర్వులను అనిల్ అంబానీ పూర్తిగా సమీక్షిస్తున్నారు. న్యాయ నిపుణులతో చర్చించిన తర్వాత దీనిపై అవసరమైన చర్యలు తీసుకుంటారు' అని ఆ ప్రకటనలో తెలిపారు.

ఇండిగో బుకింగ్‌కు 'ఎంఎక్స్' ఆప్షన్

న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఇండిగో తన విమాన సర్వీసుల్లో ప్రయాణానికి టికెట్ బుకింగ్ చేసుకునే వారికి లింగ తటస్థ ఆప్షన్ "ఎంఎక్స్" అందుబాటులోకి తెస్తోంది. దీని ప్రకారం ఇండిగోలో ప్రయాణానికి టికెట్ బుక్ చేసుకునే వారు బుకింగ్ సమయంలో మేల్, ఫిమేల్‌తో పాటు లింగ తటస్థ ఆప్షన్ ఎంఎక్స్ కూడా ఎంచుకోవచ్చు. ట్రాన్స్ జెండర్లుగా తమ గుర్తింపు వెల్లడించడానికి ఇష్టపడని వారు ఈ ఆప్షన్ ఎంచుకోవచ్చు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా ఇప్పటికే బుకింగ్‌లకు ఎంఎక్స్ ఆప్షన్ అందుబాటులో ఉంచాయి. ఇదిలా ఉండగా తాము మరింత ఎక్కువ మంది దివ్యాంగులను రిక్రూట్ చేసుకోవాలనుకుంటున్నామని గ్రూప్ మానవ వనరుల విభాగం చీఫ్ సుఖ్‌జిత్ ఎస్ పశ్రిచా చెప్పారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి తమ ఉద్యోగుల సంఖ్య 36,860 కాగా వారిలో 5,038 మంది పైలట్లు, 9,363 మంది క్యాబిన్ సిబ్బంది ఉన్నారు.

కాగా కస్టమర్ సర్వీస్ విభాగంలో 60 పైగా నగరాల్లో 240 మంది వరకు దివ్యాంగులు కూడా పని చేస్తున్నారని ఆయన తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో దివ్యాంగుల సంఖ్య మూడు రెట్లు పెంచాలనుకుంటున్నట్టు సుఖ్‌జిత్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26 వ తేదీ



హైదరాబాద్	450	విజయవాడ	485
వరంగల్	452	గోదావరి	485
చిత్తూరు	508	విశాఖపట్నం	505

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	109	విజయవాడ	113
వరంగల్	109	గుంటూరు	110
కరీంనగర్	109	ఒంగోలు	110
మహబూబ్‌నగర్	109	చిత్తూరు	104
కర్నూలు	109	నెల్లూరు	104
విశాఖపట్నం	109	అనంతపురం	110
గోదావరి	113		

ఆర్‌క్యాప్ అప్పులపై రుణదాతల ఆందోళన

న్యూఢిల్లీ: దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) సమస్య ఇప్పట్లో తేలేలా లేదు. ఈ కంపెనీని టేకోవర్ చేసేందుకు ముందుకు వచ్చిన హిందూజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ లిమిటెడ్ (ఐఐహెచ్‌ఎల్) ప్రయత్నాలపై రుణదాతల కమిటీ (సీఓసీ) ఆందోళన వ్యక్తం చేసింది. ఆర్‌క్యాప్ టేకోవర్ కోసం రిలయన్స్ సెక్యూరిటీస్ సంస్థ ఈక్విటీ మొత్తాన్ని హామీగా పెట్టి రూ.7,300 కోట్లు రుణాలుగా తీసుకోవటానికి అనుమతిస్తే, తమ రుణాలు వసూలు చేసుకోవడం అసాధ్యమని ఎన్‌సీఎల్‌టీ ముంబై బెంచ్‌కి సీఓసీ తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఐఐహెచ్‌ఎల్ తమ రుణాల చెల్లింపులో విఫలమైతే ఆ సంస్థ ఎస్క్రో ఖాతాలో జమ చేసిన మొత్తాన్ని తాము స్వాధీనం చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరాయి.

కేజీ బేసిన్‌లో మరో బావి ప్రారంభం

ఓఎన్‌జీసీ

న్యూఢిల్లీ: బంగాళాఖాతంలోని కృష్ణా గోదావరి (కేజీ) బేసిన్‌లో మరో చమురు బావిని తెరిచినట్టు ప్రభుత్వ రంగంలోని చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్‌జీసీ) ప్రకటించింది. దీనివల్ల క్రూడాయిల్, సహజ వాయువు ఉత్పత్తి పెంచుకోగలుగుతామని పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో కేజీ బేసిన్‌లో ఉత్పత్తిని ప్రారంభించిన ఓఎన్‌జీసీ శనివారం కేజీ-డీడబ్ల్యూఎన్-98/2 క్లస్టర్-2 అసెట్‌లో ఐదో బావిని తెరిచి ఒక మైలురాయిని నమోదు చేసిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు పంపిన సమాచారంలో తెలిపింది. అయితే ఈ కొత్త బావి ఎంత ఆయిల్ ఉత్పత్తి చేస్తున్నది వెల్లడించలేదు. రిలయన్స్‌కు చెందిన కేజీ-డీ6 బ్లాక్ పక్కనే ఈ బావులున్నాయి. ఒక్కో బ్లాక్‌లోని కొన్ని బావులను కలిపి తాము ఒక క్లస్టర్‌గా వర్గీకరించినట్టు ఓఎన్‌జీసీ తెలిపింది. వాస్తవానికి ఈ క్లస్టర్-2లో ఉత్పత్తి 2021 నవంబరులోనే ప్రారంభం కావలసి ఉండగా కరోనా మహమ్మారి కారణంగా జాప్యం అయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఈ బ్లాక్‌లో మరిన్ని బావులను ఉత్పత్తికి తెరవాలని నిర్ణయించామని సంస్థ తెలిపింది.

లాభాల బాటలోనే.. !

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. యూఎస్ ఫెడ్ రిజర్వ్ ఛైర్మన్ జెరోమ్ పొవెల్ వడ్డీ రేట్ల కోతకు సమయం ఆసన్నమైందని చెప్పటం సానుకూల సంకేతాలు వెలువరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు పొవెల్ ప్రకటనను అనుసరించే అవకాశం ఉంది. దీంతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు కూడా లాభాల్లో పయనించే వీలుంది. ఈ వారం నిఫ్టీకి 24,750 వద్ద మద్దతు స్థాయిలుండగా 24,900 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. ఐటీ, టెలికాం, హెల్త్‌కేర్ షేర్లలో బుల్లిష్‌నెస్ కనిపిస్తోంది.

స్టాక్ రికమండేషన్స్

సన్ ఫార్మా: ఈ షేరు సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. స్వల్ప కన్సాలిడేషన్ తర్వాత జీవితకాల గరిష్ఠాన్ని తాకింది. డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ గణనీయంగా పెరుగుతోంది. గత శుక్రవారం ఈ షేరు 1.4 శాతం లాభంతో రూ.1,775 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,770/1,750 శ్రేణిలో ప్రవేశించి రూ.1,860/1,880 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,730 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారతి ఎయిర్‌టెల్: జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు కన్సాలిడేట్ అవుతోంది. ప్రధాన మద్దతు స్థాయి రూ.1,450 వద్ద ఈ షేరు మళ్లీ పుంజుకుంది. గత శుక్రవారం ఈ షేరు 1.4 శాతం లాభంతో రూ.1,506 వద్ద ముగిసింది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,480/1,490 శ్రేణిలో ఎంటరై రూ.1,550/1,620 టార్గెట్ ధరతో పొజిషన్ తీసుకునే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,450 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

మహీంద్రా అండ్ మహీంద్రా: సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ కౌంటర్‌లో ప్రస్తుతం దిద్దుబాటు జరుగుతోంది. షేరు కీలక మద్దతు స్థాయికి చేరింది. గత శుక్రవారం రూ.2,759 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.2,740 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,850/2,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐసీఐసీఐ బ్యాంక్: చాలా కాలంగా అప్‌ట్రెండ్‌లో సాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేట్ అవుతోంది. రూ.1,160 స్థాయిలో ప్రధాన మద్దతు లభించటంతో చివరి రెండు సెషన్లలో ఈ షేరు లాభాల్లో ముగిసింది. గత శుక్రవారం ఈ షేరు 1.04 శాతం లాభంతో రూ.1,203 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.1,190 శ్రేణిలో ప్రవేశించి రూ.1,250/1,290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,170 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: కొన్ని రోజులుగా సైడ్‌వేస్‌లో చలిస్తున్న ఈ షేరు రెండు వారాలుగా దూకుడును ప్రదర్శిస్తూ జీవిత కాల గరిష్ఠం వైపు సాగుతోంది. రిలేటివ్ స్ట్రెంత్ కూడా పెరుగుతోంది. గత శుక్రవారం రూ.941 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.930/920 స్థాయిలో ప్రవేశించి రూ.990/1,040 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.890 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

25,000 స్థాయిలో పరీక్ష

నిఫ్టీ గత వారం ఐదు ట్రేడింగ్ రోజుల్లోనూ అప్‌ట్రెండ్‌ను కొనసాగిస్తూ ముందు వారంతో పోల్చితే 280 పాయింట్ల లాభంతో 24,820 వద్ద ముగిసింది. ప్రస్తుతానికి పాజిటివ్ ధోరణిలోనే ఉన్నప్పటికీ ఇటీవల సాధించిన టాప్, జీవితకాల గరిష్ఠ స్థాయి 25,000-25,100కి చేరువవుతున్నందు వల్ల అప్రమత్తంగా ఉండాలి. గతంలో ఈ స్థాయి నుంచే బలమైన రియాక్షన్ ఏర్పడింది. పైగా గత కొద్ది రోజుల్లో 1,000 పాయింట్ల మేరకు లాభపడినందువల్ల కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడడం తప్పనిసరి. ఇది కూడా అప్రమత్త సంకేతం. కాగా గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 900 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 640 పాయింట్లు లాభపడినా రెండు సూచీలూ శుక్రవారం రియాక్షన్ ఏర్పడడం గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తతను సూచిస్తోంది. శుక్రవారం అమెరికన్ మార్కెట్లలో ర్యాలీ వల్ల మార్కెట్ మరింత పాజిటివ్ ధోరణిలోనే ట్రేడ్ కావచ్చు. ఈ కారణంగా 25,000 వద్ద పరీక్ష ఎదుర్కొనే ఆస్కారం ఉంది.



వి. సుందర్ రాజా

బుల్లిష్ స్థాయిలు: తదుపరి స్వల్పకాలిక దిశ తీసుకునే ముందు జీవితకాల గరిష్ఠ స్థాయిలు 25,000-25,100 వద్ద కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం 25,000 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి.

బేరిష్ స్థాయిలు: మైనర్ మద్దతు స్థాయి 24,850 కన్నా దిగజారితే మరింత బలహీనత ఏర్పడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయిలు 24,700, 24,500. అంత కన్నా దిగజారితే బలహీనపడే ఆస్కారం ఉంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారంలో 416 పాయింట్ల లాభంతో 50,930 వద్ద ముగిసింది. ప్రధాన నిరోధం 51,400. మరింత అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 51,000. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనపడవచ్చు.

పాటర్న్: మార్కెట్లో 'వీ' ఆకారంలో రికవరీ ఏర్పడినందు వల్ల ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. సానుకూలత కోసం 25,000 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం సోమవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమ వారం స్థాయిలు	
నిరోధం	24,940, 25,000
మద్దతు	24,860, 24,800

స్పోర్ట్స్

బంగ్లా చారిత్రక విజయం

పది వికెట్లతో పాక్ చిత్తు



రావల్పిండి: స్వదేశంలో రాజకీయ అస్థిరత..దేశం యావత్తూ అల్లకల్లోలం..ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలంతా బిక్కుబిక్కుమంటున్న తరుణం..ఈ పరిస్థితుల్లో పాకిస్థాన్ పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ జట్టు తొలి టెస్ట్‌లో చారిత్రక విజయం అందుకుంది..పటిష్ఠమైన ప్రత్యర్థిని ఏకంగా పది వికెట్లతో చిత్తు చేసింది..రెండు మ్యాచ్‌ల వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది. బ్యాటర్ ముష్ఫికర్ అద్భుత శతకంతో స్ఫూర్తి పొందిన బంగ్లా బౌలర్లు..ముఖ్యంగా స్పిన్నర్లు మెహిదీ హసన్ మిరాజ్, షకీబ్ అల్ హసన్ ప్రత్యర్థిని తిప్పేయడంతో పర్యాటక జట్టుకు అపురూప విజయం దక్కింది. ఓవర్‌నైట్ 23/1తో ఆదివారం, చివరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్థాన్ ప్రత్యర్థి బౌలర్ల ధాటికి 146 పరుగులకే కుప్పకూలింది. కీపర్ రిజ్వాన్ (51), అబ్దుల్లా షఫీక్ (37) ఆదుకోకుంటే ఆతిథ్య జట్టు పరిస్థితి మరింత దారుణంగా ఉండేది. ఇక 30 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ నష్టపోకుండా ఏడు ఓవర్లలోనే బంగ్లాదేశ్ ఛేదించింది. ముష్ఫికర్ రహీమ్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. రెండో టెస్ట్ ఈనెల 30 నుంచి ఇక్కడే జరగనుంది.

సంక్షిప్తస్కోర్లు: పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్: 448/6 డిక్లేర్డ్; **బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్:** 565; **పాకిస్థాన్ రెండో ఇన్నింగ్స్:** 146 (రిజ్వాన్ 51, అబ్దుల్లా 37, మెహిదీ హసన్ మిరాజ్ 4/21, షకీబ్ 3/44); **బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్:** 30/0 (జాకీర్ హసన్ 15 నాటౌట్, షాద్‌మన్ 9 నాటౌట్).



షకీబ్ @ 707

షకీబ్ అల్ హసన్ వ్యక్తిగతంగా ఓ మైలురాయిని చేరుకున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు పడగొట్టిన లెఫ్టామ్ స్పిన్నర్‌గా రికార్డు పుటలకెక్కాడు. షకీబ్ ఈ మ్యాచ్‌లో మొత్తం నాలుగు వికెట్లు తీశాడు. ఇక మూడు ఫార్మాట్లలో కలిసి మొత్తం 444 మ్యాచ్‌లాడిన షకీబ్ 707 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఈక్రమంలో న్యూజిలాండ్ స్పిన్నర్ డేనియల్ వెటోరీ (442 మ్యాచ్‌ల్లో 705 వికెట్లు) రికార్డును బద్దలుగొట్టాడు. ఇటీవలే ప్రధానిగా పదవీచ్యుతురాలైన షేక్ హసీనా పార్టీ అవామీ లీగ్ నుంచి గతంలో బంగ్లాదేశ్ పార్లమెంట్‌కు ఎన్నికయ్యాడు. బంగ్లాదేశ్‌లో తాజా పరిస్థితుల నేపథ్యంలో హసీనాతోపాటు షకీబ్‌పైనా హత్య కేసు నమోదైంది.

1 పాకిస్థాన్‌పై 14 టెస్ట్‌ల్లో బంగ్లాకిది తొలి గెలుపు

5 స్వదేశంలో పాకిస్థాన్‌కు వరుసగా ఐదో టెస్ట్ ఓటమి

7 విదేశాల్లో బంగ్లాదేశ్ సాధించిన టెస్ట్ విజయాలు

భారత వీసా తిరస్కరణ.. పాక్ ఫిర్యాదు

కరాచీ: పాకిస్థాన్ బిలియర్డ్స్ ఆటగాళ్లకు వీసాలు మంజూరు కాకపోవడంతో వారు భారత్‌లో ఆడాల్సిన టోర్నీకి దూరమయ్యారు. శనివారం బెంగళూరులో ఐబీఎస్‌ఎఫ్ అండర్-18, అండర్-21 వరల్డ్ చాంపియన్‌షిప్స్ ఆరంభమయ్యాయి. ఈ టోర్నీ కోసం ముగ్గురు పాక్ ప్లేయర్ల వీసా దరఖాస్తును భారత హైకమిషన్ తిరస్కరించింది. దీంతో పాక్ బిలియర్డ్స్, స్నూకర్ సంఘం.. వరల్డ్ బాడీ ఐబీఎస్‌ఎఫ్‌తోపాటు నిర్వాహకులైన భారత బిలియర్డ్స్, స్నూకర్ సంఘానికి ఫిర్యాదు చేసింది.



అవనీ లేఖర

పారా హుషార్

మరో రెండు రోజుల్లో పారాలింపిక్స్

25 పతకాలు లక్ష్యంగా భారత్

రెండు వారాల కిందట ప్రపంచ అతి పెద్ద క్రీడా సంబరం ఒలింపిక్స్‌కు తెరపడింది. మరో క్రీడా సంరంభానికి ఇంకో రెండు రోజుల్లో తెరలేవనుంది. దాంతో పది రోజులకుపైగా పారిస్ నగరంలో సందడే.. సందడి..17వ పారాలింపిక్స్ ఈనెల 28 నుంచి వచ్చేనెల ఎనిమిది వరకు ప్రపంచ క్రీడా ప్రేమికులను అలరించనున్నాయి. ఇక ఈ విశ్వ క్రీడల్లో భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు 12 క్రీడాంశాల బరిలో దిగుతున్నారు. గత టోక్యో పారాలింపిక్స్‌లో ఏకంగా 19 పతకాలు సొంతం చేసుకోవడంతో భారత అథ్లెట్ల ఆత్మవిశ్వాసం రెండింతలైంది. అంతకు ముందు లండన్ (2012) గేమ్స్‌లో ఒకే ఒక పతకంతో సరిపెట్టుకున్న మనోళ్లు.. రియో (2016)లో మరింత మెరుగైన ప్రదర్శనతో నాలుగు పతకాలు గెలిచారు. టోక్యోలో అవి దాదాపు అయిదింతలకు చేరడం భారత అథ్లెట్ల అద్భుత ప్రతిభకు అద్దం పట్టింది. ఈనేపథ్యంలో క్రీడాకారులంతా స్థాయికి తగ్గట్టుగా రాణిస్తే పారిస్‌లో 25 పతకాలు లభించవచ్చని అంచనా వేస్తున్నారు. 1968లో భారత్ తొలిసారి పారాలింపిక్స్‌లో తలపడింది. అప్పటినుంచి 2016 క్రీడల వరకు మన అథ్లెట్లు సాధించిన మొత్తం పతకాల సంఖ్య 12 కావడం గమనార్హం. రియో క్రీడల్లో కేవలం 19 మంది అథ్లెట్లే పాల్గొన్నారు. టోక్యో పారాలింపిక్స్‌కొచ్చేసరికి అథ్లెట్ల సంఖ్య 54కి చేరింది. పారిస్‌లో సంఖ్యాపరంగా రికార్డు స్థాయిలో మనోళ్లు పోటీపడుతున్నారు. ఈసారి భారీ బృందంతో బరిలో దిగడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. పారా విశ్వక్రీడలను సీరియస్‌గా తీసుకోవడం అందులో మొదటిది. పారా అథ్లెట్లతో శక్తిసామర్థ్యాలను గుర్తెరగడం రెండోది.

స్ఫూర్తి నింపుతున్న ఆ అథ్లెట్లు..

పారిస్‌లోనూ వరల్డ్ రికార్డు సృష్టించి స్వర్ణ పతకం కొల్లగొట్టాలని జావెలిన్ త్రోయర్ సుమిత్ అంటిల్ లక్ష్యంగా నిర్దేశించుకున్నాడు. నీరజ్ చోప్రా స్ఫూర్తిగా తాను పారిస్‌లో 80మీ. ధ్యేయంగా పెట్టుకున్నట్టు సుమిత్ చెప్పాడు. ఇక, షూటింగ్‌లో అవనీ లేఖర, మనీష్ నర్వాల్ హాట్ ఫేవరెట్లుగా పోటీపడుతున్నారు. టోక్యోలో రెండు పతకాలతో చరిత్ర సృష్టించిన అవని ఈసారి టైటిల్ నిలబెట్టుకోగలనన్న ధీమాతో బరిలోకి దిగుతోంది. మరోవైపు టేబుల్ టెన్నిస్‌లో భవినా పటేల్‌పై అంచనాలున్నాయి.

'టాప్స్', కార్పొరేట్ స్పాన్సర్‌షిప్

ప్రధాన అథ్లెట్లతోపాటు టార్గెట్ ఒలింపిక్స్ పోడియం స్కీం (టాప్స్)లో చోటు కల్పించడం పారా అథ్లెట్లకు మరింత కలిసొచ్చింది. అలాగే కార్పొరేట్ సంస్థలు కూడా వారిని స్పాన్సర్ చేసేందుకు ముందుకొస్తున్నాయి. దాంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా పారా అథ్లెట్లు శిక్షణ కొనసాగించడంతోపాటు అంతర్జాతీయ టోర్నీలలో పాల్గొనగలుగుతున్నారు. జావెలిన్ త్రోయర్ దేవేంద్ర ఝఝారియా 2004లో ఏథెన్స్ విశ్వక్రీడల్లో స్వర్ణ పతకం గెలవడం దేశ పారా అథ్లెటిక్స్‌లో అనూహ్య మార్పులకు నాంది పలికింది. భారత పారాలింపిక్ కమిటీ (పీసీఐ)కి కేంద్ర ప్రభుత్వం గుర్తింపు ఇచ్చింది. అప్పటి వరకు శిక్షణ, సదుపాయాల కొరత ఎదుర్కొన్న పారా అథ్లెట్లు..పీసీఐకి గుర్తింపు ఇచ్చాక ఆ కష్టాలకు తెరపడ్డాయి. 2019-21 మధ్య పారా క్రీడల సౌకర్యాలకు కేంద్రం రూ. 8.2 కోట్లు ఖర్చు పెట్టింది. పారా అథ్లెట్లు 'టాప్స్'తో ఎంతో లబ్ధి పొందారు. సుమిత్ అంటిల్ కృత్రిమ కాలుకోసం రూ. ఏడు లక్షలు వెచ్చించడంతోపాటు నీరజ్ చోప్రాతో కలిసి ప్రాక్టీస్ చేసే అవకాశం కల్పించింది. ట్యునీసియా, ఫిన్లాండ్‌లలో అంటిల్ శిక్షణ పొందాడు. ప్రస్తుతం దేశంలో పారా క్రీడలకు పెరిగిన ప్రాధాన్యం రీత్యా చూస్తే పారిస్‌లో మన పతకాల సంఖ్య ఊహించని స్థాయిలో పెరిగే అవకాశాలు లేకపోలేదు. పారిస్‌లో 25కిపైగా పతకాలు లభించే చాన్సుందని పీసీఐ చీఫ్ దేవేంద్ర ఝఝారియా అంచనా వేస్తున్నాడు.



పారిస్ పయనమైన బ్యాడ్మింటన్, జూడో, తైక్వాండో క్రీడాకారులు

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)





జొకోవిచ్ 25 కొడతాడా?

సిన్నర్, అల్కారజ్ నుంచి గట్టిపోటీ

మహిళల ఫేవరెట్‌గా సబలెంక, స్వియటెక్

నేటి నుంచే యూఎస్ ఓపెన్

న్యూయార్క్: ఒలింపిక్స్ పసిడి కలను నెరవేర్చుకొన్న వరల్డ్ నెం:2 నొవాక్ జొకోవిచ్.. మరో అరుదైన రికార్డుపై గురిపెట్టాడు. సోమవారం నుంచి జరిగే సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంప్ జొకో మరోసారి టైటిల్ నిలబెట్టుకోవాలనుకొంటున్నాడు. ఫ్లషింగ్ మెడోస్‌లో నొవాక్ విజేతగా నిలిస్తే ఓపెన్ ఎరాలో అత్యధికంగా 25 గ్రాండ్‌స్లామ్‌లతో చరిత్ర సృష్టించడమే కాకుండా.. రోజర్ ఫెడరర్ (2004 నుంచి 2008) తర్వాత వరుసగా రెండోసారి యూఎస్ ఓపెన్ నెగ్గిన ఘనతను సొంతం చేసుకోనున్నాడు. ఈ క్రమంలో కెరీర్‌లో 99 మేజర్ టైటిల్స్ నెగ్గిన జొకోకు 'సెంచరీ' కూడా పూర్తవుతుంది. ప్రస్తుతం 24 గ్రాండ్‌స్లామ్‌లు సాధించిన మార్గరెట్ కోర్ట్‌తో అతడు సమంగా ఉన్నాడు. పారిస్ ఒలింపిక్స్‌లో అల్కారజ్‌నే ఓడించి స్వర్ణం సొంతం చేసుకొన్న నొవాక్ ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనున్నాడు. తొలి రౌండ్‌లో రదు అల్బాట్ (మల్దోవా)తో జొకో తలపడనున్నాడు. అయితే, ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సిన్నర్, ఈ సీజన్‌లో రెండు గ్రాండ్‌స్లామ్‌ల విజేత అల్కారజ్, అలెగ్జాండర్ జ్వెరెవ్, ఐదో సీడ్ డానిల్ మెద్వెదెవ్ కూడా సత్తాచాటాలనుకొంటున్నారు. మహిళల సింగిల్స్‌లో బెలారస్ భామ అర్యానా సబలెంక ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. డిఫెండింగ్ చాంప్ కొకో గాఫ్ (అమెరికా) పేలవ ఫామ్‌లో కొనసాగుతుండడంతో.. టాప్ సీడ్ ఇగా స్వియటెక్ (పోలెండ్), సబలెంక మధ్య ఫైనల్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎలెనా రిబకినా (కజకిస్థాన్), జాస్మిన్ పౌలినీ (ఇటలీ) కూడా టైటిల్ రేసులో ఉన్నారు.

తన్విదే ఆసియా కిరీటం



న్యూఢిల్లీ: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ తన్వి పత్రి అండర్-15 బాలికల చాంపియన్‌గా నిలిచింది. చైనాలోని చెంగ్డూలో ఆదివారం జరిగిన సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్ తన్వి 22-20, 21-11తో రెండోసీడ్ తి తూ హుయెన్ గుయెన్ (వియత్నాం)ను ఓడించి స్వర్ణం అందుకుంది. సామియా, తస్నీమ్ తర్వాత ఆసియా జూనియర్ అండర్-15 టైటిల్ నెగ్గిన భారత షట్లర్‌గా 13 ఏళ్ల తన్వి రికార్డుకెక్కింది.



హార్దిక్ నటాషా


అందుకే విడిపోయారా?

న్యూఢిల్లీ: భారత జట్టు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా.. భార్య నటాషా స్టాన్కోవిచ్‌తో విడిపోయిన సంగతి తెలిసిందే. అయితే వీరిద్దరూ ఎందుకు విడిపోయారన్న విషయం అభిమానులను అంతుపట్టడంలేదు. పాండ్యా తీరు కారణంగానే నటాషా కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని.. వారి గురించి తెలిసిన వారంటున్నారు. 'నటాషా అతడితో సర్దుకుపోవాలని చూసినా ఆమె వల్ల కాలేదు. క్రమంగా ఇద్దరి మధ్య అగాథం ఏర్పడింది. నేనింతే అన్నట్టుగా పాండ్యా వ్యవహరించడంతో.. నటాషా కూడా చేసేదేమీ లేకపోయింది. ఇదేమీ క్షణికావేశంలో తీసుకొన్న నిర్ణయం కాద'ని వారు చెప్పారు. వీరిద్దరి వివాహం 2020లో జరిగింది. విడాకుల తర్వాత కొడుకుని తీసుకుని నటాషా ఆమె పుట్టిల్లు సెర్బియా వెళ్లిపోయింది. ఇక హార్దిక్ ప్రస్తుతం బ్రిటన్ సింగర్ జాస్మిన్ వాలియాతో డేటింగ్ చేస్తున్నాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది.

బ్లాక్‌బర్డ్స్‌కు రెండోస్థానం

చెన్నై: ఇండియన్ రేసింగ్ ఫెస్టివల్‌లో తొలిరోజు నిరాశ పరిచిన హైదరాబాద్ బ్లాక్‌బర్డ్స్ జట్టు రెండోరోజు సత్తా చాటింది. ఆదివారం జరిగిన తొలిరౌండ్ రెండో రేసులో బ్లాక్‌బర్డ్స్ డ్రైవర్ అఖిల్ రవీంద్ర రెండోస్థానంతో రన్నరప్‌గా నిలిచాడు. బెంగాల్ టైగర్స్ డ్రైవర్ అలిస్టర్ యాంగ్ ప్రథమస్థానంతో రేసు ముగించి విజేతగా నిలిచాడు.

3000 మీ. రేస్‌లో జాకబ్ ప్రపంచ రికార్డు



సిలీసియా (పోలెండ్): నార్వే రన్నర్ జాకబ్ ఇంజ్‌బ్రిగ్ట్‌సెన్ 3000 మీ. రేస్‌లో ప్రపంచరికార్డు నెలకొల్పాడు. ఆదివారం జరిగిన సిలీసియా డైమండ్ లీగ్‌లో జాకబ్ 7 నిమిషాల 17.55 సెకన్ల రికార్డు టైమింగ్‌తో రేసును ముగించాడు. ఈ క్రమంలో 28 ఏళ్ల క్రితం డేనియల్ కోమెన్ (కెన్యా) నెలకొల్పిన 7 నిమిషాల 20.67 సెకన్ల రికార్డును 3 సెకన్ల తేడాతో సవరించాడు.

రుణమాఫీలో స్వీయ ధ్రువీకరణ

కుటుంబసభ్యుల వివరాల నమోదు బాధ్యత రైతులకే.. 'ధ్రువీకరణ పత్రం' జారీ చేసిన వ్యవసాయశాఖ

- ఏవోలకు అందుబాటులోకి 'సీఎల్‌డబ్ల్యూ' యాప్

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీకి కుటుంబ సభ్యులను నిర్ధారించే బాధ్యతను ప్రభుత్వం రైతులకే అప్పగించింది. స్వీయ ధ్రువీకరణ(సెల్ఫ్ డిక్లరేషన్)తో రైతులే తమ కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నంబర్లు, వయస్సు తదితర వివరాలను అందజేయాలని వ్యవసాయశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ డిక్లరేషన్ తప్పు అయితే.. తాను పొందిన రుణమాఫీ మొత్తాన్ని తిరిగి ప్రభుత్వానికి చెల్లిస్తానని.. లేని పక్షంలో రికవరీ చేసే అధికారం వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు ఉంటుందని పేర్కొంటూ రైతులు ప్రమాణ పత్రం ఇవ్వాల్సి ఉంటుంది. డిక్లరేషన్‌లో రైతులు సంతకం చేసి, తమ మొబైల్ నంబర్‌ను అందజేయాలని వ్యవసాయ శాఖ తాజా ఆదేశాలు పేర్కొంటున్నాయి.

8 దశల్లో పోర్టల్‌లో అప్‌లోడ్

కుటుంబ నిర్ధారణ కాని రైతుల ఖాతాలు 4,24,873, ఆధార్‌లో తప్పులున్నవి 1,24,545 ఉన్నాయి. మొత్తం కలిపి 5,49,418 మంది రైతులకు ఇంకా రుణమాఫీ అందాలి. దీనిపై వ్యవసాయశాఖ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఆదివారం నుంచి రుణమాఫీకి కొత్త పోర్టల్ అందుబాటులోకి వచ్చింది. ఇదివరకు రుణమాఫీకి సంబంధించి 'క్రాప్‌లోన్ వీవర్(సీఎల్‌డబ్ల్యూ) వెబ్‌సైట్ ఉండేది. ఇప్పుడు రైతుభరోసా వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి.. క్రాప్‌లోన్ వీవర్(సీఎల్‌డబ్ల్యూ)-2024 పోర్టల్‌ను రూపొందించారు. మండల వ్యవసాయ అధికారులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్‌లు ఇచ్చారు. రుణమాఫీ పొందని రైతుల అభ్యంతరాలను ఏవోలు.. ఈ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. రైతుల వివరాలు అప్‌లోడ్ చేయటానికి 8 దశలను నిర్దేశించారు. రైతులు తొలుత పోర్టల్‌లో 'క్రాప్‌లోన్ వీవర్' బటన్‌ను క్లిక్ చేసి.. మొబైల్ నంబర్ ఆధారంగా లాగిన్ అవ్వాల్సి ఉంటుంది. ఆ తర్వాత కుటుంబ సభ్యుల వివరాలను ఎంటర్ చేయాలి. మూడో దశలో రైతులు వ్యవసాయ రుణం ఉన్న బ్యాంకు వివరాలను అందజేయాలి. ఆ తర్వాత రైతు పేరు లేదా ఆధార్ నంబర్‌తో సెర్చ్ చేస్తే.. వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఇక్కడ పేర్కొన్న కాలమ్స్‌లో కుటుంబ సభ్యుల వివరాలను అందజేయాలి. చివరగా 'ప్రీవ్యూ'లో ఏవైనా తప్పులుంటే.. సరిచేసుకునేందుకు ఎడిట్ ఆప్షన్ ఉంటుంది. కుటుంబ సభ్యుల గ్రూప్ ఫొటోను, స్వీయ ధ్రువీకరణను అప్‌లోడ్ చేయాలి. కాగా.. ప్రస్తుతం రూ.2 లక్షల్లోపు రుణం ఉండి.. పెండింగ్‌లో ఉన్న 5.49 లక్షల మంది రైతులపైనే ప్రభుత్వం దృష్టి సారించింది.



కాడెద్దులు, బండితో రైతు సాయప్ప

రుణమాఫీ.. రైతు హ్యాపీ

- పాత లోన్ మాఫీ కావడంతో కొత్తగా రుణం
- కాడెద్దులు, బండిని కొనుగోలు చేసిన అన్నదాత

కొడంగల్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఏకంగా 2 లక్షల వరకు లోన్ మాఫీ చేస్తుండటంతో అన్నదాతల ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన సాయప్పకు రూ. 1.80 లక్షల రుణం మాఫీ అయ్యింది. దాంతో ఆ రైతు మళ్లీ లోన్ తీసుకొని కాడెద్దులు, బండి కొనుగోలు చేశాడు. సీఎం రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని రైతు మెచ్చుకున్నాడు.

ప్రజలకు గవర్నర్ కృష్ణాష్టమి శుభాకాంక్షలు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శ్రీ కృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. శాశ్వత జ్ఞాన స్వరూపుడైన కృష్ణ భగవానుని స్మరిస్తూ.. భక్తి శ్రద్ధలతో అందరూ ఈ పండుగను జరుపుకోవాలని ఆయన కోరారు. నిస్వార్థ ప్రేమతో సమాజానికి సేవ చేసిన కృష్ణుడి మార్గంలోనే ప్రజలంతా పయనించాలని పిలుపునిచ్చారు. భగవద్గీత ద్వారా కృష్ణ భగవానుడు అందించిన దివ్య సందేశం అందరినీ ధర్మమార్గం వైపు నడిపిస్తోందని గవర్నర్ పేర్కొన్నారు.

పంట పొలాల్లో ఫార్మా కంపెనీలొద్దు

- ఫార్మా వ్యతిరేక పోరాట సమితి

బర్కత్‌పుర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల ఏర్పాటును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఫార్మా వ్యతిరేక పోరాట సమితి డిమాండ్ చేసింది. రైతుల భూములను లాక్కుని ఫార్మా కంపెనీలను పెడితే తిరగబడతామని, అవసరమైతే ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించింది. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఫార్మా వ్యతిరేక పోరాట సమితి ప్రతినిధి యాదయ్య, ప్రతినిధులు బి.సురేష్, చాకలి శ్రీకాంత్ తదితరులు మాట్లాడారు. సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి సారథ్యంలో కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం లగచర్ల, హకీంపేట, పోలేపల్లి, ఆర్‌బీ తండా, పులిచెర్ల కుంటతండా, ఈర్లపల్లి తండాలలో ఫార్మా కంపెనీలను 1,375 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయబోతున్నారని వారు తెలిపారు. ఈ గ్రామాల్లోని 1,100 మంది చిన్న, సన్న కారు రైతుల నుంచి భూములను లాక్కుని ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నారని ఆరోపించారు. షైలారం గ్రామంలో 2 వేల ఎకరాలు, లగచర్ల, దుద్యాలలో 7 వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయని, వాటిలో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం పునరాలోచించి పంటపొలాల్లో ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయవద్దని వారు డిమాండ్ చేశారు. ఫార్మా కంపెనీలకు వ్యతిరేకంగా తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

రేపు ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగుల జేఏసీ నిరసనకు పిలుపునిచ్చింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని ఉద్యోగులను కోరింది. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలనే ప్రధాన డిమాండ్లతో నిరసన వ్యక్తం చేస్తామని జేఏసీ తెలిపింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతన సవరణ చేయాలని, సంపూర్ణ ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొంది. 2013, 2017 వేతన సవరణ బకాయిలను చెల్లించాలని, 2021 వేతన సవరణ వెంటనే చేపట్టాలనే డిమాండ్లు యాజమాన్యం ముందుంచామని తెలిపింది.

ఐదు నెలలుగా జీతాల్లేవు

- వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ శిక్షణా కేంద్రాల ఉద్యోగుల దీనావస్థ

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ పరిధిలోని దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాల తయారీ, ఉత్పత్తి శిక్షణ కేంద్రాల్లో పని చేసే ఉద్యోగులకు ఐదు నెలలుగా జీతాలు అందడం లేదు. ఆయా ఉద్యోగుల్లో దివ్యాంగులే అధికంగా ఉండడం శోచనీయం. జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు తమ కుటుంబ పోషణకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వికలాంగుల కార్పొరేషన్ పరిధిలో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు తయారు చేసే కేంద్రాలు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు ఉన్నాయి. దివ్యాంగులకు అవసరమైన ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు, బ్యాటరీ సైకిళ్లు, కృత్రిమ అవయవాలు ఈ కేంద్రాల్లోనే తయారవుతుంటాయి. ఈ కేంద్రాల్లో సుమారు 60 మంది ఉద్యోగులు పని చేస్తుండగా వారిలో 80 శాతం మంది వికలాంగులు కాగా 20 శాతం మంది సకలాంగులు ఉన్నారు. జీతం అందకపోవడంతో వారంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే, వికలాంగుల కార్పొరేషన్ కార్యాలయంలో పనిచేసే అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు జీతాలు అందడం లేదని ఉద్యోగులు బాహాటంగా ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి నాలుగు నెలలకొకసారి బడ్జెట్ విడుదల అవుతున్నా... అధికారులు సరైన సమయానికి ఆర్థిక శాఖకు నివేదిక అందించకపోవడంతో జీతాలు పెండింగ్‌లో ఉండపోతున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు జీతాలు అందించాలని వారంతా కోరుతున్నారు. 30 ఏళ్లుగా వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్‌లో పని చేసిన నేను వారం క్రితమే పదవీ విరమణ పొందా. నాకు 5నెలల జీతం రావాల్సి ఉంది. ఇప్పటికైనా ఆ మొత్తాన్ని చెల్లించాలి"అని రిటైర్డ్ ఉద్యోగి వెంకట్రాములు కోరారు.

సునీతా తిరిగొచ్చేది ఫిబ్రవరిలోనే!

- ఆమెతో పాటు బుచ్ విల్మోర్ కూడా: నాసా

కేప్ కెనావెరల్, ఆగస్టు 25: భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ (58) వచ్చే ఫిబ్రవరి వరకు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోనే ఉండనున్నారు. ఆమెతో పాటు వెళ్లిన బుచ్ విల్మోర్ (61) కూడా అప్పుడే తిరిగి భూమ్మీదకు వస్తారని అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్రకటించింది. సునీతా, విల్మోర్ జూన్ 5న బోయింగ్ సంస్థకు చెందిన వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రయాణికులను అంతరిక్ష కేంద్రానికి తీసుకెళ్లేలా రూపొందించిన తొలి స్పేస్ క్రాఫ్ట్ స్టార్‌లైనర్. దీని పనితీరును అంచనా వేసేందుకు సునీతా, విల్మోర్‌ను ఐఎస్ఎస్‌కు పంపారు. అయితే, అక్కడకు చేరుకోవడానికి ముందే ప్రొపల్షన్ సిస్టమ్‌లో లీకులు బయటపడ్డాయి. దీనిద్వారా వ్యోమగాములను తిరిగి భూమ్మీదకు తీసుకురావడం అత్యంత ప్రమాదకరమని నాసా అంచనాకు వచ్చింది. ఈ నేపథ్యంలో టెస్లా అనుబంధ సంస్థ స్పేస్ ఎక్స్‌కు చెందిన క్రూ డ్రాగన్ వ్యోమనౌకలో తీసుకురావాలని నిర్ణయించింది. ఇక స్టార్ లైనర్ వచ్చే నెలలో ఖాళీగానే భూమికి చేరనుంది. కాగా, కేవలం 8రోజుల స్వల్పకాలిక సమయానికి ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీతా, విల్మోర్ దాదాపు 8 నెలల పాటు అక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణకు మంచిరోజులొచ్చాయి

ప్రభుత్వ మార్గంలోనే బ్రహ్మకుమారీస్ ఎజెండా.. డ్రగ్స్ నిర్మూలనకు కార్యాచరణ భేష్: సీఎం రేవంత్

- 22 ఏళ్ల క్రితం సంస్థ ఏర్పాటుకు కృషి: తుమ్మల



శాంతి సరోవర్ ద్విదశాబ్ది వేడుకలకు హాజరైన సీఎం రేవంత్, మంత్రులు తుమ్మల, శ్రీధర్ బాబు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ గురించి నిద్రలో ఆలోచించాలన్నా భయపడే పరిస్థితి కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నషాను అరికట్టడం కోసమే డీజీపీ క్యాడర్ అధికారితో తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరోను ఏర్పాటు చేశామని తెలిపారు. దీని ద్వారా రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మూలాలను ఏరివేసే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇప్పుడు బ్రహ్మకుమారీస్ వాళ్లు కూడా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా కార్యక్రమాన్ని చేపట్టడంతో రాష్ట్రానికి మంచిరోజులు వచ్చాయని అన్నారు. ఆదివారం గచ్చిబౌలిలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సరోవర్ ద్విదశాబ్ది వేడుకలకు ముఖ్యమంత్రి హాజరై మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు.. 22 ఏళ్ల క్రితం మౌంట్ అబులోని శాంతి సరోవర్‌ను సందర్శించి, తరువాత ఇక్కడ గచ్చిబౌలిలో ఆ సంస్థను ప్రారంభించేందుకు కృషి చేశారని గుర్తు చేశారు. ఈ సంస్థను గచ్చిబౌలిలో ఏర్పాటు చేసే సమయానికి ఇక్కడ అభివృద్ధి లేదని, కానీ.. 20 ఏళ్ల తరువాత చూస్తే గొప్ప నగరంగా మారిందని పేర్కొన్నారు. ఓవైపు శాంతి సరోవర్ ఉంటే.. మరోవైపు ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, దాని పక్కనే ఇన్ఫోసిస్, విప్రోతోపాటు గచ్చిబౌలి స్పోర్ట్స్ విలేజ్ ఉన్నాయని, మొత్తంగా ఈ ప్రాంతం ఒక ఇంటర్నేషనల్ హబ్‌గా మారిందంటూ హర్షం వ్యక్తం చేశారు. విదేశాలకు వెళ్లినప్పుడు, హైదరాబాద్ గురించి చెప్పాల్సి వచ్చినప్పుడు.. చార్మినార్, ఔటర్ రింగ్ రోడ్, అంతర్జాతీయ విమానాశ్రయంతోపాటు శాంతి సరోవర్ కూడా ఉందని చెప్పుకొనేందుకు గర్వంగా ఉంటుందన్నారు. రైతు ఆత్మహత్యలను నివారించడం, యువతకు నైపుణ్యం కల్పించడం, డ్రగ్స్‌ను నిర్మూలించడం వంటి చర్యల ద్వారా రాష్ట్ర అభివృద్ధికి తమ ప్రభుత్వం చేపట్టిన ప్రణాళిక ప్రకారమే బ్రహ్మకుమారీస్ ఎజెండా ఉందని రేవంత్‌రెడ్డి అన్నారు. తమది ప్రజా, రైతు ప్రభుత్వమని, రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా చేయాలన్నది తమ ఆలోచన అని చెప్పారు. అందులో భాగంగానే రూ.2 లక్షల రుణమాఫీ చేశామన్నారు. యువతకు నైపుణ్యాలు నేర్పించాలన్న ఆలోచనతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని, దానిని ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. శంషాబాద్ విమానాశ్రయానికి కూతవేటు దూరంలో 60ఎకరాల్లో ఈ వర్సిటీని నిర్మిస్తున్నామని, దీనికి రూ.300కోట్ల నిధులు కేటాయించామని తెలిపారు.

లీజు గడువును రెన్యువల్ చేస్తాం..

బ్రహ్మకుమారీస్ సంస్థకు తమ ప్రభుత్వం అన్నికాలుగా అండగా నిలబడుతుందని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ సంస్థకు కేటాయించిన భూమి లీజు గడువు త్వరలో పూర్తవుతున్నందున.. దానిని రెన్యువల్ చేస్తామన్నారు. కాగా, 'అందరం ఒక్కటే' అనే నినాదంతో ముందుకెళ్తున్న బ్రహ్మకుమారీస్ సంస్థకు ఈ సంస్థకు అన్నివేళలా అండగా ఉంటామని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలోని శాంతిసరోవర్‌ను ఇక్కడ నెలకొల్పడానికి 22 ఏళ్ల క్రితం కృషి చేశామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఇందుకు అవసరమైన భూమిని అప్పటి చంద్రబాబు హయాంలో లీజుకు ఇచ్చామని గుర్తుచేశారు. 139 దేశాల్లో 8,700 కేంద్రాల ద్వారా సేవలందిస్తూ ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక సంస్థగా బ్రహ్మకుమారీస్ ప్రఖ్యాతి గాంచిందన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ నిర్వాహకురాలు శీలా మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఎన్నో పరీక్షలను దాటుకుని సీఎం అయ్యారని, ఇప్పుడు మనమంతా నిశ్చింతగా ఉంటున్నామంటే.. ఆయన ఎంతగా శ్రమిస్తున్నారో అర్థమవుతోందని అన్నారు. రేవంత్‌రెడ్డి డైనమిక్ లీడర్ అని, ఎలాంటి సమస్య ఎదురైనా వెనకడుగు వేయకుండా దూసుకెళతారని ప్రశంసించారు. ఎవరు, ఎన్ని రకాలుగా కిందిస్థాయికి తీసుకెళ్లినా తానేంటో నిరూపించుకున్నారని తెలిపారు. సంస్థ కోసం ఈ స్థలం ఇచ్చినప్పుడు కొండలు, గుట్టలే ఉన్నాయని గుర్తు చేశారు. ఆ సమయంలో సంస్థ నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు గుల్జార్ దాదీ వస్తున్నారని తుమ్మల నాగేశ్వరరావుకు చెప్పగానే.. రాత్రికి రాత్రే రోడ్డు వేయించారని తెలిపారు.

ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల వద్ద భద్రత పెంపు

- విజువల్ పోలీసింగ్‌కు పటిష్ఠ చర్యలు
- కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ ఆదేశాలు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): కోల్‌కతాలో ఘటన నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల వద్ద భద్రత పెంపుపై పోలీసు ఉన్నతాధికారులు దృష్టి సారించారు. వైద్యుల భద్రతకు భరోసా కల్పించే విధంగా విజువల్ పోలీసింగ్‌కు చర్యలు చేపట్టారు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ ఆస్పత్రులతోపాటు ఆయా జిల్లా కేంద్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రతి రోజు పెద్ద సంఖ్యలో రోగులు, సహాయకులు వస్తుంటారు. జూనియర్ డాక్టర్లపై ఎలాంటి దాడులకు అవకాశం లేకుండా ముందు జాగ్రత్త చర్యగా తగు భద్రతా ఏర్పాట్లు చేయాలని కమిషనర్లు, ఎస్పీలకు డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న ఆస్పత్రులు, కాలేజీల వద్ద తప్పని సరిగా గస్తీలో ఉండే పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించేలా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన చోట ప్రత్యేకంగా పికెటింగ్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న ప్రైవేటు ఏజెన్సీలతో అధికారులు సమావేశమై భద్రతా పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి తగు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఆస్పత్రుల్లో అమర్చిన సీసీ కెమెరాలన్నీ పూర్తిస్థాయిలో పనిచేస్తున్నది లేనిది సరిచూసుకోవాలన్నారు. అవసరాన్నిబట్టి ఎక్కడైనా కొత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సి వస్తే సంబంధిత అధికారులతో చర్చించి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా, త్వరలో జరిగే గణేష్ ఉత్సవాల భద్రతపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఏ చిన్న ఘటన చోటు చేసుకున్నా శాంతిభద్రతల పరంగా ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉండటంతో అందుకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ముగించేందుకు అవసరమైన చర్యలు ఇప్పటి నుంచే చేపట్టాలని కమిషనర్లు, ఎస్పీలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. మండప నిర్వాహకులు, ఉత్సవ కమిటీలతో స్టేషన్ హౌస్ అధికారులు నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు.

పాత పద్ధతులు, పైరవీలు మర్చిపోండి

- ప్రభుత్వ లక్ష్యాల కోసం పని చేయండి
- తప్పు చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించం
- సబ్‌రిజిస్ట్రార్లతో ఇష్టాగోష్ఠిలో పొంగులేటి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. పైరవీలు, పాత పద్ధతులన్నీ మర్చిపోయి, ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయకపోతే ఎంతటివారినైనా ఉపేక్షించబోమని చెప్పారు. విధి నిర్వహణలో ఇసుమంతైనా అవినీతి కనిపించవద్దని వ్యాఖ్యానించారు. ఆదివారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసీహెచ్‌ఆర్‌డీ)లో స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు. "వాళ్లతో, వీళ్లతో చెప్పిస్తూ పైరవీలు చేస్తే ఊరుకునేది లేదు. మీ ఆరోగ్య సమస్యలు, ఇతరత్రా ఇబ్బందులేమైనా ఉంటే తప్పకుండా మానవతా దృక్కోణంలో పరిశీలిస్తాం" అని మాట ఇచ్చారు. అందరూ కష్టపడి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలన్నారు. "భూముల మార్కెట్ ధరలను ప్రాంతాలను బట్టి శాస్త్రీయంగా అధ్యయనం చేసి నిర్ధారించండి" అని మంత్రి సూచించారు. ఇందుకు సంబంధించి మహారాష్ట్ర, కర్ణాటకలో మెరుగైన పద్ధతులు అనుసరిస్తున్నారని, రెండు బృందాలు వెళ్లి పరిశీలించి రావాలని సూచించారు. భూముల మార్కెట్ ధరలను నిర్ధారించిన తర్వాత దశలో మరో ఏజెన్సీతో వాటిని సరిపోల్చుకుంటామని తెలిపారు.

రెండేళ్లలో అన్ని రిజిస్ట్రేషన్ ఆఫీసులు ప్రభుత్వ భవనాల్లోనే

రెవెన్యూ కార్యాలయాల అద్దె, విద్యుత్ చార్జీలు, అద్దె వాహనాల చార్జీలకు అవసరమైన బడ్జెట్‌ను త్వరలోనే క్లియర్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రిజిస్ట్రేషన్ శాఖకు శాశ్వత ప్రభుత్వ భవనాలు అవసరమని, రెండేళ్లలో అన్ని కార్యాలయాలు ప్రభుత్వ భవనాల్లో పని చేసేలా చూస్తామని చెప్పారు. శాఖలో ఉన్న ఉద్యోగ ఖాళీలను త్వరలో భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ కార్యదర్శి, స్టాంపులు-రిజిస్ట్రేషన్ల కమిషనర్ బుద్ధప్రకాశ్ జ్యోతి రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ పనితీరు గురించి మంత్రికి వివరించారు. 2014లో రూ.2,746 కోట్లుగా ఉన్న రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం గతేడాది రూ.14,588 కోట్లకు చేరుకుందని తెలిపారు. రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ వార్షిక నివేదికను మంత్రి ఈ సందర్భంగా విడుదల చేశారు. సమావేశంలో అదనపు ఐజీలు, డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్‌లు, సబ్ రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే.. రాష్ట్రంలో 2036 ఒలింపిక్స్

- క్రీడా సదుపాయాలకు ఇప్పటి నుంచే ప్రణాళికలు
- వచ్చే ఏడాది యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీ: రేవంత్
- గచ్చిబౌలి స్టేడియంలో మారథాన్ 10కె రన్ పోటీలు



మారథాన్ విజేతలకు బహుమతి అందజేస్తున్న సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ/గచ్చిబౌలి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 2036లో భారత్‌లో ఒలింపిక్ గేమ్స్ నిర్వహించే ఆలోచన చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయితే ఆ అవకాశం తెలంగాణకు ఇవ్వాల్సిందిగా తాను ఇటీవల ప్రధానిని కలిసినప్పుడు కోరానని చెప్పారు. తమకు అవకాశం ఇస్తే హైదరాబాద్ వేదికగా ఒలింపిక్ క్రీడలను ఘనంగా నిర్వహిస్తామని ప్రకటించారు. నిర్వహణకు కావాల్సిన అంతర్జాతీయ వసతులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు రూపొందించుకుంటామని అన్నారు. ఆదివారం హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ (హెచ్‌ఆర్ఎస్), ఎన్ఎండీసీ హైదరాబాద్ నిర్వహించిన ఫుల్, ఆఫ్ మారథాన్, 10కె రన్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గచ్చిబౌలి స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడుతూ.. రాష్ట్రంలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లోని క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు వచ్చే ఏడాదిలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తామని అన్నారు. 2000 సంవత్సరంలో గచ్చిబౌలి స్టేడియంలో ఆఫ్రో ఏషియన్ గేమ్స్, మిలిటరీ గేమ్స్‌తోపాటు చాలా ఈవెంట్లను నిర్వహించారని గుర్తు చేశారు. అయితే అంతర్జాతీయ స్థాయిలో ఖ్యాతి గడించాల్సిన సందర్భంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టకపోవడంతో ఈ దేశానికి క్రీడల్లో ఆదర్శంగా నిలవాల్సిన హైదరాబాద్ నగరం ప్రస్తుతం ఆ ప్రాధాన్యత నుంచి పక్కకు జరిగిందన్నారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక క్రీడలను ప్రోత్సహించాలనే ఆలోచనతో ఒక్కొక్క మెట్టు దిశగా అడుగులు వేస్తున్నామని చెప్పారు.

గచ్చిబౌలి స్టేడియం క్రీడా కార్యక్రమాలకే..

రాష్ట్రంలోని యువతను క్రీడలవైపు మళ్లించాలని, క్రీడల పట్ల వారిలో ఆసక్తిని పెంచాలని తమ ప్రభుత్వం సంపూర్ణంగా ఆలోచిస్తోందని సీఎం రేవంత్ అన్నారు. గచ్చిబౌలి స్టేడియం, స్పోర్ట్స్ విలేజ్‌ను 25 ఏళ్ల క్రితం దూరదృష్టితో నిర్మించారని, ఈ స్పోర్ట్స్ విలేజ్‌ను వందశాతం మళ్లీ క్రీడా కార్యక్రమాలకే వినియోగించేలా తమ ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ఇటీవల ముగిసిన ఒలింపిక్స్‌లో మనం అంత గొప్పగా రాణించలేకపోయామని, 2028లో జరిగే ఒలింపిక్స్‌లో తెలంగాణ నుంచే అత్యధికంగా పతకాలు సాధించాలనే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. "గతవారం దక్షిణ కొరియాలోని స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించాను. అక్కడ ఆర్చరీలో మూడు స్వర్ణ పతకాలు సాధించిన అమ్మాయిని కలిశాను. యూనివర్సిటీ మేనేజ్‌మెంట్‌తో మాట్లాడి తెలంగాణలో క్రీడలను అభివృద్ధి చేసేందుకు వారి సహకారం అవసరమని భావించి.. ఆ వర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. నిన్న ఢిల్లీలో కేంద్ర క్రీడల మంత్రిని కలిసి.. రాబోయే ఖేల్ ఇండియా స్పోర్ట్స్‌ను గానీ, జాతీయ క్రీడలను గానీ తెలంగాణ రాష్ట్రానికి ఇవ్వాలని కోరాను. అతి త్వరలో దేశంలో జరిగే ఏ క్రీడలైనా, క్రికెట్‌తో సహా అన్నింటినీ తెలంగాణ నుంచే, ముఖ్యంగా గచ్చిబౌలి ప్రాంతం నుంచే నిర్వహించాలని ఆలోచిస్తున్నాం" అని సీఎం రేవంత్ వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎన్ఎండీసీ ఈడీ జైపాల్‌రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ సొసైటీ వ్యవస్థాపకుడు రాజేష్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

సైకాలజీ సెల్‌కు చెల్లుచీటీ?

ఎస్సీ గురుకులాల్లో మూతబడ్డ స్టూడెంట్ కౌన్సిలింగ్ సెల్‌లు!.. ఎస్‌సీసీల్లోని సిబ్బంది వేరే ప్రాంతాలకు బదిలీ

- ఆ తర్వాత తిరిగి భర్తీ కానీ ఆ స్థానాలు
- ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర విమర్శలు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడం, వారిలోని ఆందోళనలను తగ్గించి మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఎస్సీ గురుకులాల్లో ఏర్పాటు చేసిన సైకాలజీ సెల్ మాయమైందా ? ప్రారంభమైన తొమ్మిది నెలలకే 'స్టూడెంట్ కౌన్సెలింగ్ సెల్ (ఎస్‌సీసీ)'లు మూతపడ్డాయా ? అంటే అవుననే సమాధానమే వస్తోంది. ఎస్సీ గురుకుల పరిధిలో చేపట్టిన సాధారణ బదిలీల్లో ఎస్‌సీసీల్లో ఉన్న సిబ్బందిని వేరే ప్రాంతాలకు బదిలీ చేసిన అధికారులు ఆయా స్థానాలను తిరిగి భర్తీ చేయకపోవడమే ఇందుకు ముఖ్య కారణం. అంతేకాక, మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చినా ఉన్నతాధికారులు స్పందించకపోవడం మరో కారణం. ఎస్సీ గురుకులాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల మానసిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా అధికారులు ఇంటర్వ్యూలు చేసి 2023 డిసెంబరులో నలుగురితో సైకాలజీ టీమ్(రాష్ట్ర స్థాయి) ఏర్పాటు చేశారు. ఈ బృందానికి స్టూడెంట్ కౌన్సిలింగ్ సెల్ అనే పేరు పెట్టారు. ఇది ఏర్పాటై తొమ్మిది నెలలవుతున్నా విద్యార్థులకు అవగాహన తరగతులు నిర్వహించిన దాఖలాలు లేవు. సెల్ ఏర్పాటుకు హడావిడి చేసిన అధికారులు తరగతుల నిర్వహణకు వసతులు కల్పించలేదనే ఆరోపణలు ఉన్నాయి.

టీచర్లకు శిక్షణ ఇచ్చారు.. కానీ..

మానసికంగా ఇబ్బంది పడుతున్న విద్యార్థులను గుర్తించి, వారికి ఎస్‌సీసీ ద్వారా కౌన్సిలింగ్ ఇప్పించేందుకు గాను దాదాపు 13 రీజియన్ల నుంచి (ఒక్కో రీజియన్‌లో 20 పాఠశాలలు ఉంటాయి) ఒక ప్రిన్సిపాల్, నలుగురు ఉపాధ్యాయులు కలిపి ఐదుగురు చొప్పున 65 మందిని ఎంపిక చేసి హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చారు. వీరితో మిగిలిన పాఠశాలల్లోని సిబ్బందికి శిక్షణ ఇప్పించారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత ప్రతీ స్కూల్‌లో స్టూడెంట్ కౌన్సెలింగ్ సెల్ కో-ఆర్డినేటర్‌ను నియమించారు. ఆ సమయంలోనే విద్యార్థుల మానసిక స్థితి ప్రకారం గ్రీన్, ఎల్లో, ఆరెంజ్, రెడ్ అనే విభాగాలుగా విభజించి తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా దాదాపు 1300 మంది విద్యార్థులు రెడ్ కేటగిరీలో ఉన్నట్టు గుర్తించారు. కోపం ఎక్కువగా ఉన్నవారు, చిన్న విషయాన్ని పెద్దదిగా చూడడం, చిన్న బాధలను త్వరగా మరచిపోలేకపోవడం వంటి సమస్యలతో బాధపడుతున్న వారిని రెడ్ కేటగిరీలో పెట్టారు. వీరికి తొలుత జిల్లా స్థాయిలోని 'డిస్ట్రిక్ట్ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్' వారితో కౌన్సిలింగ్ ఇప్పిస్తారు. ఆ తర్వాత కూడా పరిస్థితి మెరుగుపడకపోతే రాష్ట్ర స్థాయి బృందానికి సిఫారసు చేస్తారు. మొత్తంగా విద్యార్థుల మానసిక ఆరోగ్యం సాధారణ స్థితికి వచ్చే వరకు అండగా ఉంటారు. కానీ, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం నెరవేర లేదు.

ప్రముఖులు ముందుకొచ్చినా పట్టించుకోరే?

విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు తాము ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామంటూ పలు స్వచ్ఛంద సంస్థలు, పలువురు ప్రముఖులు ముందుకొచ్చినా ఎస్సీ గురుకుల ఉన్నతాధికారులు పట్టించుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. 80గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు మానసిక ఉల్లాస పాఠాలు చెప్పేందుకు తమ బృందాలను పంపిస్తామని టాలీవుడ్‌కు చెందిన ప్రముఖ హీరో సతీమణి నిర్వహిస్తున్న సంస్థ ప్రతిపాదన పంపితే అధికారులు స్పందించలేదని సమాచారం. అలాగే, మానసిక ఉల్లాస తరగతుల నిర్వహణపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని ముందుకొచ్చిన మైసూరుకు చెందిన ఓ సంస్థ కూడా అధికారుల తీరుతో వెనక్కివెళ్లిపోయినట్టు తెలిసింది.



ఎన్ కన్వెన్షన్ కూల్చివేసిన స్థలాన్ని పరిశీలిస్తున్న నారాయణ

నాగార్జునకు ఎందుకంత కక్కుర్తి?

» సీఎం రేవంత్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం: నారాయణ

మాదాపూర్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో నాగార్జునేమీ సత్య హరిశ్చంద్రుడు కాదని, ఆయన ఎన్-కన్వెన్షన్ మీద రోజుకు రూ.లక్షలు సంపాదించారని సీపీఐ జాతీయ నేత కె.నారాయణ ఆరోపించారు. పేదలు గజం స్థలం ఆక్రమిస్తేనే రాద్ధాంతం చేసే అధికారులు, పాలకులు.. నాగార్జున చెరువును ఆక్రమించి భారీ నిర్మాణం చేసినా ఏళ్ల తరబడి చోద్యం చూస్తూ ఉండిపోయారని మండిపడ్డారు. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. ఖానామెట్‌లో హైడ్రా అధికారులు కూల్చివేసిన ఎన్-కన్వెన్షన్‌ను ఆదివారం పార్టీ నాయకులతో కలిసి నారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇన్నేళ్లుగా నాగార్జున రోజుకు ఎంత సంపాదించారో తేల్చి, ఆ సొమ్మును రాబట్టాలని డిమాండ్ చేశారు. ఆ డబ్బుతో పేదలకు ఇళ్లు కట్టించాలని కోరారు. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, కాలువలను బడాబాబులు కబ్జా చేసి భారీ నిర్మాణాలు చేపట్టారని, వీటిపై గతంలో తాము పోరాటాలు చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. "ఎన్- కన్వెన్షన్ అధినేత నాగార్జున బిగ్‌బాస్‌కే బాస్ కావచ్చు. హీరో కావచ్చు. సినిమాల్లో నటించడంతోపాటు బిగ్‌బాస్ ద్వారా ఆయనకు రూ.వందల కోట్లు వస్తాయి. నాగార్జునకు ఎందుకంత కక్కుర్తి? చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఫంక్షన్ హాల్ కట్టడం ఏంటి? ఎన్-కన్వెన్షన్‌లో సంపాదించిన డబ్బును కక్కించాలి" అని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మాజీ మంత్రి మల్లారెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి చెరువుల్లో కాలేజీలు కట్టారని, ఫిరంగి నాలాను కబ్జా చేసి ఇళ్లు కట్టుకున్నారని ఆరోపించారు. హైడ్రా ఆరంభ శూరత్వంగా ఉండకూడదని, ఎక్కడ కబ్జా జరిగినా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజకీయ కక్ష సాధింపులు వద్దు..

ఒకే పార్టీ, ఒకే వర్గం మీద కక్ష సాధింపు మంచిది కాదని, ఎవరు ఆక్రమించినా హైడ్రా కూల్చివేతలు చేపట్టాలని నారాయణ చెప్పారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు నోటరీ భూముల్లో ఇళ్లు కట్టుకున్నారని, అలాంటి వారికి క్రమబద్ధీకరించాలి కానీ, పొట్ట కొట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ఏ పార్టీ వారైనా అక్రమ నిర్మాణం చేపడితే కూల్చివేయాలని, తాము కూడా హైడ్రా కూల్చివేతలను పరిశీలిస్తామని చెప్పారు. మజ్లిస్ నేతలకు సంబంధించిన అక్రమ నిర్మాణాలనూ నేలమట్టం చేయాలని ఆయన అన్నారు.

హైడ్రా పేరుతో జనాన్ని భయపెడుతున్నారు

» రాష్ట్ర మంత్రుల్లో సమన్వయ లోపం: కూనంనేని

బాలసముద్రం, ఆగస్టు 25: రాష్ట్ర మంత్రుల్లో సమన్వయ లోపం కనిపిస్తోందని సీపీఐ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. మంత్రుల మాటలకు చేతలకు పొంతన ఉండడం లేదని చెప్పారు. ఒకరు చెప్పినదానికి మరొకరు చెప్పేదానికి సంబంధమే ఉండడం లేదన్నారు. ఆదివారం హనుమకొండలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సామాన్యులు, పేదలు ఇళ్లు నిర్మించుకుంటే కూల్చి వేస్తామంటూ హైడ్రా పేరుతో జనాలను భయపెడుతున్నారన్నారు. హైడ్రా నుంచి సామాన్యులకు విముక్తి కల్పించాలని కోరారు. హైదరాబాద్‌లో సినీ నటుడు నాగార్జున ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన ఎన్ కన్వెన్షన్‌ను కూల్చివేయడం సరైందేనన్నారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీలు మారే ఎమ్మెల్యేలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు నూతన చట్టాలను రూపొందించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీతో సఖ్యతగా ఉంటూనే సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే సెప్టెంబరు 17న తెలంగాణ సాయుధ పోరాట ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలన్నారు.

హైడ్రా పరిధిని జిల్లాలకూ విస్తరించండి

» సీఎంకు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అడ్లూరి వినతి

హైదరాబాద్, జగిత్యాల అర్బన్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఏర్పాటు చేసిన హైడ్రా పరిధిని రాష్ట్రస్థాయికి విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. వారిద్దరు జగిత్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలోని అక్రమ నిర్మాణాలు, వ్యాపార సంస్థలనూ తొలగించాలన్నారు. ఈ మేరకు ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి వారు లేఖ కూడా రాశారు. సీఎం రేవంత్ రెడ్డి జంట నగరాల్లో ఆక్రమణల తొలగింపునకు తీసుకున్న నిర్ణయం, హైడ్రా చట్టం అమలు చేయడం అభినందనీయం అన్నారు. ఈ నిర్ణయంతో జంట నగరాల ప్రజలు, పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ చట్టాన్ని జంట నగరాలకే పరిమితం చేయకుండా జిల్లా, పట్టణ కేంద్రాలకు విస్తరింపజేయాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. హైడ్రా పరిధి పెంచలేని పక్షంలో కలెక్టర్, ఎస్పీలకు బాధ్యతలు అప్పగించి రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

ప్రభుత్వ ఆఫీసులనూ కూల్చేస్తారా?

» 'హైడ్రా'పై మజ్లిస్ చీఫ్ ఒవైసీ ఆగ్రహం

హైదరాబాద్, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేతలపై మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చెరువుల ఎఫ్‌టీఎల్‌లో నిర్మించిన భవనాలను కూల్చివేస్తున్న అధికారులు.. ఆ పరిధిలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను సైతం కూల్చివేస్తారా? హుస్సేన్ సాగర్ వద్ద నిర్మించిన ప్రభుత్వ కార్యాలయాలను ఏం చేస్తారని నిలదీశారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం భవనాన్ని నీటి కుంటలో నిర్మించారని, దాన్ని కూల్చేస్తారా అని ప్రశ్నించారు. ఆదివారం ఒవైసీ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన నెక్లెస్ రోడ్‌ను తొలగిస్తారా? అని హైడ్రా అధికారుల తీరుపై మండిపడ్డారు. హైదరాబాద్‌లో పలుచోట్ల ప్రభుత్వ కార్యాలయాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయన్నారు. హిమాయత్ సాగర్ సమీపంలో కేంద్ర సంస్థ సీసీఎంబీ నిర్మించారన్నారు. గోల్కొండలోని చెరువులో గోల్ఫ్ కోర్టు ఉందని.. అక్కడ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులు గోల్ఫ్ ఆడతారన్నారు. ఈ కూల్చివేతల విషయంలో తమ పార్టీ విధానాన్ని అధికారులకు తెలియజేశామని, ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో చూస్తామన్నారు. విలువైన వక్ఫ్ ఆస్తులను కాజేసేందుకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ 2024 బిల్లును తీసుకొచ్చిందని ఒవైసీ విమర్శించారు.

చెరువులు, కుంటలను రక్షించాలి

» సామాజిక కార్యకర్త డాక్టర్ లుబ్నా సర్వత్

పంజాగుట్ట, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లో చెరువులు, కుంటలను పరిరక్షించాలని, ఆక్రమణలను తొలగించి కబ్జాల నుంచి విముక్తి చేయాలని సామాజిక కార్యకర్త డాక్టర్ లుబ్నా సర్వత్ కోరారు. టీం క్లైమేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో డాక్టర్ లుబ్నా సర్వత్ అధ్యక్షతన ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'హైడ్రాలజీ ఆఫ్ లేక్స్, హైడ్రా మన నీటి వనరుల పునరుద్ధరణ' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా లుబ్నా సర్వత్ చెరువులు, కుంటల కబ్జా తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. చెరువులు, కుంటలు, నదులు, కాలువలు కబ్జా అవుతున్నాయని తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల కబ్జా, అక్రమ నిర్మాణాలపై ఉన్నత న్యాయస్థానం, గ్రీన్ ట్రిబ్యునల్‌లో 14 పిల్‌లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడం హర్షదాయకమని లుబ్నా సర్వత్ పేర్కొన్నారు. హైడ్రా విధివిధానాలు లేని సంస్థ అని సామాజిక కార్యకర్త బి.కృష్ణ మోహన్ విమర్శించారు. న్యాయ వ్యవస్థలో న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.



గాజులరామారంలోని చింతల్ చెరువులో హైడ్రా కూల్చివేసిన నిర్మాణాలు (ఫైల్)



ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు పరిధిలోని నిర్మాణం కూల్చివేత (ఫైల్)

చెరువుల చెర.. వారి పనే!

(మొదటిపేజీ తరువాయి)

ఈ విషయం స్పష్టమైంది. ఈవీడీఎం, హైడ్రా మూడు నెలల్లో 18 ప్రాంతాల్లోని చెరువుల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం (ఎఫ్‌టీఎల్) పరిధి, బఫర్ జోన్, పార్కుల్లో పడగొట్టిన ఆక్రమణల్లో సింహభాగం రాజకీయ, వ్యాపార ప్రముఖులవే. ఇందులో 'ఎన్' కన్వెన్షన్ సెంటర్ కూడా ఉంది. గండిపేట, తమ్మిడికుంట, బుమ్‌రుఖ్‌దౌలా చెరువుల్లో నేరుగా కబళించగా, కొన్ని చోట్ల పేదలను ముందు పెట్టి కబ్జాకు పాల్పడ్డారు. కాగా, ఇప్పటివరకు 43.94 ఎకరాల్లో ఉన్న ఆక్రమణలను తొలగించినట్లు హైడ్రా ఆదివారం ప్రకటించింది.

అపాత్ర'దానం'

హైదరాబాద్‌లో ఖరీదైన జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లోనూ కబ్జాకాండ కొనసాగుతోంది. జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లోని పార్కు స్థలంలో ఆక్రమణలు వెలిశాయి. దీనివెనుక ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పాత్ర ఉందని హైడ్రా గుర్తించింది. ఆక్రమణల తొలగింపుతో ఆగ్రహించిన దానం.. హైడ్రా, కమిషనర్ రంగనాథ్‌పై తీవ్ర విమర్శలు చేశారు. అయితే, ఆక్రమణల తొలగింపు, హైడ్రాకు వ్యతిరేకంగా మాట్లాడితే ఉపేక్షించేది లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాగా, జూబ్లీహిల్స్ లోటస్‌పాండ్‌లోని ఫిల్మ్‌నగర్ కో ఆపరేటివ్ సొసైటీ ప్లాట్ నంబర్ 20 పక్కనున్న పార్కు స్థలంలో ప్రహరీ నిర్మించి వ్యర్థాలతో నింపారు. దీనిపై ఫిర్యాదు రావడంతో రంగంలోకి దిగిన హైడ్రా.. కాంపౌండ్‌ను కూల్చి స్థలాన్ని స్వాధీనం చేసుకుంది. బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని పార్కు స్థలంలో రేకుల షెడ్లు నిర్మించగా కూల్చివేసింది. మిథిలానగర్‌లోనూ పార్కు ప్రదేశంలో రేకుల షెడ్లు వేయగా పడగొట్టింది. ఫిల్మ్‌నగర్‌లోని బీజేఆర్ నగర్, అమీర్‌పేటలో నాలాలపై కొనసాగుతున్న నిర్మాణాలను తొలగించారు.

'ఎన్'లో 4.9 ఎకరాలలో కూల్చివేతలు

ఖానామెట్‌లోని తమ్మిడికుంట చెరువులో సినీ నటుడు అక్కినేని నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను తెల్లవారుజామునే పడగొట్టడం సంచలనం రేపింది. 14 ఏళ్ల క్రితం నిర్మించి.. కోర్టు స్టేల ద్వారా చర్యలు ఆగిన నిర్మాణంపై చర్యలు చేపట్టడం తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న 3.30 ఎకరాల్లో రెండు భారీ, ఆరు సాధారణ షెడ్లను కూల్చివేశారు. మొత్తంగా 4.9 ఎకరాల స్థలంలో నిర్మాణాల కూల్చివేత జరిగిందని హైడ్రా పేర్కొంది.

సినీ ఫక్కీలో కబ్జా.. చోటా నేత తెలివితేటలు

గాజులరామారంలోని చింతల్ చెరువు ఆక్రమణ సినిమాను తలపించేలా జరిగింది. శిఖం పట్టా భూముల యజమానులతో బీఆర్‌ఎస్ స్థానిక నాయకుడు రత్నాకరం సాయిరాజు ముందుగా ఒప్పందం కుదుర్చుకున్నాడు. పేదలకు డబ్బులిచ్చి చెరువులో చిన్న గదులు నిర్మించాడు. అనంతరం 80, 100, 120 చదరపు గజాల చొప్పున మొత్తం 54 ప్లాట్లు చేసి అమ్మాడు. బయటితో పోలిస్తే తక్కువ ధర కావడంతో మధ్య తరగతి వర్గాలు కొనుగోలుకు ఆసక్తి చూపాయి. అయితే, పూర్తిగా ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చి.. ఈ నెల 6వ తేదీన మొత్తం 54 నిర్మాణాలను పడగొట్టింది. కాగా, ఒక్కో గది నిర్మాణానికి రూ.50 వేల నుంచి రూ.80 వేల వరకు ఖర్చుపెట్టిన సాయిరాజు.. ప్లాట్ల ద్వారా రూ.కోట్లు సంపాదించాడు. ఇందులో భూ యజమానులకు కొంత, గదులు నిర్మాణం చేపట్టిన పేదలకు కొంత పంచినట్లు హైడ్రా గుర్తించింది. గాజులరామారంలోని భూదేవిహిల్స్ పరికి చెరువు బఫర్ జోన్‌లో నిర్మించిన బేస్‌మెంట్లను, మహదేవపురం పార్కులో నిర్మాణంలో ఉన్న రెండంతస్తుల భవనాన్ని, చందానగర్ ఈర్ల చెరువులో జీహెచ్‌ఎంసీ అనుమతి పొందినా.. ఎఫ్‌టీఎల్‌లో ఉండడంతో జి ప్లస్ 3, జి ప్లస్ 4 భవనాలను హైడ్రా పడగొట్టింది. నిర్మాణ పనులు పూర్తికాకముందే పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు నివాసయోగ్య పత్రం (ఓసీ) ఇచ్చినట్టు గుర్తించింది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) అనుమతులతో స్టిల్ట్ ప్లస్ ఐదంతస్తులుగా నిర్మించిన 3 భవనాలు ప్రగతినగర్ ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉండడంతో నేలమట్టం చేసింది. బోడుప్పల్‌లోని ఓ ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ.. 12 ఎకరాలు

రాజేంద్రనగర్ బుమ్‌రుఖ్‌దౌలా చెరువులో ఆక్రమణలది పెద్ద కథే. ఇక్కడ కూల్చివేత సంచలనంగా మారింది. ఎఫ్‌టీఎల్‌లో ఏకంగా 12 ఎకరాలలో జి ప్లస్ 2 భవన నిర్మాణాలు చేపట్టారు. కూల్చివేతను అడ్డుకునేందుకు వచ్చిన ఎంఐఎం ఎమ్మెల్యే మహ్మద్ ముబిన్, ఇతర నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఆక్రమణల తొలగింపు సందర్భంగా ఎమ్మెల్యే అరెస్టు ఎంఐఎం అగ్ర నేతలకు కోపం తెప్పించింది. హైడ్రాను రద్దు చేయాలంటూ ఆ పార్టీ కార్పొరేటర్లు మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. బుమ్‌రుఖ్‌దౌలా చెరువులో భవనాలు నిర్మించి విక్రయించడంలో ముబిన్‌తో పాటు ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రహ్మత్‌బేగ్ పాత్ర ఉందని హైడ్రా ప్రకటించింది.

'గండి'కొట్టిన పెద్దలు

ఒకనాడు జంట నగరాల తాగునీటి వనరులు ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్. ఇప్పుడు వీటి చుట్టూ కోకొల్లలుగా ఆక్రమణలు వెలిశాయి. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో కొందరు రాజకీయ, వ్యాపార ప్రముఖులు ఇంద్రభవనాల్లాంటి అతిథి గృహాలు నిర్మించారు. వరద వచ్చే కాల్వల్లో అత్యధికం కనుమరుగయ్యాయి. దీంతో మురుగంతా జంట జలాశయాల్లో చేరుతోంది. గండిపేట ఎఫ్‌టీఎల్‌లో.. ఖానాపూర్ గ్రామ పరిధిలో 8.75 ఎకరాలు, చిలుకూరులో 6.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భవనాలను ఈ నెల 18న హైడ్రా నేలమట్టం చేసింది. ఇక్కడ రక్షణ శాఖ మాజీ మంత్రి పళ్లం రాజు, కావేరి సీడ్స్ యజమాని జీవీ భాస్కర్‌రావు, మంథనిలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన సునీల్‌రెడ్డి, ప్రొ కబడ్డీ లీగ్ యజమాని అనుపమలకు చెందిన భవనాలను ఉండడం గమనార్హం. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోనూ మంత్రులు, మాజీ మంత్రులు, ఇతరుల అతిథి గృహాలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతోంది. దీని ఎఫ్‌టీఎల్ నోటిఫై చేయనందున నిర్మాణాలపై చర్యల విషయంలో ప్రతిష్టంభన నెలకొంది. అధికార పార్టీకి చెందినవారి నిర్మాణాలు ఉన్నందునే ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కాలేదనే అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో గతంలో నిర్ధారించిన ఎఫ్‌టీఎల్‌ను ప్రామాణికం చేసుకుని చర్యలు తీసుకునే విషయమై ప్రభుత్వం నుంచి హైడ్రా స్పష్టత కోరింది. సర్కారు నిర్ణయం అనంతరం చర్యలు ఉంటాయని సంస్థ వర్గాలు చెబుతున్నాయి.

ఆక్రమణదారులు.. బాధ్యులైన అధికారులపై చర్యలు: రంగనాథ్



చెరువులు, పార్కులు కబ్జాకు పాల్పడినవారిపై చట్టపరమైన చర్యల దిశగా హైడ్రా కసరత్తు చేస్తోంది. భారత న్యాయ సంహిత(బీఎన్ఎస్) ప్రకారం ప్రభుత్వ ఆస్తులను ఆక్రమిస్తే ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయవచ్చనే విషయాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు. వీటి విచారణ కోసమే త్వరలో హైడ్రా పోలీస్‌స్టేషన్ రానుంది. చందానగర్ ఈర్ల చెరువు, ప్రగతినగర్ ఎర్రకుంట చెరువులో భవన నిర్మాణాలకు అనుమతిచ్చిన జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపైనా చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నారు. కాగా, నిర్మాణదారులతో పాటు వారికి సహకరించినవారిపై ప్రత్యేక దృష్టిసారించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. కొన్ని చెరువుల ఎఫ్‌టీఎల్ నోటిఫైకి ప్రభుత్వం ఆదేశించిందని.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాల కూల్చివేత కొనసాగుతుందని స్పష్టం చేశారు. అక్రమాలకు సహకరించిన అధికారులపై కచ్చితంగా చర్యలు ఉంటాయన్నారు.

ఒక్క సెంటు కూడా ఆక్రమించలేదు..

» సినీ నటుడు అక్కినేని నాగార్జున

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్ కన్వెన్షన్ సెంటర్‌కు సంబంధించిన వస్తున్న వార్తల్లో వాస్తవాల కంటే ఊహాగానాలే అధికంగా ఉన్నాయని సినీ నటుడు అక్కినేని నాగార్జున అన్నారు. తాము ఎన్ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మించిన భూమి పట్టా భూమి అని, ఒక్క సెంటు కూడా ఆక్రమించింది కాదని పేర్కొంటూ ఎక్స్‌లో ఆదివారం ఓ పోస్టు పెట్టారు. తమ్మిడికుంట చెరువు ఆక్రమణకు గురికాలేదని ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) యాక్ట్ ప్రత్యేక న్యాయస్థానం 2014 ఫిబ్రవరి 24న తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణం, చట్టబద్ధతపై హైకోర్టును ఆశ్రయించానని, న్యాయస్థానం ఇచ్చే తీర్పుకు కట్టుబడి ఉంటానని తెలిపారు. అప్పటి దాకా ఊహాగానాలు, పుకార్లను నమ్మవద్దని అభిమానులను, శ్రేయోభిలాషులను ఆయన కోరారు.

సామాన్యుల జోలికొస్తే ఊరుకోం

» పెద్దల అక్రమ కట్టడాలను కూల్చివేయడం సంతోషమే: ఈటల

మల్కాజిగిరి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): చెరువు, బఫర్ జోన్‌లలో నిర్మించిన పెద్దల అక్రమ నిర్మాణాలను హైడ్రాతో కూల్చివేయించడం సంతోషమే కానీ.. అదే ముసుగులో సామాన్యుల నిర్మాణాలను పడగొడతామంటే ఊరుకోబోమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని సాహెబ్‌నగర్, సరూర్‌నగర్ చెరువు, ఫాక్స్‌సాగర్ చుట్టూ ఇళ్లు కట్టుకున్న వారు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. మధ్య తరగతి ప్రజలను ఆందోళనకు గురిచేయడం తగునా? అని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. సమస్యల నుంచి పక్కదారి పట్టించేందుకే హైడ్రాను ముందుకుతెచ్చారని ఆరోపించారు. ప్రజలు దీనంతటినీ గమనిస్తున్నారని అన్నారు. ఆదివారం మల్కాజిగిరిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఈటల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ.. కేసీఆర్ కూడా అధికారంలోకి వచ్చిన కొత్తలో అయ్యప్ప సొసైటీలో భవనాలను కూల్చే ప్రయత్నం చేసి తోక ముడిచారని, తర్వాత ఏం జరిగిందో చూశామని అన్నారు. బతుకమ్మ కుంటను పూడ్చింది ప్రభుత్వం కాదా? దమ్ముంటే ప్రభుత్వమే పూడ్చిన చెరువుల మీద చర్యలు తీసుకోవాలని ఈటల సవాల్ విసిరారు. అసలు ఇలాంటి చెరువులు ఎన్ని ఉన్నాయో లెక్క తేల్చాలని డిమాండ్ చేశారు. వాటిని తిరిగి చెరువులుగా మారుస్తారా? లేదా? అని ప్రశ్నించారు. ఉమ్మడి ఏపీలో 40 ఏళ్లు కాంగ్రెస్సే అధికారంలో ఉందని.. చెరువుల్లో నిర్మాణాలకు అనుమతులిచ్చింది కూడా ఆ పార్టీ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు. రక్త సంబంధం కన్నా పార్టీతో ఉన్న సంబంధమే తనకు ఎక్కువ అని ఈటల స్పష్టం చేశారు. మీరు పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఎల్లప్పుడూ వెంటే ఉంటానన్నారు. పార్టీ పని తప్ప తనకు ఇతర పనులు లేవని ఆయన స్పష్టం చేశారు.

ఆక్రమణల కూల్చివేతలు.. భగవద్గీత స్ఫూర్తితోనే

(మొదటిపేజీ తరువాయి)

మంచిపనులు కూడా చేయాలన్నది నా ప్రగాఢ విశ్వాసం. ఆ క్రమంలోనే చెరువులను కబ్జాదారుల చెర నుంచి విముక్తి చేయాలన్న ఏకైక లక్ష్యంతో.. మా మీద ఎంత ఒత్తిడి వచ్చినా, ఎవరినీ వదలకుండా ఆక్రమణదారులపై ఉక్కుపాదం మోపుతున్నాం" అని ముఖ్యమంత్రి అన్నారు. ఆదివారం హరేకృష్ణ భక్తి ఉద్యమం ఆధ్వర్యంలో కోకాపేటలో చేపట్టిన హరేకృష్ణ హెరిటేజ్ టవర్స్ నిర్మాణ ప్రక్రియలోని అనంత శేష స్థాపన కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఆయనకు విద్యార్థులు వేద మంత్రోచ్చారణలతో ఘనస్వాగతం పలికారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన భూమి పూజలో పాల్గొన్న అనంతరం సీఎం కీలకోపన్యాసం చేశారు. "హైదరాబాద్‌ను వరదల నుంచి సంరక్షించడం కోసం ఆనాడు నిజాం ప్రభుత్వం.. మోక్షగుండం విశ్వేశ్వరయ్య లాంటి నిపుణుల సూచనలతో హియాయత్ సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాలను నిర్మించింది. మొన్నటికి మొన్న కృష్ణా, గోదావరి ఎండిపోయి, వేసవిలో తాగునీటి సమస్య వస్తే.. ఈ జలాశయాలే నగరవాసుల దాహార్తిని తీర్చాయి. అలాంటిది కొంతమంది శ్రీమంతులు, గొప్పవ్యక్తులుగా పేరుపొందిన వారు చెరువుల్లో ఫాంహౌస్‌లు నిర్మించుకొని, వాటి నుంచి పారే మురుగు కాల్వలను నగరానికి తాగునీరు సరఫరా చేసే జంట జలాశయాల్లో కలిపారు. సామాన్యుల తాగునీటి చెరువుల్లో మురుగు నీరు కలపడాన్ని చూస్తూ ఊరుకొంటే, అక్రమ నిర్మాణాలను అలానే వదిలేస్తే ఇక నేను ప్రజాప్రతినిధిగా విఫలమైనట్టా? కాదా?" అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అందుకే తనపై ఎంత ఒత్తిడి వచ్చినా, మిత్రులకు ఫాంహౌస్‌లున్నా.. ఏవీ వదలకుండా హైడ్రా సంస్థను ఏర్పాటు చేశామని, చెరువుల్లో ఉన్న అక్రమ కట్టడాలను కూలగొడుతున్నామని ఆయన వివరించారు.

కక్ష సాధింపులకు తావు లేదు..

చెరువులను ఆక్రమించిన వారిలో కొందరు ప్రభుత్వాన్ని, సమాజాన్ని అత్యంత ప్రభావితం చేయగలిగిన స్థానాల్లో ఉన్నారని సీఎం రేవంత్ తెలిపారు. మరికొందరు ప్రత్యక్షంగా ప్రభుత్వంలో భాగస్వాములుగానూ ఉండవచ్చునని, అయినా.. వాటన్నింటినీ పట్టించుకోదలచుకోలేదన్నారు. ఇది రాజకీయాలకు సంబంధం లేనిదని, కొందరు రాజకీయ నాయకులను దృష్టిలో ఉంచుకొని చేపట్టిన కార్యక్రమం కాదని స్పష్టం చేశారు. ఇందులో ఎలాంటి కక్ష సాధింపులకు తావు లేదని పేర్కొన్నారు. "ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తే అది మన మీద కక్ష కడుతుంది. ప్రకృతి ప్రకోపిస్తే ఏం జరుగుతుందో చెన్నై, ఉత్తరాఖండ్, కేరళలోని వయనాడ్ ఉదంతాలను చూశాం. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అయినా హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. అందుకే నగరంలోని చెరువులను కాపాడే బాధ్యతను మా ప్రభుత్వం తీసుకుంది. ఎవరేమి అనుకున్నా, మా మీద ఎన్ని ఒత్తిళ్లు తెచ్చినా.. వాటన్నింటినీ పక్కనబెట్టి మరీ చెరువులను ఆక్రమించుకున్న వాళ్ల భరతం పడతాం. మా ప్రభుత్వం తలపెట్టిన ఈ ధర్మ యుద్ధానికి ప్రజలంతా అండగా నిలవాలి, సహకరించాలి" అని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు.



హైదరాబాద్‌లోని కోకాపేట్‌లో హరేకృష్ణ హెరిటేజ్ టవర్‌కు భూమి పూజ చేస్తున్న సీఎం రేవంత్

మధ్యాహ్న భోజనానికి హరేకృష్ణ సహకారం..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు హరేకృష్ణ సంస్థ సహాయం కోరినట్లు సీఎం రేవంత్ తెలిపారు. దీంతోపాటు నగరంలోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్, నిలోఫర్, క్యాన్సర్ ఆస్పత్రికి వచ్చే నిరుపేదలకు నాణ్యమైన భోజనం అందించేందుకు అక్షయపాత్ర సహకారం అవసరమని అన్నారు. భోజన కేంద్రాల నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. హరేకృష్ణ సంస్థ చేపట్టే ప్రతి కార్యక్రమానికీ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ హరేకృష్ణ హెరిటేజ్ టవర్స్ నిర్మాణంతో నగరం ఆధ్యాత్మిక ధామానికి నెలవుగా మారుతుందన్నారు. చెరువుల పరిరక్షణకు సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనదన్నారు. హైడ్రా పనితీరును కొనియాడారు. కాగా, ప్రజలను చైతన్యమార్గంలో నడిపించడమే ఈ మహా నిర్మాణం ముఖ్య ఉద్దేశమని అక్షయపాత్ర వ్యవస్థాపకుడు మధుపండిట్ దాస తెలిపారు. శ్రీరామ, వెంకటేశ్వర, కృష్ణబలరామ అవతార తదితర దేవాలయాల సమూహంతో పాటు అత్యాధునిక వసతులతో కూడిన సభా మందిరాలు, ధ్యాన కేంద్రాలను హెరిటేజ్ టవర్స్‌లో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హరేకృష్ణ ఉద్యమం తెలుగు రాష్ట్రాల బాధ్యుడు సత్యగౌరస్వామి తదితరులు పాల్గొన్నారు. కాగా మందిర నిర్మాణానికి వాతం మహేశ్, ప్రదీప్ అగర్వాల్ రూ.7.5 కోట్ల చెక్కును సీఎం రేవంత్ చేతులమీదుగా నిర్వాహకులకు అందించారు.

కాంగ్రెస్ కండువా కప్పుకోకుంటే కేసులా?

» మా ఎమ్మెల్యేలపై సర్కార్ వేధింపులు

» ఎమ్మెల్యే పల్లాపై అక్రమ కేసు

» హైడ్రా పేరుతో రాజకీయ కుట్ర: హరీశ్

» ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదు: పల్లా



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ కండువా కప్పుకోండి.. కాదు.. లేదంటే.. మీపై అక్రమ కేసులు పెడతాం.. మీ ఆస్తులు కూల్చేస్తాం.. మిమ్మల్ని టార్గెట్ చేస్తాం" అంటూ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను వేధిస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షాలను ఇబ్బంది పెట్టేలా కాంగ్రెస్ సర్కారు రాజకీయాలు చేస్తోందని, రాజకీయంగా ఎదుర్కొనలేకనే వేధింపులకు పాల్పడుతోందని ఆరోపించారు. మొన్న పటాన్‌చెరు ఎమ్మెల్యేపై అక్రమ మైనింగ్ కేసు పెట్టి.. రూ.300 కోట్ల జరిమానా వేసి ఇబ్బందులకు గురిచేసి.. కాంగ్రెస్ కండువా కప్పారని, ఆ వెంటనే మైనింగ్ కేసు అటకెక్కించారన్నారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని ఇబ్బంది పెట్టేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇప్పటివరకు ఆరు కేసులు పెట్టారని, పల్లాతోపాటు ఆయన భార్య, పిల్లలపైనా కేసులు పెట్టారన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు లక్ష్యంగా.. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో రాజకీయ కుట్ర చేస్తోందని ఆరోపించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డి కాలేజీలు ప్రభుత్వ భూమిలో ఉంటే బయటపెట్టాలని, 24గంటల్లో ఆయనే వాటిని తొలిగిస్తారని చెప్పారు. రాజకీయ కక్షలను విద్యాసంస్థలు, ఆస్పత్రులపై రుద్దడం తగదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. వ్యక్తిగతంగా తనపై కాంగ్రెస్ ప్రభుత్వం దాడి చేస్తోందని, 9 నెలలుగా తనపై వేధింపులు మొదలయ్యాయని ఆరోపించారు. తాను 25 ఏళ్ల క్రితమే విద్యాసంస్థలు ప్రారంభించానని, అక్రమ నిర్మాణాలంటూ తన మెడికల్ కాలేజీని కూల్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. తన భూమిలో మాత్రమే నిర్మాణాలు చేపట్టామని, కబ్జా చేశానని నిరూపిస్తే వాటిని కూల్చడానికి కూడా సిద్ధమేనని ఆయన స్పష్టం చేశారు. కాగా, మంచిర్యాల ఎమ్మెల్యే వేధింపులు భరించలేక గొంతు కోసుకొని ఆత్మహత్యా యత్నం చేసి యశోద ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న నస్పూర్ మునిసిపల్ కౌన్సిలర్ బేర సత్యనారాయణను హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. అదే ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బీఆర్‌ఎస్ నేత జిట్టా బాలకృష్ణారెడ్డినీ ఆయన పరామర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డి

తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా లచ్చిరెడ్డి ఏకగ్రీవ ఎన్నిక

- 65 ఉద్యోగ సంఘాల భాగస్వామ్యం
- ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి: లచ్చిరెడ్డి

హైదరాబాద్/బర్కత్‌పుర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆవిర్భవించింది. 65 ఉద్యోగ సంఘాల భాగస్వామ్యంతో దీనిని ఏర్పాటు చేశారు. నగరంలోని బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, సీపీఎస్, పెన్షన్, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు లచ్చిరెడ్డిని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న పలువురు ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ పెద్దలు ఉద్యోగుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కార్మికుల హక్కులు హరించినా నాడు ఉన్న ఉద్యోగుల జేఏసీ నాయకులు నోరు మెదపలేదని ఆరోపించారు. ఉద్యోగ సంఘాలను, సంఘాల నేతలను ఉక్కుపాదంతో అణిచివేసినప్పుడు నాటి ఉద్యోగ నేతలు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో రెవెన్యూ వ్యవస్థను చిన్నాభిన్నం చేసి, వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారని, జీవో 317తో ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారని, అయినా గత జేఏసీ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీనే జీతాలు పడుతున్నాయని, ఉద్యోగుల కష్ట నష్టాల గురించి సీఎం రేవంత్ రెడ్డికి సంపూర్ణ అవగాహన ఉందని చెప్పారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగుల ఆరోగ్యం, పదోన్నతుల క్యాలెండర్ అమలు, హౌసింగ్ పాలసీకి కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనా కాలంలో ఉద్యోగుల విషయంలో జరిగిన పొరపాట్లు, ఉద్యోగులకు జరిగిన అన్యాయాలు మళ్లీ పునరావృతం కావొద్దనే ఆలోచనతోనే ఏకతాటిపైకి వచ్చినట్లు చెప్పారు. తాము ఆ సంఘాలకు పోటీగా ముందుకు రావడం లేదని, ఆ సంఘాల గుత్తాధిపత్యం రాచరికంలా ఉండొద్దని, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి కృషి చేయడానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షురాలు నిర్మల, పీఆర్‌టీయూ అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అశ్వత్థామ రెడి తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- సెప్టెంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా నిరసన
- సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం

బర్కత్‌పుర, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 1న రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ తెలిపారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ప్రకటించిందని, ఈ మేరకు రాష్ట్రంలోని 3 లక్షల ఉపాధ్యాయ, ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2004 సెప్టెంబరు 1న అప్పటి ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి సీపీఎస్‌ను తీసుకువచ్చి ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1ని విద్రోహదినంగా ప్రకటిస్తూ ఈ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

రాజన్న ఆలయంలో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 25: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ముగ్గురు ఉద్యోగులపై వేటు పడింది. ఈ మేరకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాజరాజేశ్వరస్వామి వారికి నిత్యం ఉదయం 11.30 గంటలకు నివేదన సమయంలో నైవేద్యం సమర్పించాల్సి ఉంటుంది. వంట చేయాల్సిన బ్రాహ్మణ వంట మనిషి ఈ నెల 23న పూటుగా తాగి విధులకు హాజరయ్యాడు. స్వామి వారికి ఉడకని అన్నంతో అరగంట ఆలస్యంగా నైవేద్యం సమర్పించిన ఘటనలో విచారణ జరిపి సదరు ఉద్యోగిని విధుల నుంచి సస్పెండ్ చేశారు. అలాగే ఆలయంలో గైడ్‌గా పనిచేసే వ్యక్తిని, సేవాదారుగా విధులు నిర్వర్తించే కాంట్రాక్టు సిబ్బందిపై అవినీతి ఆరోపణలు రావడంతో విధుల నుంచి ఈవో తొలగించారు.

జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు అవకాశాలు

- ఐఐటీ-హెచ్ 'జపాన్ డే'లో జెట్రో డైరెక్టర్ జనరల్

కంది, ఆగస్టు 25 : జపాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల కొరత ఉందని, ఆ దేశ కంపెనీల్లో విదేశీయులకు మెరుగైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని జెట్రో(జపాన్ ఎక్స్‌టర్నల్ ట్రేడ్ ఆర్గనైజేషన్) బెంగళూరు విభాగం డైరెక్టర్ జనరల్ తోషిహిరో మిజుతానీ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలో ఉన్న ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ (ఐఐటీ-హెచ్)లో ఆదివారం జరిగిన 7వ జపాన్ కెరీర్ డే కార్యక్రమంలో మిజుతానీ పాల్గొన్నారు. జపాన్ కంపెనీలకు అవసరమైన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు ఐఐటీ-హెచ్‌లో జెట్రో ప్రతీ ఏటా జాబ్ మేళా నిర్వహిస్తుంది. అయితే, జపాన్‌లో ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించేందుకు జపాన్ కెరీర్ డే పేరిట ముందుగా ఓ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఐఐటీ-హెచ్‌లో ఆదివారం జరిగిన జపాన్ కెరీర్ డే కార్యక్రమంలో జపాన్‌కు చెందిన 18 కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఐఐటీ-హెచ్‌లో డిసెంబరులో జాబ్ మేళా నిర్వహిస్తామని మిజుతానీ ఈ సందర్భంగా ప్రకటించారు. తమ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్న జెట్రోకు ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి ధన్యవాదాలు తెలియజేశారు.



హైడ్రాకు మద్దతుగా వాకథాన్ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు

హైడ్రాకు మద్దతుగా వాకథాన్

- సేవ్‌లేక్స్- సేవ్ లైఫ్ పేరుతో కార్యక్రమం
- గండిపేట చెరువు వద్ద ప్లకార్డుల ప్రదర్శన

నార్సింగ్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెరువులను, నాలాలను ఆక్రమించి ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాకు నగర పౌరులు మద్దతు పలుకుతున్నారు. ఈ మేరకు ఆదివారం చారిత్రక గండిపేట జలాశయం వద్ద పెద్ద ఎత్తున వాకథాన్ నిర్వహించారు. గండిపేట వెల్ఫేర్ సొసైటీతోపాటు మరికొంత మంది స్వచ్ఛంద సంస్థలు, పలు కళాశాలల వారు వాకథాన్‌లో పాల్గొన్నారు. గండిపేట చెరువు వద్ద 'సేవ్ లేక్స్- సేవ్‌లైఫ్' అంటూ హైడ్రాకు మద్దతుగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిమాయత్‌సాగర్, గండిపేట ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంతా కలిసి హైడ్రాకు మద్దతుగా నిలిచామంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. అలాగే గండిపేట సొసైటీ ఆధ్వర్యంలో 'సేవ్‌లేక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. భావితరాలకు స్వచ్ఛమైన మంచినీరు కోసం నదులు, చెరువులు, నీటి వనరులను సంరక్షించుకోవాలని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.చంద్రమోహన్‌రెడ్డి సూచించారు. సీబీఐటీ కళాశాల సిబ్బంది, విద్యార్థులూ సేవ్ లేక్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

74 ట్రామా కేర్ కేంద్రాలు

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ లైఫ్ లైన్ ఫర్ మెడికల్ ఎమర్జెన్సీ (టెల్‌మీ) పేర్లలో ఒక దాన్ని పెట్టే అవకాశం ఉన్నట్లు వైద్య వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం తెలంగాణలో 9 జాతీయ రహదారులు, ఒక రాష్ట్ర రహదారి ఉంది. ఇప్పటికే ఎన్‌హెచ్ 65(హైదరాబాద్- విజయవాడ)పై ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కొర్లపాడు టోల్ ప్లాజా వద్ద ఓ ప్రైవేటు సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద ట్రామాకేర్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది. కాగా ప్రస్తుతం జాతీయ, రాష్ట్ర రహదారులపై నెలకు సగటున 12 వేలకు పైగా ట్రామా కేసులొస్తున్నాయి. రోజుకు సగటున 425 కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ మధ్య 51,405 కేసులు నమోదయినట్లు వైద్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో రెండు రకాల ఎమర్జెన్సీలున్నాయి. ఒకటి నాన్ వెహిక్యులర్ ట్రామా, రెండోది వెహిక్యులర్ ట్రామా. నాన్ వెహిక్యులర్ ట్రామాలో కాలిన గాయాలు, ఆత్మహత్యాయత్నాలు, రేప్ కేసులు, కత్తిపోట్లు, గన్‌షాట్స్, కరెంటు షాక్‌లు, నీళ్లలో మునిగిపోవడం లాంటివి వస్తాయి. వెహిక్యులర్ ట్రామాలో రోడ్డు, రైలు ప్రమాదాలు వస్తాయి. కాగా, గ్రామీణ ప్రాంతాల్లో నాన్ వెహిక్యులర్ కేసులు ఎక్కువగా వస్తున్నట్లు వైద్య శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో గ్రామీణ ప్రాంతాల్లో 11,178, పట్టణ ప్రాంతాల్లో 8,377, గిరిజన ప్రాంతాల్లో 1,697 నాన్ వెహిక్యులర్ కేసులొచ్చాయి. వెహిక్యులర్ కేసులు కూడా సుమారుగా ఇదే నిష్పత్తిలో నమోదయ్యాయి.

మూడు దశల్లో ఏర్పాటు..

వచ్చే నెల నుంచి మొదటి దశ ట్రామా కేర్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా వైద్య ఆరోగ్య శాఖ కసరత్తులు చేస్తోంది. మొత్తంగా మూడు దశల్లో వీటిని పూర్తి చేయనుంది. మొదటి, రెండో దశల్లో 24 చొప్పున, మూడో దశలో 26 చొప్పున 74 ట్రామాకేర్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులకు(వంద పడకలకు పైగా ఉన్నవి) అనుసంధానంగా వీటిని ఏర్పాటు చేయనున్నారు. ప్రధాన రహదారికి పక్కనే కాకుండా లోపలికి సుమారు ఒకటి రెండు కి.మీ. దూరంలో వీటిని తీసుకువస్తామని వైద్యవర్గాలు వెల్లడించాయి. రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు గోల్డెన్ అవర్ మిస్ అవుతున్నారు. సర్కారీ దవాఖానాలకు వస్తే వెంటనే వారికి వైద్యం అందడం లేదు. కొన్నిసార్లు కనీస వైద్య సేవలందించలేని పరిస్థితి ఉంటోంది. స్పెషాలిటీ వైద్యులు లేకపోవడంతో ఇతర ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దాంతో పెద్దాస్పత్రులపై భారం పడుతోంది. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ట్రామా కేర్ కేంద్రాలను భారీగా ఏర్పాటు చేస్తోంది. ఇవి ఐదంచెల వ్యవస్థలో పనిచేస్తాయి. మొదట ప్రమాదం జరగ్గానే క్షతగాత్రులను అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలిస్తారు. రెండో అంచెలో బాధితులను అత్యవసర విభాగంలో ఉంచి, వైద్య సేవలందిస్తారు. మూడో దశలో డ్యామేజ్ కంట్రోల్ సర్జరీలు, నాలుగో దశలో కచ్చితమైన సంరక్షణ, ఐదో దశలో రిహబిలిటేషన్ ఉంటుంది. మొదటి మూడు దశల్లో ట్రామా కేర్ కేంద్రాల్లో వైద్య సేవలందుతాయి. నాలుగు, ఐదు దశలో రిఫరల్ ఆస్పత్రులకు పంపుతూ, ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య సేవలందిస్తారు.

ట్రామా కేర్ కేంద్రాల బలోపేతానికి రూ.1,116 కోట్లు

వచ్చే ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 74 ట్రామాకేర్ కేంద్రాల కోసం రూ.1,116 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. ఆ కేంద్రాలను మరింత బలోపేతం చేయడంతో పాటు యంత్ర పరికరాల కొనుగోలు, వైద్య సిబ్బంది జీత భత్యాలు, అంబులెన్స్‌ల నిర్వహణ, బ్లడ్ బ్యాంకుల ఏర్పాటు, టెలీ మెడిసిన్ కేంద్రాలు, ఇతరత్రా ఖర్చులన్నీ కలిపి అంత అవుతుందని అంచనా వేశారు. తొలి ఏడాది రూ.138 కోట్లు, రెండో ఏడాది రూ.206 కోట్లు, మూడో ఏడాది రూ.303 కోట్లు నాలుగో ఏడాది రూ. 220 కోట్లు, ఐదో ఏడాది రూ. 248 కోట్లు అవుతుందని వైద్య శాఖ అంచనా వేసింది.

ట్రామాకేర్ కేంద్రాల్లో ఎవరెవరు ఉంటారంటే..

ఒక్కో ట్రామా కేర్ కేంద్రంలో 73 మంది వైద్య సిబ్బంది ఉంటారు. ఇందులో ఇద్దరి చొప్పున ఆర్థోపెడిక్ సర్జన్, జనరల్ సర్జన్, అనస్తీషియలిస్ట్, రేడియోగ్రాఫర్, సీటీ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్, పైలట్ డ్రైవర్.. ఆరుగురు చీఫ్ మెడికల్ ఆఫీసర్లు, 24 మంది స్టాఫ్‌నర్సులు, ఆరుగురి చొప్పున ఏఎన్ఎమ్‌లు, ఓటీ టెక్నీషియన్లు ఉంటారు. అలాగే ఎమర్జెన్సీ రూమ్ టెక్నీషియన్లు నలుగురు, ఒక బయోమెడికల్ టెక్నీషియన్, మరో 12 మంది సహాయక సిబ్బంది ఉంటారు. మొదటి దశలో ఏర్పాటయ్యే ట్రామా కేర్ కేంద్రాల్లో పని చేసే వీరందరి జీత భత్యాలకు నెలకు రూ.21.36 కోట్లు అవుతుందని వైద్య శాఖ అంచనా వేసింది.



చంద్రబాబును కలిసిన బాబూమోహన్

మబ్బుల్ని ఛేదించే నాయకత్వం ఉండాలి

(మొదటి పేజీ తరువాయి)

ఒకసారి తాను రాష్ట్ర పార్టీ కార్యక్రమాలను సమీక్షిస్తానని తెలిపారు. తెలంగాణలో పార్టీ పునర్నిర్మాణం తన లక్ష్యమని చంద్రబాబు చెప్పారు. పార్టీ బలోపేతం కోసం క్షేత్రస్థాయి నుంచి విస్తృత అభిప్రాయ సేకరణ చేపట్టి, రాష్ట్రస్థాయిలో సమీక్ష చేయాలని ముఖ్యనేతలకు సూచించారు. అలాగే.. పార్టీ రాష్ట్ర కమిటీని చంద్రబాబు రద్దుచేశారు. దీంతో పార్లమెంటు, మండల, గ్రామ కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలు కూడా రద్దయ్యాయి. సభ్యత్వ నమోదు కోసం రాష్ట్రస్థాయిలో, పార్లమెంటు నియోజకవర్గస్థాయిలో అడ్‌హాక్ కమిటీలను ఏర్పాటుచేయనున్నారు. ఏపీ, తెలంగాణాల్లో ఒకేసారి సభ్యత్వ నమోదు ప్రారంభం అవుతుందని చంద్రబాబు ప్రకటించారు. సభ్యత్వ నమోదు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఉంటుందని తెలిపారు. సభ్యత్వ నమోదు చేస్తూనే పార్లమెంటు నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాలని పిలుపునిచ్చారు. కాగా.. సినీనటుడు, మాజీ మంత్రి బాబూమోహన్.. ఆదివారం ఎన్టీఆర్ భవన్‌లో చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. త్వరలో ఆయన టీడీపీలో చేరే అవకాశం ఉందని పార్టీ నేతలు తెలిపారు.

రాష్ట్రంలో నెలాఖరు వరకు వర్షాలు

4 రోజుల పాటు యెల్లో అలెర్ట్.. ఉమ్మడి కరీంనగర్, నిర్మల్, హైదరాబాద్‌లో అక్కడక్కడ వానలు

- శ్రీశైలం, సాగర్‌కు తగ్గిన వరద
- ఎస్సారెస్పీకి 34,952 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు ఈనెల 31 వరకు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. సోమ, మంగళవారాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని.. కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వివరించింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. ఈనెల 29 వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. ఆదివారం రాష్ట్రంలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడ్డాయి. ఉమ్మడి కరీంనగర్, నిర్మల్ జిల్లాల్లో మోస్తరుగా.. హైదరాబాద్‌లో అక్కడక్కడ చిరు జల్లులు కురిశాయి. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కొండాపూర్‌లో 5.4 సెం.మీ., కరీంనగర్ జిల్లా చిగురుమామిడి, నిర్మల్ జిల్లా లక్ష్మణచాందలో 4.9 సెం.మీ., ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలంలో 4.7 సెం.మీ., అదే జిల్లా పెంచికల్‌పేటలో 4.2 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మధ్యాహ్నం గంట పాటు భారీ వర్షం కురవగా.. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ఆల్మట్టికి పెరిగిన వరద..

కృష్ణా బేసిన్‌లోని ఎగువ ప్రాజెక్టులు ఆల్మట్టి, నారాయణపూర్‌లకు మళ్లీ ఇప్పుడిప్పుడే వరద పెరుగుతుండగా.. దిగువన శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహాలు తగ్గాయి. తుంగభద్ర వినహా అన్ని ప్రాజెక్టుల్లోనూ నీరు నిండుగానే ఉంది. ఆల్మట్టికి 46,739 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో ఉండగా.. లక్ష క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉంది. నారాయణపూర్‌కు 40 వేల క్యూసెక్కులు వస్తుండగా, 66,270 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 31 వేల క్యూసెక్కులు వస్తుండగా.. జల విద్యుదుత్పత్తి ద్వారా 39 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర డ్యామ్‌కు 23,725 క్యూసెక్కులు వస్తుండగా, దిగువకు నీటిని విడవట్లేదు. శ్రీశైలానికి 45,855 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, విద్యుదుత్పత్తి ద్వారా 69,282 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 37,882 క్యూసెక్కులు వస్తుండగా.. మొత్తం 48,818 క్యూసెక్కులను దిగువకు విడుదలవుతోంది. ఇటు గోదావరి బేసిన్‌లో శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టుకు 34,952 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో ఇళ్లలోకి చేరిన నీరు

గజ్వేల్ నుంచి కొడంగల్‌కు..

- ఆర్ అండ్ బీ ఈఈ కార్యాలయం మార్పు !
- మాజీ సీఎం నియోజకవర్గం నుంచి ప్రస్తుత సీఎం ఇలాకకు..
- యాదాద్రి ఆర్ అండ్ బీ ఈఈ ఆఫీసు రాజేంద్రనగర్‌కు

హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన అథారిటీల పరిధిలోని వివిధ శాఖల కార్యాలయాలు మరో ప్రాంతానికి మారబోతున్నాయి. వీటిల్లో గజ్వేల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (గడా) కింద ఆ ప్రాంత అభివృద్ధి కోసం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన రోడ్లు, భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కార్యాలయం కూడా ఉంది. ప్రస్తుతం గజ్వేల్‌లో ఉన్న ఈ కార్యాలయం త్వరలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా)కు మారనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్ నుంచి ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ పరిధిలోకి కార్యాలయం మారనుండడం ఆసక్తికర అంశం. అలాగే, యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని యాదగిరిగుట్ట, పరిసర ప్రదేశాల అభివృద్ధి కోసం ఏర్పాటుచేసిన ప్రత్యేక డివిజన్ కార్యాలయం కూడా మరో ప్రాంతానికి మారనుంది. యాదాద్రి నుంచి రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ దగ్గర నూతనంగా నిర్మితమవుతున్న హైకోర్టు భవనం ప్రాంగణానికి ఈ కార్యాలయం తరలనున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి కసరత్తు జరుగుతోందని, త్వరలోనే మార్గదర్శకాలు విడుదల కానున్నట్లు సమాచారం.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నియోజకవర్గమైన గజ్వేల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధి కోసం గడాను ఏర్పాటు చేశారు. దాంతో పాటు మల్లన్నసాగర్, రంగనాయక్ సాగర్ సహా వివిధ ప్రాంతాలకు రోడ్ల అనుసంధానంతో పాటు ఇతర పనులు కలిపి దాదాపు రూ.500 కోట్ల మేర నిధులను మంజూరు చేశారు. ఆయా పనులన్నింటినీ పర్యవేక్షించేందుకు రోడ్లు, భవనాల శాఖ పరిధిలో గజ్వేల్‌లో ఈఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ ప్రాంత అభివృద్ధి కోసం మంజూరు చేసిన పనులన్నీ పూర్తయ్యాయి. అదే సమయంలో కడాకు వివిధ రకాల పనులతో పాటు, సమీకృత గురుకులాల నిర్మాణ పనులు కలిపి దాదాపు రూ.500 కోట్ల మేర పనులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో కడాలో పనులు ఎక్కువగా ఉండడం, పైగా సీఎం సొంత నియోజకవర్గం కావడంతో.. ప్రత్యేక కార్యాలయాన్నీ అక్కడ ఏర్పాటు చేయాలని శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఇక, యాదాద్రి ప్రత్యేక డివిజన్ కార్యాలయం పరిధిలో పనులు కొలిక్కి రావడంతోపాటు భారీ నిర్మాణాలు లేకపోవడంతో.. రాజేంద్రనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న హైకోర్టు భవన పనుల పర్యవేక్షణ నిమిత్తం అక్కడికి ఆ కార్యాలయాన్ని తరలించాలని అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

తెలుగు రాష్ట్రాల్లో..'తాగేస్తున్నారు'!

- దేశంలో అత్యధిక మందుబాబులిక్కడే
- తెలంగాణలో వార్షిక తలసరి వినియోగ వ్యయం రూ.1,623
- ఏపీలో రూ.1,306 వరకు ఖర్చు
- తర్వాతి స్థానాల్లో ఛత్తీస్‌గఢ్, పంజాబ్
- పన్నుల రాబడిలో మద్యమే కీలకం
- కేంద్ర విభాగం 'నిపెప్' వెల్లడి



న్యూఢిల్లీ, ఆగస్టు 25: 'మందుబాబులం.. మేము మందుబాబులం..' అన్న మాట తెలుగు నాట నిజమైంది. దేశవ్యాప్తంగా మద్యం వినియోగంలో రెండు తెలుగు రాష్ట్రాలు పోటీ పడుతున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం వినియోగం ఆధారంగా కేంద్ర ఆర్థిక శాఖ పరిధిలోని స్వయం ప్రతిపత్తి సర్వే విభాగం నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఫైనాన్స్ అండ్ పాలసీ(నిపెప్) తాజాగా విడుదల చేసిన అధ్యయనంలో వెల్లడించింది. ఈ అధ్యయనానికి నేషనల్ శాంపిల్ సర్వే ఆఫీస్(ఎన్ఎస్ఎస్ఓ), కన్స్యూమర్ పిరమిడ్స్ హౌస్‌హోల్డ్ సర్వే(ఎస్‌పీహెచ్ఎస్)లను ప్రామాణికంగా తీసుకుంది. దీని ప్రకారం.. మద్యంపై తెలంగాణ వార్షిక సగటు తలసరి వినియోగ వ్యయం రూ.1,623 ఉండగా, ఏపీలో రూ.1,306గా ఉంది. ఎన్ఎస్ఎస్ఓ ప్రకారం తర్వాత స్థానాల్లో ఛత్తీస్‌గఢ్ రూ.1,227, పంజాబ్ రూ.1,245, ఒడిశా రూ.1,156గా ఉన్నాయి. కేరళ రూ.486, హిమాచల్ ప్రదేశ్ రూ.457, తమిళనాడు రూ.330, రాజస్థాన్ రూ.308 వ్యయం చేస్తున్నాయి. ఇక, రెండు సర్వే సంస్థలు ఇచ్చిన నివేదికల ప్రకారం ఉత్తరప్రదేశ్‌లో తలసరి వినియోగ వ్యయం రూ.75, రూ.49గా ఉండడం విశేషం.

పన్నులు పిండేస్తున్నారు

మద్యం వినియోగం ద్వారా ఆయా రాష్ట్రాలు పన్నులు పిండుకుంటున్నాయని నిపెప్ అధ్యయనం తెలిపింది. మద్యంపై వస్తున్న పన్నులు రాష్ట్రాలకు మూడో అతి పెద్ద ఆదాయ వనరుగా ఉందని పేర్కొంది. జార్ఖండ్ అత్యల్పంగా 67 శాతం పన్నులు వసూలు చేస్తుండగా, గోవా అత్యధికంగా 722 శాతం ఆదాయం పొందుతున్నట్టు వివరించింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్, దేశీయ మద్యం, బీరు, ఇతర నార్కోటిక్ పదార్థాలపై కూడా పన్నులు భారీగానే వసూలు చేస్తున్నట్టు తెలిపింది. చిత్రం ఏంటంటే.. కొన్ని రాష్ట్రాలు ఎక్సైజ్ పన్నులతో పాటు మద్యంపై అమ్మకం పన్నులు కూడా వసూలు చేస్తున్నాయని అధ్యయనం పేర్కొంది. మద్యం ద్వారా జీఎస్టీ ఆదాయం మరింత మెరుగుపడినట్టు తెలిపింది. కాగా, మద్యం ఆదాయంలో సంస్కరణలు తీసుకు రావాలని అధ్యయనం సూచించింది.

మరిన్ని విషయాలు..

- మద్యం ఉత్పత్తి ఆధారంగా 2012-22 మధ్య 160 శాతంగా ఉన్న ఎక్సైజ్ వసూళ్లు 252 శాతానికి పెరిగాయి.
- ఏపీ సహా బిహార్, గోవా, జార్ఖండ్, త్రిపుర, కర్ణాటక రాష్ట్రాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో నెలవారీ మద్యం వినియోగ సగటు అత్యధికంగా ఉంది.
- యూపీ సహా అస్సోం, ఛత్తీస్‌గఢ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లోని పట్టణ ప్రాంతాల్లో నెలవారీ మద్యం వినియోగ సగటు ఎక్కువగా ఉంది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.